: fb.com/vaartha Digital

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com
WWW.VAARTHA.COM

గుంటూరు

21-6-2026 ఆదివారం
సంపుటి: 32 సంచిక: 141
పేజీలు: 12 వెల: 8.00


Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

# సంజీవనిలో 'యోగా'

## దేశంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా ఏపి: సిఎం చంద్రబాబు

### చంద్రబాబు మహాయోగి: రాందేవ్ బాబా ప్రశంస

### ఉండవల్లి గుహల వద్ద ఘనంగా 'యోగాంధ్ర'



శనివారం అమరావతిలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, రాందేవ్ బాబా

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజారోగ్యం కోసం తెచ్చిన సంజీవని ప్రాజెక్టులో యోగా సాధన, ప్రాణామయం వంటివి కూడా చేరుస్తున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద "యోగాంధ్ర" కార్యక్రమాన్నినిర్వహించారు. బాబా రామ్‌దేవ్ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా సాధనను సిఎం చంద్రబాబు తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సిఎంకు వివరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఒత్తిడిని అదిగమించేందుకు వ్యసనం లేని సాంకేతికత విధానం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి ఆధ్యాత్మికత, యోగా ఎంతో ఉపకరిస్తుందన్నారు. దేవతల రాజధాని అమరావతిలో యోగాసాధన అందమైన ఆలోచన అని అన్నారు.

దేవతల రాజధాని అమరావతి స్ఫూర్తితో ప్రజారాజధాని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కాలుష్యంలేని రాజధాని నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు చెప్పారు.యోగాకు రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయి. >>2

నేడు ప్రపంచమంతా 'యోగముద్ర' 2లో

26 కీలకాంశాలతో నేడు 'మహాయోగా'

నీట్ రీఎగ్జామ్‌నేడే 2లో

రైతు ఖాతాల్లోకి రూ. 7వేలు జమ 2లో

సాయికృష్ణ కేసు దర్యాప్తు ముమ్మరం 3లో

# హర్ముజ్ మళ్లీ క్లోజ్

### లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఒప్పంద ఉల్లంఘనగా పేర్కొంటూ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్

**టెహ్రాన్,జూన్ 20:** దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను అమెరికాతో కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా జరిగిన చర్యలుగా పేర్కొంటూ, కీలకమైన హర్ముజ్ జలసంధిలో మరోసారి నౌకా రాకపోకలకు మూసివేస్తున్నట్లు ఇరాన్ కేంద్ర సైనిక కమాండ్ శనివారం ప్రకటించింది.ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన ప్రకటనలో సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ ఖాతమ్‌అల్ అన్‌బియా మాట్లాడుతూ, హర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలను నిలిపివేస్తున్నాం. శత్రుపక్షం ఇచ్చిన హామీని ఉల్లంఘించినందుకు ఇది >>2

PATANJALI® पतंजलि

అంతర్జాతీయ యోగా దినోత్సవం
యోగా పిలుపు

ప్రాథమికంగా, మన భారతీయులం మహర్షుల వారసులం. కాలం మనల్ని వర్గాలుగా, కులాలుగా, సమాజాలుగా విభజించి ఉండవచ్చు, కానీ కృతఘ్నత అనే పాపాన్ని నివారించడానికి మనం మన పూర్వీకులకు రుణపడి ఉండాలి. అందువల్ల, మనమందరం కలిసి యోగా సాధన చేద్దాం - ప్రతి గ్రామంలో, నగర పరిసర ప్రాంతాలలో 10, 20, 50, లేదా 100 మందితో సమూహాలను ఏర్పాటు చేసుకోండి మరియు మరింత మందికి స్ఫూర్తినిచ్చేందుకు ఈ సమావేశాల ఫోటోలు మరియు వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోండి.

మీరు స్వయంగా ప్రతిజ్ఞ చేసి, యోగా, ఆయుర్వేదం మరియు స్వదేశీ ద్వారా ఆత్మనిర్భర భారతదేశాన్ని నిర్మించడానికి ఇతరులను ప్రేరేపించండి.

వ్యతిరేకత - యోగ, ఆయుర్వేద, స్వదేశీ మరియు సనాతన సంస్కృతులను తీవ్రంగా వ్యతిరేకించి, నాశనం చేసే కుట్రలో అనేక దుష్ట శక్తులు చురుకుగా ఉన్నాయి. నిజమైన జాతీయవాద సనాతని ఆత్మలు ఈ దేవాసుర సంగ్రామంలో (మంచికి, చెడుకు మధ్య జరిగే యుద్ధం) లేదా ధర్మయుద్ధంలో (ధర్మం కోసం జరిగే యుద్ధం) పతంజలి మరియు పూజ్య స్వామి రామ్‌దేవ్ జీతో మనస్ఫూర్తిగా దృఢంగా నిలబడాలి. ఎక్కడ ధర్మం (న్యాయం) ఉంటుందో, అక్కడ విజయం ఉంటుంది; సత్యం మాత్రమే జయిస్తుంది. (యతో ధర్మః తతో జయః, సత్యమేవ జయతే)

దోపిడీ - ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ నివేదిక మరియు ఇంటర్నెట్‌లో లభించే వివిధ ఇతర ప్రామాణిక మూలాలను ఏఐ (AI) సాధనాలను ఉపయోగించి పరిశీలించడం ద్వారా, కేవలం గత 200-250 సంవత్సరాలలోనే విదేశీ కంపెనీలు మన దేశాన్ని 100 ట్రిలియన్లకు పైగా దోచుకున్నాయని నిర్ధారించుకోవచ్చు. బహుళజాతి కంపెనీలు, మెకాలే విద్యా విధానం మరియు సాంస్కృతిక అణచివేత ఈ మహోన్నత భారతదేశాన్ని వినాశన అంచుకు నెట్టాయి. 500-1000 సంవత్సరాల క్రితం నాటి మన స్వర్ణయుగాన్ని స్మరించుకుంటూ, భారతదేశ వ్యతిరేక శక్తులను ఓడించి, మన ఋషులు (ఋషులు మరియు ఋషికులు) అమరవీరుల ఆశయాలను సాకారం చేసుకుంటూ, ఒక వైభవోపేతమైన మరియు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి మనం అవిశ్రాంతంగా, ఐక్యంగా కృషి చేద్దాం.

పతంజలి యొక్క సారథ్యం - పూజ్య స్వామి రామ్‌దేవ్ జీ, ఆచార్య శ్రీ బాలకృష్ణ జీ వారి అవిశ్రాంత కృషి ద్వారా మరియు పతంజలి సంస్థ ద్వారా, యోగ, ఆయుర్వేద, స్వదేశీ మరియు సనాతన సంస్కృతుల వైభవం ఇప్పుడు యావత్ ప్రపంచానికి చేరింది. ఈ మహత్తర సేవా కార్యక్రమానికి పతంజలి లక్షల కోట్ల రూపాయల భారీ మొత్తాలను విరాళంగా అందించింది. దాదాపు 10,000కు పైగా పరిశోధనా విధానాలను పాటిస్తూ, పతంజలి విద్వాంసులు 500కు పైగా పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. పతంజలి గురుకులం, ఆచార్యకులం, పతంజలి విశ్వవిద్యాలయం, భారతీయ శిక్షా బోర్డు (BSB), పతంజలి కెరీర్ అకాడమీ, పతంజలి సివిల్ సర్వీసెస్ అకాడమీ (PCSA), పతంజలి ఆరోగ్య సంక్షేమం, పతంజలి యోగగ్రామ్, నిరామయం, పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ మరియు గోశాలలు వంటి సంస్థలను కలిగి ఉన్న పతంజలి దేశవ్యాప్త నెట్‌వర్క్‌లోని లక్షలాది మంది స్వచ్ఛంద కార్యకర్తల నిస్వార్థ అంకితభావం మరియు తపస్సుతో ఒక చారిత్రాత్మక సేవా కార్యక్రమం కొనసాగుతోంది. వందలాది మంది తాపసుల తపస్సు, లక్షలాది కర్మయోగుల నిస్వార్థ సేవ, మరియు కోట్లాది తోటి పౌరుల మద్దతే మా బలం. మా చివరి శ్వాస వరకు మా సర్వస్వాన్ని మాతృభూమికి, మానవాళికి సేవకే అంకితం చేయాలన్నదే మా దృఢ సంకల్పం.

సేవ చేయడానికి మరియు యోగ సద్గుణాలను, అలాగే శ్రీరాముడు, కృష్ణుడు మరియు శివుని సద్గుణాలను ఆచరించడానికి పతంజలితో అనుసంధానం అవ్వండి. సనాతన ధర్మాన్ని ఆచరించాలి, కేవలం బోధించకూడదు.

ఆస్థా మరియు ఇండియా టీవీ వంటి ఛానెళ్లను చూడటం ద్వారా లేదా యూట్యూబ్‌లోని కంటెంట్‌ను యాక్సెస్ చేయడం ద్వారా యోగా సాధనను రోజువారీ అలవాటుగా చేసుకోండి.

आस्था LIVE Everyday 5:00 am to 7:30 am and 8:00 pm | संस्कार Everyday 9:00 am | INDIA TV Everyday 8:00 am | YouTube Swami Ramdev | Acharya Bal Krishna

పతంజలి వారి పరిశోధన ఆధారిత ఆరోగ్య ఉత్పత్తులు, మందులు, అలాగే స్వదేశీ ఉత్పత్తులైన ఆవు నెయ్యి, దంత్ కాంతి, తేనె, కేశ కాంతి, షర్బత్, జ్యూస్‌లు కొనడానికి, గూగుల్‌లో "పతంజలి స్టోర్ నియర్ మీ" అని వెతకండి. ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ప్రధాన స్టోర్లలో లభిస్తాయి. ఒకవేళ అక్కడ లభించకపోతే, వాటిని అందుబాటులో ఉంచమని మీ దుకాణదారుడిని కోరండి.

మరిన్ని వివరాల కోసం, పతంజలి ప్రధాన సంస్థల వెబ్‌సైట్‌లను సందర్శించండి.

సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాలను అనుభవించడానికి పతంజలి వెల్నెస్‌ను సందర్శించండి; నమోదు కోసం, దయచేసి సంప్రదించండి: 8954-666-111

భారతీయ శిక్షా బోర్డు మరియు పతంజలి సివిల్ సర్వీసెస్ అకాడమీకి సంబంధించిన విచారణల కోసం, సంప్రదించండి: 8954-555-999





శనివారం ఉండవల్లి గుహలవద్ద సిఎం చంద్రబాబు సమక్షంలో యోగాసనాలు వేస్తున్న రామ్‌దేవ్ బాబా

# సంజీవనిలో 'యోగా'

>> ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉంది. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరం. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 31 శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంఅని సిఎం చంద్రబాబు అన్నారు.రామ్ దేవ్ బాబాతో నాకు 30 యేళ్ల నుంచి పరిచయం ఉందన్నారు. రామ్ దేవ్ బాబా యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వేలాది మంది స్వచ్ఛంధంగా వచ్చి రామ్ దేవ్ బాబా దగ్గర యోగాలో శిక్షణ తీసుకుంటారు. ఉండవల్లి గుహల వద్ద యోగాసాధన చేయడం విశేషం అన్నారు.6- 7 శతాబ్దాలకు చెందిన ఉండవల్లి గుహలకు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉంది అన్నారు.పద్మనాభ స్వామి ఈ ఉండవల్లి గుహల్లో కొలువై ఉన్నాడు.దేవతల రాజధాని అమరావతి స్ఫూర్తితో ప్రజా రాజధానిని నిర్మిస్తున్నాం. రాజధానికి భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు. నేను 30 యేళ్ల నుంచి టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నాను... రామ్ దేవ్ బాబా యోగాను ప్రమోట్ చేస్తున్నారు. టెక్నాలజీ వితవుట్ అడిక్షన్ అనే విధానంలో వెళ్లాలి అన్నారు.దీనికి ఆధ్యాత్మిక, యోగా వంటివి ఉపకరిస్తాయి.ప్రధాని మోడీ యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారు 190 దేశాలు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి.యోగాతో శరీరం, మెదడు అనుసంధానం అవుతాయి. మన విలువలను కాపాడుకోవాలి.. భావితరాలకు అందించాలి.అమరావతి, విజయవాడల్లోని వివిధ ప్రాంతాల్లో యోగాభ్యాసం చేస్తూ.. మీడియా ద్వారా ప్రచారం చేయడానికి సంకల్పించిన రామ్‌దేవ్ బాబాకు ధన్యవాదాలు. ఎపిని దేశానికి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని బాబాను కోరుతున్నాను. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం.. 20 లక్షల రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి వస్తున్నారు.

ఆధ్యాత్మికతతో వికసిత్ భారత్ సాధించాలని ప్రధాని ప్రయత్నిస్తున్నారు.. ఆయనకు సహకరిద్దాం.యోగా సాధన కోసం ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలి అన్నారు.ప్రస్తుత తరానికి యోగాసాధనను అలవాటు చేస్తే.. అద్భుతమైన భవిష్యత్తును వారికి అందించినట్టు అవుతుంది.ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నాం.అందుకనే సంజీవనిలో భాగంగా యోగాసాధన, ప్రాణామయం వంటివి కూడా చేరుస్తున్నా అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాం. ఈ ఏడాది యోగా డేను అమరావతిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాఅన్నారు ప్రతీ ఇంటికి యోగాను తీసుకెళ్లాలనేదే మా లక్ష్యం. ఓ మిషన్ మోడ్‌లో యోగాను అందరికీ చేరువ చేస్తాం అన్నారు.సైబరాబాద్ నిర్మాణం తర్వాత అమరావతి రాజధాని నిర్మాణ అవకాశం భగవంతుడు నాకు ఇచ్చాడు.సైబరాబాద్, హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రానికి అత్యధిక ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఎదిగింది.హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం, హెల్తీ, వెల్తీ, హ్యాపీ, ఆధ్యాత్మిక నగరంగా అమరావతిని నిర్మాణం చేస్తున్నాం.టెక్నాలజీని అనుసంధానించి ఓ అధునాతన రాజధానిని నిర్మిస్తున్నాం. నాలెడ్జి హబ్‌గా ఈ నగరాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు.యోగాతో బాబా రామ్‌దేవ్ ప్రపంచ వ్యాప్తంగా అందరికీ చేరువయ్యారు. యోగాను ఇంటింటికీ తీసుకెళ్లేలా బాబారామ్ దేవ్‌తో కలిసి ఏపీ ప్రభుత్వం పనిచేస్తుందనానరు.

**వివిధ ఆసనాలు వేసిన రామ్ దేవ్ బాబా**

ఉండవల్లి గుహలవద్ద సిఎం చంద్రబాబుఎదుట రామ్‌దేవ్ బాబా చక్రాసనం, వృశ్చికాసనం, మయూరాసనం, హనుమానాసన్, రాజ్ కపోతాసన్, పవర్ యోగా వంటి ప్రక్రియలను ప్రదర్శించారు. ఈ వయస్సులో కూడా చంద్రబాబు ఆరోగ్యంగా ఉన్నారని రామ్ దేవ్ బాబా వ్యాఖ్యానించారు. సిఎం చంద్రబాబు అభివృద్ధి, విజన్ కలిగిన ముఖ్యమంత్రి అంటూ కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని బాబా రామ్ దేవ్ తెలిపారు. సిఎం చంద్రబాబు నన్ను ముఖ్య అతిథిగా రమ్మన్నారు.. కానీ నేను యోగా అతిథిగా వచ్చాను అన్నారు.చంద్రబాబు తరహాలో ప్రతి ముఖ్యమంత్రి పని చేస్తే వికసిత్ భారత్ 2047 లక్ష్యం ముందుగానే సాకారం అవుతుందన్నారు.



నాదెండ్ల ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలలతో సిఎం చంద్రబాబు

# తొలివిడత రూ. 7 వేలు

## పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు రైతు ఖాతాల్లోకి జమ: సిఎం చంద్రబాబు

**చిలకలూరిపేట (పల్నాడుజిల్లా), జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతి రైతు ఖాతాలోనూ తొలివిడతగా రూ. 7వేలను పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద నిధులు జమచేశామని సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అన్నదాతలకు అండగా నిలిచేలా పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతుల ఖాతాలకు విడుదలచేశామని పేర్కొన్నారు. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో పిఎం కిసాన్- అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఇవాళ మూడు కీలకమైన కార్యక్రమాల్లో పాల్గొవటం చాలా సంతోషంగాఉందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చేందుకు ఉద్దేశించిన యోగాంధ్ర కార్యక్రమంలో బాబారామ్ దేవ్‌తో కలిసి పాల్గొన్నానని తెలిపారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తయారు చేసేందుకు ఉద్దేశించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. నేడు రూ.3,125 కోట్ల రూపాయల నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇచ్చామన్నారు. గత పాలకులు రూ.12,500 ఇస్తామని కేవలం రూ.7,500 మాత్రమే చేతిలో పెట్టారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా రూ.20 వేలు మూడు విడతలుగా రైతులకు ఆర్థిక సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. విత్తన సరఫరా నుంచి మార్కెటింగ్ వరకూ రైతులు ఇబ్బందులు పడకుండా కూటమి ప్రభుత్వం అండగా ఉందన్నారు.గత పాలకులు ధాన్యం విక్రయించినా డబ్బులు చెల్లించలేక పోయింది. కూటమి వచ్చాక 48 గంటల్లోనే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని సిఎం తెలిపారు. రైతుల ఫోన్లకు సంక్షిప్త సమాచారం ద్వారా ఎప్పటికప్పుడు వ్యవసాయ సూచనల్ని పంపిస్తున్నామని, ఇ క్రాప్ విధానం ద్వారా రైతులకు పూర్తి సహకారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని తెలిపారు. కానీ గత పాలకులు ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. సాగునీరు కూడా సరిగా ఇవ్వకుండా గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. కన్న తల్లితో సమానమైన భూమిని మనం ఎరువుల, పురుగుమందుల ద్వారా విష తుల్యం చేస్తున్నామనితెలిపారు. మన ప్రాంతంనుంచి పంపిన మూడు మిర్చి కంటైనర్లును చైనా తిప్పి పంపించిందని వెల్లడించారు.

# ఎమ్మెల్సీ అనంత బాబుకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 20 ప్రభాతవార్త:** కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబుకు శనివారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబును వైద్య పరీక్షలు కోసం జైలు అధికారులు కాకినాడ సర్వజన ఆసుపత్రికి తీసుకువచ్చారు.శుక్రవారం రాజమహేంద్రవరం ఆస్పత్రిలో అనంత బాబుకు వెన్నుపూసకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించారని, గ్యాస్ట్రిక్, వెన్నుపూస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు జైలు అధికారులతో ఎమ్మెల్సీ అనంత బాబు తెలపడంతో అదనపు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.



శనివారం ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా రైరంగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

# సోలార్ విలేజ్‌గా రాష్ట్రపతి ముర్ము స్వగ్రామం

- ముర్ము పుట్టిన రోజు సందర్భంగా ఒడిశాలో రూ. 47 వేల కోట్ల అభివృద్ధి పనులు
- రాష్ట్రపతితో కలిసి ఒడిశాలో ప్రధాని పర్యటన

**మయూర్‌భంజ్(ఒడిశా), జూన్ 20:** రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన వికాస్ రా ధారా, ఒడిశా సారా బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోడీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి సోలార్ విలేజగా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతి, ఉత్కర్ష్ ఒడిశా ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ఉత్కర్ష్ ఒడిశా ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోడీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని సంతాలీ జాహిరా, హో జాహిరా అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే గాన్ పర్బా పండుగను ఘనంగా జరుపుకున్నారని, జగన్నాథ రథయాత్ర, బారిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య ప్రజాస్వామ్యం, అభివృద్ధి అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్ నేడే

## పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు: సిఎస్ సాయిప్రసాద్

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్త ప్రతినిధి:** ఈనెల 21వతేదీ ఆదివారం జరగనున్న నీట్ (యుజి)2026 రీ ఎగ్జామినేషన్ ఏర్పాట్లపై శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జిల్లా కలక్టర్లు,ఎస్పిలతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు.రాష్ట్రం నుండి 65వేల 790 మంది అభ్యర్థులు నీట్ పరీక్ష వ్రాయనున్నారని ఇందుకోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎటువంటి అవకతవకలకు ఆస్కారం రీతిలో పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహణను పూర్తిగా పర్యవేక్షి ంచాలని చెప్పారు.పరీక్షలు సజావుగా సాగేందుకు వీలుగా ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు వీలుగా సుమారు 1500 మంది పోలీస్,సిఆర్పిఎఫ్ సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు.పరీక్షా పత్రాలను ఆయా పరీక్షా కేంద్రాలకు తగిన పోలీస్ భద్రత మధ్య తరలించడం పరీక్ష పూర్తయ్యాక తిరిగి ఆయా జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకువచ్చి సిసిటివి నిఘా మధ్య భద్రపర్చాల్సి ఉందని దీనిపై కలక్టర్లు,ఎస్పిలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిఎస్ సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

నీట్ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2గం.ల నుండి సా.5గం.ల వరకూ నిర్వహించడం జరుగుతుందని ఆయా పరీక్షా కేంద్రాలకు వెలుపల ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి నిషేధాజ్ఞలు అమలు చేయాలని ఆదేశించారు. దివ్యాంగులైన అభ్యర్థులకు పరీక్ష వ్రాసేందుకు అదనంగా గంట సమయం ఇవ్వడం జరుగుతుందుని సిఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఫోటోకాపీ దుకాణాలు, సైబర్ కేఫ్‌లు మరియు కోచింగ్ హబ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచి నిషేధాజ్ఞలను అమలు చేయాలని సిఎస్ ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు,ప్రాధమిక చికిత్స సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సిఎస్ సాయి ప్రసాద్ ఆదేశించారు.

# హర్మూజ్ మళ్లీ క్లోజ్

>> తొలి ప్రతిస్పందన. దాడులు కొనసాగితే, తమ బాధ్యతలను నిర్వర్తించేలా ప్రత్యర్థిని ఒత్తిడి చేసేందుకు మరిన్ని చర్యలు చేపడతామని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, లెబనాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం, దేశంలోని సుమారు 20 ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. నబాతియెహ్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో 16 మంది మరణించినట్లు లెబనాన్ పౌర రక్షణ సంస్థ వెల్లడించింది.ఈ వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ మధ్య మధ్యప్రాచ్య యుద్ధాన్ని అన్ని రంగాల్లో, ముఖ్యంగా లెబనాన్‌లో నిలిపివేయడానికి ప్రాథమిక ఒప్పందం కుదిరింది. లెబనాన్ అంశం ఇరాన్ ప్రధాన డిమాండ్లలో ఒకటిగా ఉంది.

# మంత్రులే స్టార్టప్‌ల వద్దకు వెళ్లాలి: లోకేశ్

**విజయవాడ జూన్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** స్టార్టప్‌ల వద్దకు మంత్రులే వెళ్లి తమ రాష్ట్రాల్లో ఉన్న సౌకర్యాలు, రాయితీలను వివరించాలని ఎపి ఐటీ మంత్రి నారా లోకేశ్ సూచించారు. షార్క్‌ట్యాంక్ షోలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక మంత్రులు నారా లోకేశ్, కీర్తన ఎం.బి పాటిల్ పాల్గొనాలని ఇఎల్ఎ క్యాపిటల్ సిఇఒ విజయ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై అదే వేదికగా నారా లోకేశ్ స్పందిస్తూ స్టార్టప్‌లు వచ్చి మంత్రులు, ఇన్వెస్టర్లకు ప్రజెంటేషన్లు ఇవ్వడం కాదు. మంత్రులే స్టార్టప్‌ల వద్దకు వెళ్లాలి తమ రాష్ట్రాల్లో సౌకర్యాలు, రాయితీలను కంపెనీలకు వివరించాలి. కొత్తగా వ్యాపారాం ప్రారంభించే వారికి గ్రౌండ్ లెవల్ బోలెడంత పని ఉంటుంది. ప్రభుత్వాల చుట్టూ తిరుగుతూ ప్రెజెంటేషన్లు ఇవ్వడం వల్ల వారిపై ఎక్కువ బారంపడుతుంది. స్టార్టప్‌లకు ఈజీ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ కల్పించాల్సిన బాధ్యత మంత్రులపైనే ఉంది అని లోకేశ్ సూచించారు.

# నేడు ప్రపంచమంతా 'యోగముద్ర'

## కోల్‌కతాలో ప్రధాని మోడీ, రాష్ట్రాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు

## 190 దేశాల్లో 'యోగా డే' కార్యక్రమాలు

**న్యూఢిల్లీ,జూన్ 20:** ప్రపంచదేశాల్లో ఇప్పటికే అమలుచేస్తున్న అంతర్జాతీయ యోగాడేను ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు కేంద్రం సన్నాహాలుచేస్తోంది. కామన్ యోగాప్రోటోకాల్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఒకే సమయంలో యోగాను నిర్వహిస్తారు. యోగా సంగం పోర్టల్ ఏర్పాటుచేసిన కేంద్రం యోగాడేలో పాల్గొనే వ్యక్తులు సంస్థలుప్రముఖులు, అన్నివర్గాలప్రజలు ఈ పోర్టల్‌లోనమోదుచేసుకోవాలని విజ్ఞప్తిచేసింది. 21వ తేదీ అంటే ఆదివారం ప్రధానిమోడీ కోల్‌కత్తాలో యోగాడేలో పాల్గొని యోగాసనాలు ఇతర అభ్యాసకులతో కలిసి ఆచరిస్తారు. అలాగే రాష్ట్రాలముఖ్యమంత్రులు, గవర్నర్లు, బిజెపి పాలితరాష్ట్రాల్లో పార్టీకేడర్, ఎమ్మెల్యేలు,ఎంపిలు మొత్తం ఈ యోగాడేలో పాల్గొంటున్నారు. ఇప్పటికేఈ పోర్టల్‌లో నమోదుచేసుకున్నవారి సంఖ్య ఆరులక్షల మార్కును దాటిందని కేంద్రం తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు సంస్థలు, ఎన్జీవోలు, కమ్యూనిగ్రూపులు లెక్కలేనన్ని పాల్గొంటున్నాయి. భారత్‌ప్రతిపాదనతో 2015 జూన్ 21న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించినైక్యరాజ్యసమితి అప్పటినుంచి యోగా డేను కొనసాగిస్తున్నది.

ఇపుడు ప్రపంచంలోని 190 దేశాల్లో యోగాడే నిర్విరామంగా అనుసరిస్తున్నారు. యోగ ఫర్ హెల్దీ ఏజింగ్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ ఏడాది యోగాడేను అంతర్జాతీయంగా అనేక కీలకప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అమెరికాలోని వాషింగ్టన్, న్యూయార్కునగరాలతోపాటు, ఇతర ముఖ్యనగరాల్లోను నిర్వహిస్తే చైనాలోని బీజింగ్, జపాన్‌లోని టోక్యో ఇతర కీలక ముఖ్య ప్రాంతాల్లో యోగా డేను నిర్వహించడంతో లక్షలాదిమంది యోగాసన కార్యాచరణలో పాల్గొన్నారు. మానసిక ప్రశాంతత, జీవన నాణ్యత పెంపులో యోగా కీలకపాత్రపోషిస్తుందని, ఈక్రమంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న యోగా సంగం కార్యక్రమం యోగాను మరింతమంది జీవితాల్లో భాగంచేసేదిశగా ముందుకు వెళ్లాలని ప్రధాని మోడీ జాతియావత్తుకు పిలుపునిచ్చారు. అలాగే ప్రముఖ పర్యాటక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల్లో యోగాడేను నిర్వహించడంద్వారా ఈ పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు పురావస్తుశాఖ కూడా ముందుకువచ్చింది. ఆగ్రాకోట, ఫతేపూర్ సిక్రీ, మహతాబ్ బాగ్‌లలో ఉచితప్రవేశంప్రకటించడంతోపాటుప్రత్యేక యోగా కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. అలాగే ఢిల్లీలోను, కోల్‌కత్తా, చెన్నై, ఒడిశా ఇలా ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నింటిలోను యోగా నిర్వహించడంద్వారా ఆ ప్రాంతాలకు వన్నెతీసుకురావాలని పురావస్తుశాఖ కార్యాచరణ అమలుచేస్తోంది.

# నేడు 26 కీలకాంశాలతో 'మహాయోగా'

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. యోగాంధ్రతో ఆరోగ్య విప్లవానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారింది. పట్టణాలు, నగరాల నుంచి పల్లెల వరకు యోగాతో శ్వాసించనున్నారు. నేడు రాష్ట్రంలో ఏకంగా 1.07 కోట్ల మందితో ఏకకాలంలో యోగాసన కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 5 గంటల నుంచే యోగా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. విజయవాడ ఇందిరాంగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, యోగా గురువు బాబా రాందేవ్ పాల్గొంటున్నారు.ఒకప్పుడు నగరాలు, పట్టణాల్లో ఆరోగ్యాభిలాషులకు మాత్రమే పరిమితమైన యోగా, కూటమి ప్రభుత్వం చొరవతో ఇప్పుడు పల్లెల వరకు చేరింది. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర 2026 పేరుతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రెండు వారాలపాటు యోగాసన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, సముద్రతీరాలు, ఇలా ప్రజలు చేరే ప్రతి ప్రదేశం యోగాసనాలకు వేదికగా మారాయి. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అనుసరించి ఈ నెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర 2026 ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. యోగాసన కార్యక్రమాలు, ఏర్పాట్లు, ఇతర అంశాల్లో ప్రభుత్వం జిల్లా అధికారుల మధ్య పోటీ పెట్టింది. రిజిస్ట్రేషన్లు, ట్రైనర్లకు శిక్షణ, పౌరుల మ్యాపింగ్, వేదికల ఖరారు, యోగా పోటీల కేటగిరిల్లో జిల్లాల మధ్య పోటీ పెట్టగా అన్ని కేటగిరీల్లో కలిపి ఏలూరు తొలిస్థానంలో నిల్చింది.

యోగాంధ్ర కార్యక్రమాలతో ముఖ్యంగా యువత, మహిళల్లో చైతన్యం కనిపించింది. మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలు, ఇతర సంఘాలు యోగాంధ్ర కార్యక్రమాలను తమవిగా భావించి విజయవంతం చేశాయి. యోగా ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్న సందేశం ప్రజల్లోనికి వెళ్లింది. దీనివల్లే లక్ష్యానికి మించి రిజిస్ట్రేషన్లు జరిగాయి. యోగాసన కార్యక్రమాలకు ఎపి చిరునామాగా మారింది. ఈ కార్యక్రమానికి సమాంతరంగా జిల్లాల్లో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల వేదికల ద్వారా కోటి 7లక్షల 41వేల 148 మంది యోగాసనాలు వేయనున్నారు. ప్రతి జిల్లాలో సగటున 4,450 చొప్పున వేదికలు సిద్ధమయ్యాయి. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమానికి సంబంధించి ఇందిరాగాంధీ స్టేడియం, అంబేద్కర్ ఆడిటోరియంలో కలిపి పదివేల మంది యోగసనాలు వేయనున్నారు.

## వారం - వర్జ్యం

21-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
సప్తమి మ.3.26,
పూర్వఫల్గుణి ఉ.9.34
వర్జ్యం : సా.5.01-సా.6.41
దు.సా.4.53-సా.5.45
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది.

**వృషభం:** ఒకరికి మీరు సహాయం చేయడమే తప్ప మీకు ఇతరులు సహకరించకపోవడం కొంత ఇబ్బంది కలిగించినా ధైర్యం వీడరు.

**మిథునం:** ప్రభుత్వ అధికారులతో విభేదించడం వలన నష్టమే తప్ప లాభం చేకూరదని గుర్తెరిగి మసలుకోండి.

**కర్కాటకం:** నూతనవ్యక్తులు పరిచయమై మాటసహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది.

**సింహం:** భూములు కొనుగోలు చేస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల కలయిక.

**కన్య:** ఆర్థికంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తపిస్తారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు.

**తుల :** కుటుంబమునందు ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. పనులలో తొందరపాటు వద్దు. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** వీసా, పాస్‌పోర్ట్ వంటి విషయాలలో సాంకేతిక లోపాలు రాకుండా జాగ్రత్తలు వహించండి. ఆరోగ్యం జాగ్రత్త.

**ధనుస్సు:** టి.వి రంగం, యాంకరింగ్ రంగాల లోని వారికి అనుకూలమైన కాలం. ముఖ్య విషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు.

**మకరం:** ప్రకృతివైద్యం, సౌందర్య సాధనాల పట్ల ఆకర్షితులవుతారు. పోటాపోటీగా ప్రతిపనిని చేసి విజయం సాధిస్తారు.

**కుంభం:** సమాజంలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించటానికి కావలసిన ప్రణాళికలు సిద్ధంచేసుకొని కార్యాచరణలో పెడతారు.

**మీనం:** కీలక విషయంలో సొంతనిర్ణయాలు శ్రేయోదాయకం. ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మాజీ ఎమ్మెల్యే బొల్లాను అడ్డుకున్న పోలీసులు

## పోలీసులు, వైకాపా మధ్య వాగ్వాదం

## బొల్లాను అడ్డుకోవడంతో కార్యకర్తల నిరసనలు

## బెయిల్‌పై విడుదలైన బ్రహ్మనాయుడికి వైసీపీ శ్రేణుల ఘన స్వాగతం

**వినుకొండ రూరల్, జూన్ 20, ప్రభాతవార్త:** రెడ్ బుక్కు సూచనల మేరకే తనను అక్రమంగా అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బొల్లా బ్రహ్మనాయుడు బెయిల్‌పై విడుదల అనంతరం శనివారం నరసరావుపేట నుండి వినుకొండ వచ్చారు. పెద్ద ఎత్తున నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణ సమీపంలోని విఠంరాజుపల్లి వద్దకు ఎదురు వెళ్లారు. అయితే అక్కడ భారీగా పోలీసులు మోహరించి, బ్రహ్మనాయుడు పట్టణంలోకి రావడానికి అనుమతించలేదు. దీంతో ఆయన అనుచరులు బ్రాహ్మణపల్లి మీదుగా కారంపూడి రోడ్‌లోని బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలోకి చేరుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు కళ్యాణ మండపానికి చేరుకోవడంతో ఆ మండపం క్రిక్కిరిసిపోయింది. బ్రహ్మనాయుడు కార్యకర్తలకు అభివాదం చేస్తూ వేదిక పైకి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సభకు పగడాల వెంకటరామిరెడ్డి అధ్యక్షత వహించి నేతలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తనపై కక్షగట్టి ఎక్కడికి అక్కడ పోలీసులను దింపి, తనను వినుకొండ వస్తుంటే అడ్డుకున్నారన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎంత ఓర్పుతో ఉంటున్నప్పటికీ, తాను హైదరాబాదులో భూకబ్జా చేశానంటూ అక్రమ కేసు బనాయించారన్నారు. అక్కడ తనపై ఎటువంటి రెవెన్యూ కేసు లేదని, ఎందుకు అరెస్టు చేశారని పోలీసులను అడిగితే వారు నోరు ఎత్తలేదని అన్నారు. తన అరెస్ట్ అంతా కుట్రపూరితంగా జరిగిందన్నారు. ప్రధానంగా ప్రస్తుత నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తనపై కక్ష కట్టి ఈ అరెస్టుకు వ్యూహం రచించారన్నారు. ఆనాడు నరసరావుపేట పార్లమెంటు సీటు వైసీపీ నుండి తనకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన, ఆయన తండ్రి రత్తయ్య జగన్ చుట్టూ తిరిగి టికెట్ దక్కించుకొని గెలిచి, అప్పుడు పనులన్నీ టిడిపి వారికే చేస్తూ వైసీపీ కార్యకర్తలను విస్మరించిన నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి శ్రీకృష్ణదేవరాయలను పక్కన పెట్టారన్నారు. అప్పుడు ఆయన టిడిపిలో చేరి ఎంపీగా గెలిచి ఢిల్లీలో పైరవీలు చేస్తున్నాడని బ్రహ్మనాయుడు ఘాటుగా విమర్శించారు. ఢిల్లీలో జరిగే స్కామ్స్‌లో నీకు ఏం సంబంధం లేదా అని కూడా బొల్లా ప్రశ్నించారు. తాను చేసే వ్యాపారాలకు ప్రభుత్వానికి విధిగా జీఎస్టీ కడుతున్నానని, మరి ఎంపీ, వినుకొండలో ఉన్న ఇరువురు ప్రజా నేతలు వారు చేసే వ్యాపారాలకు జీఎస్టీ కడుతున్నారా లేదా అని ప్రశ్నించారు. ఇక వినుకొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నానని, తన హయాంలో మంచినీటి సమస్య, వినుకొండ ఘాట్రోడ్, ఆలయ నిర్మాణాలు, ఎన్ఎస్పి కాలువ కిరువైపులా ఆహ్లాదకరమైన సిమెంట్ రోడ్డు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని, వీటన్నింటిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు, చీఫ్ విప్ ఆంజనేయులకు, మక్కెనకు బ్రహ్మనాయుడు సవాల్ విసిరారు. ఇక వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు తన వెన్నంటే ఉన్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, తాను మరింత పోరాట పటిమతో రానున్న ఎన్నికల బరిలో దిగుతానని కార్యకర్తల కేరింతల మధ్య పేర్కొన్నారు.

# ఈ యేడాది వెంకన్నకు రెండు బ్రహ్మోత్సవాలు

## సెప్టెంబర్ 15 నుంచి సాలకట్లు, అక్టోబర్ 11నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత వైభవంగా జరిగే సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగవైభవంగా జరిగే 'బ్రహ్మోత్సవాలు' ప్రధానం. ప్రతి మూడేళ్ళకోసారి అధికమాసం రావడంతో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహిస్తుంది. సాధారణంగా సెప్టెంబర్‌మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారుచేస్తారు. భారతదేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్సవాలు"కు దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహనసేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్స వాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 15వతేదీ నుండి 23వరకు ,తిరిగి అక్టోబర్ 11నుండి 20వతేదీ వరకు కన్నులపండువగా బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారుచేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు శ్రీవేంకటేశ్వరస్వామి ఎంతో ఆనందంతో, ప్రసన్నంగా వుంటారని, తనను సేవించ వచ్చిన భక్తులను చిరుదరహాసంతో కటాక్షిస్తారని అర్చకస్వాముల వాక్కు. వాహనసేవల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారు కోరిన వరాలను ప్రసాదిస్తారనేది ఐతిహ్యం. ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14వతేదీ సాయంత్రం అంకురార్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. సెప్టెంబర్ 19న రాత్రి గరుడసేవ ,23వతేదీ చక్రస్నానంతో ముగుస్తాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. అక్టోబర్ 11న రాత్రి పెద్దశేషవాహనసేవ, 15న గరుడసేవ, 20వతేదీ చక్రస్నానం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సారథ్యంలో దేవదేవుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.



## నారా భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** నారా భువనేశ్వరికి సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి భార్య, తల్లి, వ్యాపారవేత్తగా మా జీవితాలకు భువనేశ్వరి వెలుగు అని కొనియాడారు. ఆమె సౌమ్యత, దయాగుణం ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయని, సమాజంలో మంచి మార్పు తీసుకురావాలనే ఆమె తపన ఎంతోమందికి స్ఫూర్తిఅని అన్నారు. ఒక అద్భుత వ్యక్తిని నా జీవిత భాగస్వామిగా పొందానని,జీవిత ప్రయాణాన్ని పంచుకుంటున్నందుకు ఎంతగానో కృతజ్ఞుడనై ఉన్నానని అన్నారు. ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతంగా మారుస్తున్నందుకు ధన్యవాదాలన్నారు. రాబోయే కాలం భువనేశ్వరికి ఎంతో అద్భుతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## అమ్మకు జన్మదిన శుభాకాంక్షలు: మంత్రి లోకేశ్

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేశ్ తల్లి భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే ధైర్యం ఆమె సొంతం అని, ఇతరులకు



సాయం కోసం ఆమె చూపిస్తున్న అంకితభావం గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. ప్రేమ, మార్గదర్శకత్వంతో రోజూ జీవితాన్ని తీర్చిదిద్దుతున్న విలువలకు నా ధన్యవాదాలని అన్నారు. ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉంటూ ఇలాగే సేవలందించాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఎం, డి.సిఎం పుట్టిన రోజు శుభాకాంక్షలు

**విజయవాడ,జూన్ 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియా ఎక్స్‌వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజ యం సాధించాలని ఆకాంక్షిన్నాను అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తి దాయకమని పవన్ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ ఆమె సాగించిన ప్రయాణం అద్భుతమన్నారు. దేశసేవలో ఆమెకు మంచి ఆరోగ్యం,దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథస్వామిని ప్రార్థిస్తున్నాను అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## అరుదైన వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక పాలసీ

**విజయవాడ,జూన్ 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుదైన వ్యాధిగ్రస్థులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ పాలసీ ఫర్ రేర్ డీసీ జెస్2021కు అనుగుణంగా నూతన పాలసీని త్వరగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలు, బాధితులకు తోడ్పాటును అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి చెప్పారు. అలాగే మూడు రిఫరల్ కేంద్రాలు, ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ రిజిస్ట్రీ ఏర్పాటు, వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు పాలసీ తయారీపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సత్యకుమార్ తెలిపారు. మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని పాలసీ తయారీకి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. అతి త్వరలో పాలసీని రూపొందించి అరుదైన వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# తిరుమల సమాచారం

## నేడు గోవిందరాజస్వామి పుష్పయాగానికి అంకురార్పణ

**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వహించే పవిత్ర పుష్పయాగ మహోత్సవానికి నేటి ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. 22న (రేపు)ఉదయం 9.30 గంటలకు స్నపన తిరుమంజనం, అనంతరం మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల వరకు పుష్పయాగ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సుగంధభరితమైన వివిధ రకాల పుష్పాలు, పవిత్ర పత్రాలతో గోవిందరాజస్వామికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామివారి వీధి ఉత్సవం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తనుంది. పుష్పయాగ సేవలో పాల్గొనదలచిన గృహస్తులు (ఇద్దరు) 516 రూపాయలు టికెట్‌ను కొనుగోలు చేసి ఈ దివ్యసేవలో భాగస్వాములు కావచ్చని ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మే 23 నుండి 31 వరకు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు, నిత్యకైంకర్యాలలో అర్చకులు, పరిచారకులు, అధికారులు, సిబ్బంది, భక్తుల వల్ల తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు వివరించారు. ఈ దివ్య పుష్పయాగ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని టిటిడి కోరింది.



## వర్షాభావ పరిస్థితులెదురవుతున్నా వరుణయాగం జరిపించరా?

### సనాతనధర్మం ఇదేనా అంటూ భక్తుల ఆగ్రహం



**తిరుమల, జూన్ 20 ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా వేసవికాలంలో అందునా నైరుతిరుతుపవనాలు సకాలంలో ప్రభావం చూపాల్సి ఉన్నా వర్షాలు కురవడంలేదు. పైగా నైరుతి ఈ ఏడాది పెద్దగా సహకరించదనేది వాతావరణ శాస్త్రవేత్తల సమాచారం. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. శేషాచలం కొండల్లోని తిరుమలలోనూ వర్షాభావంతో ఐదు ప్రధాన జలాశయాల్లో నీరు క్రమేణా తగ్గిపోతోంది. ప్రస్తుతానికి 80రోజులకు సరిపడే నీరు మాత్రమే అందుబాటులో ఉంది. జూన్ మూడవ వారం వచ్చేస్తున్నా అటు వర్షాలుగానీ ఇటు నైరుతి రుతుపవనాలు గానీ సానుకూలత చూపడం లేదు. దీంతో వర్షాభావం తప్పదని శాస్త్రవేత్తల సూచన. ఈ నేపథ్యంలో దేశం,రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండేందుకు టిటిడి ఆగమ పండితులుఆధ్వర్యంలో కరవు పోవడానికి,సమృద్ధిగా వర్షాలు కురవడానికి తిరుమలలో కారేరీష్టి వరుణయాగం, మహావరుణజపం నిర్వహించడం పరిపాటి. దీనివల్ల పుష్కలంగా వర్షాలు కురుస్తాయి. ఇప్పుడు జూన్ మూడవ వారంలోనూ ఎండతీవ్రత ఏప్రిల్,మేనెలను తలపింపజేస్తోంది. వర్షాభావ పరిస్థితులు తలెత్తుతున్నాయి. లోకకల్యాణార్థం కారేరీష్టి వరుణయాగం నిర్వహించాలని భక్తులు, ఆగమసలహామండలి కూడా చెబుతున్నారు. అయితే టిటిడి బోర్డుగానీ, టిటిడి అధికారులుగానీ ఆ దిశగా ఆలోచన చేయ లేకపోగా నిర్లక్ష్యంగా ఉంటున్నారనేది విమర్శలు. పైగా దేవునిపై నమ్మకంతో ఈ వరుణజపాలు, యాగాలు చేపడితే వరుణదేవుడు కరుణిస్తాడని అర్చకుల విశ్వాసం. మరీ టిటిడి పెద్దలు ఆ దిశగా ఎందుకు ఆలోచన చేయడంలేదనేది మాత్రం కొసమెరుపే. ఆగమపండితులు కూడా టిటిడి బోర్డుకు, అధికారులకు ఎందుకు సూచనలు చేయడం లేదనేది ఇప్పుడు అర్చకుల్లో చర్చనీయాంశం.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ చొరవతో తప్పిపోయిన బ్యాగ్ అప్పగింత

**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై భక్తుల రద్దీనియంత్రణతోబాటు సాఫీగా క్యూలైన్లు కదిలేలా, భక్తుల కదలికలను గమనించేలా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. భక్తులు తప్పిపోయినా, విలువైన వస్తువులు మరచిపోయినా వెంటనే కనిపెట్టి భక్తులకు అందిస్తున్నారు. తాజాగా తెలంగాణకు చెందిన భక్తుడు వంగ మల్లేష్ గౌడ్ అలిపిరి చెక్ పాయింట్ (స్కానర్) వద్ద తన బ్యాగును అనుకోకుండా తిరుమలకు దర్శనార్థం వస్తూ మరచిపోయారు. వెంటనే ఆయన తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేయగా, సిబ్బంది సిసిటీవీ ఫుటేజీల ఆధారంగా బ్యాగును తీసుకెళ్లిన వాహనాన్ని గుర్తించారు. తిరుమల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. దీంతో మల్లేష్ గౌడ్ రాత్రి శుక్రవారం 11:30 గంటలకు తిరుమల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది వాహనాన్ని కనిపెట్టారు. తెల్లవారుజామున



3:30 గంటలకు బాలాజీ గెస్ట్ హౌస్ నంబర్ 4 వద్ద ఆ వాహనంలోని భక్తులను గుర్తించారు. వారిలో లక్ష్మీ కాంత్ రెడ్డి మాట్లాడుతూ స్కానింగ్ సమయంలో పొరపాటున ఆ బ్యాగు తమ వద్దకు వచ్చిందని, స్వామివారి దర్శనం కోసం వచ్చినట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌ను పరిశీలించగా అందులోని అన్ని వస్తువులతో పాటు 50 గ్రాముల బంగారం కూడా యథాతథంగాఉండటంతో బ్యాగును వం గ మల్లేష్‌గౌడ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా భక్తుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది చొర

# దీర్ఘకాలిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిద్దాం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, జూన్ 20 ప్రభాతవార్త:** కాగితంపై ఉండే వివరాలు, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను సరిగ్గా బేరీజు వేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావడంలో రెవెన్యూ వ్యవస్థ సమర్ధవంతంగా పని చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జరిగిన రెవెన్యూ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. రెవెన్యూ వ్యవస్థ కీలక సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ ఉద్యోగులను సత్కరించారు. ఈ సంధర్భంగా మాట్లాడిన రామ్మోహన్ నాయుడు రాజ్యాలు నపడడానికి రాజుల కాలాల నాటి నుండే రెవెన్యూ వ్యవస్థ ఉండేదని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన శాఖలో ఆ గౌరవాన్ని కాపాడుకుంటూ వస్తున్న ఉద్యోగ వర్గానికి రెవెన్యూ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుత విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలు కార్యరూపం దాల్చాలంటే రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకమైందని మంత్రి అన్నారు. దీర్ఘకాలిక సమస్యలను ముందుగా గుర్తించి నెలకు ఒక సమస్యపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి పరిష్కార మార్గంతో ప్రజా ప్రతినిధులను సంప్రదించే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని కలెక్టర్‌ను రామ్మోహన్ నాయుడు కోరారు.



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

పరిష్కారమే ప్రధానంగా రెవెన్యూ వ్యవస్థ సమస్యలను తీసుకోవాలని రామ్మోహన్ నాయుడు అన్నారు. పేపర్‌పై కనిపించే అంకెలకి క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే పరిస్థితులకు ఎంతో వ్యత్యాసం ఉందని వాటిని సరిగ్గా బేరీజు వేసుకుని ప్రజలకు లబ్ధి చేకూర్చడంలో రెవెన్యూ వ్యవస్థ విలువైన బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తోందని కితాబిచ్చారు. వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న శ్రీకాకుళం జిల్లాలో రెవెన్యూ అధికారులు తీసుకునే నిర్ణయాలు అత్యంత కీలకమని తెలిపిన రామ్మోహన్ నాయుడు వారి సహకారంతోనే జిల్లాలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించాలని స్పష్టం చేశారు.

పలాస ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో ప్రజలకు అనుమా నాలను నివృత్తి చేసి జరిగే అభి వృద్ధిపై అవగా హన కల్పించాలని రెవెన్యూ అధికారులను రామ్మో హన్ నాయుడు కోరారు. 1866లో ప్రారంభమైన రెవెన్యూ వ్యవస్థ నేటికీ ప్రభుత్వ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తోం దన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతిని ధులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. వివిధ మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ పరిపాలనా సిబ్బంది మరియు రెవెన్యూ సర్వీసెస్ అసోసి యేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలి

### ఎపి జెఎసి చైర్మన్ ఎ.విద్యాసాగర్

**విజయవాడ, జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఎ పి జె ఎ సి చైర్మన్‌ఎ.విద్యాసాగర్ అన్నారు విద్యాసాగర్ అధ్యక్షతన శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటేరియట్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని కీలక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించడం, ఉద్యోగులపై నమోదైన కేసులను ఉపసం హరించుకోవడం, రూ.21 వేల కోట్ల బకాయిలను చెల్లించడం, ఉద్యోగ విరమణ



వయస్సును 62 సంవత్సరాలకు పెంచడం, మెమో 57 పై సానుకూల ఉత్తర్వులు, 8 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ ప్రక్రియకు ఆమోదం తెలిపి ప్రక్రియను ప్రారంభం చేయడం వంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన వేతన సవరణ కమిషన్ నియామకంపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. 2023 నుంచి పీఆర్సీ లేకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. జే ఏ సి రాష్ట్ర సెక్రటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి పట్ల ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. జూలై నెలాఖరులోగా ప్రభుత్వం స్పందించకపోతే, జూలై 26వ తారీఖున రాష్ట్రవ్యాప్తంగా ఏపీజేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేసి కార్యాచరణ చేయాలి. ఈ విషయంలో ఉద్యమానికి గాని, ఐక్య ఉద్యమాలకు గాని వెనుకాడే ప్రసక్తి లేదన్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: నందమూరి మోక్షజ్ఞ



**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** నందమూరి బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ త్వరలోనే సినీరంగంలోకి అడుగుపెట్టనున్నారు. శనివారం ఉదయంఆయన తిరుమలకు వచ్చారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం ఆయనకు వేదశీర్వచనం అందించిస్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన మోక్షజ్ఞను చూడటానికి అభిమానులు ఉత్సాహం చూపారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.20 లక్షలు విరాళం

**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా ఉచిత అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన వల్లమూడి లలిత్ కుమార్, యలమంచిలి కృష్ణారావులు వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు ఇద్దరూ కలసి 20 లక్షలు రూపాయలు విరాళాలు అందించారు. దాతలు టిటిడి చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కులను అందజేశారు.



# ఉగ్రకుట్ర కేసులో రెండో నిందితుడిపై ఛార్జ్‌షీట్

## విజయవాడ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం సమర్పించిన దర్యాప్తు సంస్థ

### ఒక వర్గం నేతలను లక్ష్యంగా దాడులకు ప్లాన్ చేసినట్లు ఎన్ఐఏ వెల్లడి

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం పేలుడు పదార్థాలను సేకరించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో రెండో నిందితుడిపై శుక్రవారం విజయవాడలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో అభియోగపత్రం (ఛార్జ్‌షీట్) దాఖలు చేసింది. షేక్ మన్సూర్ అలియాస్ మహమ్మద్ అలీ అలియాస్ విజయకుమార్‌ను నిందితుడిగా పేర్కొంటూ ఎన్ఐఏ ఈ ఛార్జ్‌షీట్‌ను సమర్పించింది. అతనిపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం , భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ అమానుల్లా అలియాస్ అబూబకర్ సిద్దిఖీకి మహమ్మద్ అలీ అత్యంత సన్నిహితుడని, కుట్రలో కీలక పాత్ర పోషించాడని ఎన్ఐఏ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటికే అమానుల్లాపై ఫిబ్రవరి 2026లో ఎన్ఐఏ ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశారు. 2025లో అమానుల్లా నివాసంలో జరిపిన సోదాల్లో పేలుడు పదార్థాలు, ఇతర కీలక సామాగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమానుల్లానే మహమ్మద్ అలీని ఉగ్రవాదం వైపు ప్రేరేపించి, బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చాడని దర్యాప్తులో తేలింది. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ఒక రహస్య ప్రాంతానికి పేలుడు పదార్థాలను తరలించడంలో అలీ సహకరించాడని, అతను నకిలీ పత్రాలతో తన గుర్తింపును దాచి నివసిస్తున్నాడని ఎన్ఐఏ పేర్కొంది. ఒక వర్గానికి చెందిన నేతలను లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయడం ద్వారా సమాజంలో భయాందోళనలు సృష్టించి, దేశంలో షరియా చట్టాన్ని స్థాపించాలనే ఎజెండాతో వీరిద్దరూ కుట్ర పన్నారని ఎన్ఐఏ వివరించింది. మహమ్మద్ అలీ 1999లో తమిళనాడులో జరిగిన బాంబు పేలుళ్ల కేసులోనూ నిందితుడిగా ఉండి, పరారీలో ఉన్నట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఈ కేసును స్వీకరించిన ఎన్ఐఏ, లోతైన దర్యాప్తును కొనసాగిస్తోంది. ఈ క్రమంలో అవసరమైతే అదనపు ఛార్జ్‌షీట్లు దాఖలు చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

# సాయికృష్ణ అదృశ్యం కేసు దర్యాప్తు ముమ్మరం

## స్వర్గపురి శ్మశానవాటికను పరిశీలించిన పోలీసులు


**విజయవాడ,జూన్ 20. ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో సాయికృష్ణ అదృశ్యం కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సాయికృష్ణ డెడ్‌బాడీని స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేశారని ఆరోపణలు వస్తుండటంతో అక్కడ ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. మే 24, 25 తేదీల్లో స్వర్గపురి శ్మశానంలో జరిగిన గుర్తుతెలియని మృతదేహాల దహనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మే 23వ తేదీ రాత్రి 8 గంటలకు రెండు గుర్తుతెలియని మృతదేహాలను స్వర్గపురికి తీసుకువచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత స్వర్గపురిలోకి మృతదేహాలకు ప్రవేశం ఉండదు. దీంతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో చెప్పటంతో రెండు మృతదేహాలను సిబ్బంది స్వర్గపురి మార్చురీలో ఉంచారు. రెండు మృతదేహాలను మే 24న ఖననం చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ రెండు మృతదేహాలు 40 ఏళ్ల పై బడిన వారివిగా రికార్డుల్లో నమోదు అయ్యింది. 23 ఏళ్ల యువకుడిని దహనం చేసినట్లుగా ఎలాంటి రికార్డు నమోదు కాలేదు. స్వర్గపురిలో ఎలక్ట్రిక్ దహనాలు చేసే బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విచారణ నిమిత్తం బాషాను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాషా ఫోన్‌ను సీఐ పవన్ కిషోర్ స్వాధీనం చేసుకున్నారు. సాయికృష్ణ అదృశ్యంపై కృష్ణలంక పీఎస్‌లో విచారణ చేప ట్టారు. ఏసీపీ దైవప్రసాద్ బృందం టాస్క్‌ఫోర్స్ పోలీసులను ప్రశ్నిస్తున్నారు. మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడ తీసుకొచ్చారా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. ఏసీపీ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేస్తున్నారు. ఇక తాజా సమాచారాన్ని అనుసరించి సాయికృష్ణ అదృశ్యం కేసు. మలుపులు తిరుగుతూ స్వర్గపుర్తి శ్మశానవాటికకు చేరింది. సాయికృష్ణను హత్య చేసి, అతని డెడ్‌బాడీని స్వర్గపురిలో గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారనే ఆరోపణల నేపథ్యంలో... పోలీసులు అక్కడకు వెళ్లి ఆధారాలు సేకరిస్తున్నారు. మే 23వ తేదీ రాత్రి 8 గంటలకు గుర్తు తెలియని మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకు వచ్చినట్టు సిబ్బంది చెబుతున్నారు.

మే 24న వాటిని దహనం చేయడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. రికార్డుల్లో మృతదేహాలు 40 ఏళ్లకు పైబడిన వారివిగా ఉన్నాయి. సాయికృష్ణలాంటి యువకుడి దహన రికార్డులు ఎక్కడా లేవు. ఈ వ్యవహారంలో స్వర్గపురిలో ఎలక్ట్రిక్ దహనాలు నిర్వహించే బాషా అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ పవన్ కిశోర్ అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లీగల్ కాల్ డేటాను పరిశీలిస్తున్నారు.

## మొదలైన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

### సిద్ధమవుతున్న మాడవీధుల సూచిక బోర్డులు





**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది జరగనున్న రెండు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సాఫీగా కొండ ముస్తాబు చేసేందుకు అవపరమైన పనులు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, అలం కరణలు, మాఢవీదుల్లోకి వెళ్ళేందుకు ప్రవేశ నిష్క్రమణ మార్గాల సూచికబోర్డులు, అవసరమైన స్టాండ్‌లు ఇలా మెల్లగా సకల సౌకర్యాల కల్పన పనులు మొదలయ్యాయి. శ్రీవారికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు జరుగుతుంటాయి. వీటిల్లో సంవత్సరానికోసారి జరిగే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. సాక్షాత్తు బ్రహ్మదేవుడే కలియుగానికి విచ్చేసి దేవదేవునికి ఉత్సవాలు నిర్వహిస్తాడని ప్రతీతి. భక్తులు కూడా లక్షలాదిమంది ఈ తొమ్మిది రోజులు తిరుమలలోనే వుండి తమ ఇష్టదైవం వాహనసేవల్లో పాల్గొంటూ ముక్తికోసం తపిస్తుంటారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా చూడనున్నారు. దానికితోడు అదే సెప్టెంబర్‌లో పెరటాసి శనివారాలు కూడా రానుండటంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నాయి.

చట్టరీత్యా సరైన చర్యలు లేకపోవడం వల్ల అక్రమార్కులు పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడమే కాకుండా, చిన్నచిన్న జరిమానాలతో తిరిగి పరిశ్రమలను మరో పేరుతో ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్లోకి నకిలీ, కల్తీ ఉత్పత్తుల ను జొప్పిస్తున్నారు. కల్తీఆహారాన్ని అరికట్టేం దుకుప్రతిజిల్లాలో ప్రత్యేక ఆహారనిఘా బృం దాలు ఏర్పాటుచేయాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసె న్సుల డిజిటల్ పర్యవేక్షణ చేపట్టాల్సిన అవ సరం ఉంది. హోటళ్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలపై నెలవారీ తనిఖీలు నిర్వహించాలి. గోదాములు, కోల్డ్ స్టోరేజీలపై ప్రత్యేక నిఘా పెట్టాలి. కల్తీ నిరూపితమైతే లైసెన్సులనుశాశ్వ తంగా రద్దు చేయాలి. పునరావృత నేరాలకు కఠినశిక్షలు అమలు చేయాలి. ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ల సంఖ్య పెంచడంతోపాటు ప్రత్యేక న్యాయవ్యవస్థద్వారా కేసుల విచారణ వేగవం తం చేయాలి. ప్రభుత్వం, పోలీసులు, ఫుడ్సేఫ్టీ అధికారులు ఎంత చురుకుగా ఉన్నా వినియో గదారులు అప్రమత్తంగా లేకపోతే ఈ పోరా టం విజయవంతంకాదు. ప్రతి కొనుగోలుకు బిల్లుతీసుకోవాలి. తయారీ, గడువు తేదీలు పరిశీలించాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నుధృవీ కరించాలి. అసాధారణంగా తక్కువ ధరలకు లభించే ఉత్పత్తులవిషయంలో అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద ఉత్పత్తులపైవెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఒక వ్యక్తి జేబులోని డబ్బును దొంగిలిస్తే అదిఆర్థికనేరం. కానీ అతను తినే ఆహారాన్నే కలుషితంచేసి ఆరోగ్యాన్నిదెబ్బతీస్తే అది సమాజంపైనే దాడి. తెలుగు రాష్ట్రాల్లో వెలుగుచూస్తున్న వరుస కల్తీకేసులు ఇదేవాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. ఆహార భద్రత అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత కాదు. రైతునుంచి తయారీదారువరకు, వ్యాపారి నుంచి హోటల్ యజమాని వరకు, పోలీసు నుంచి ఫుడ్సేఫ్టీ అధికారి, చివరకు వినియోగ దారుడి వరకుప్రతి ఒక్కరూ ఈగొలుసులో భాగస్వాములే. ఆహార భద్రతను ప్రజా ఉద్య మంగా మార్చగలిగితేనే'ఆహారమే ఔషధం అనే భావనను మళ్లీ సార్థకం చేయగలం.

# ఆహారమే విషతుల్యమైతే..

దేవిప్రసాద్ బొందలపాటి

'ఆహారమే ఔషధం" అనే భారతీయ జీవన తత్వం నేడు ఆహారమే విషం'గా మారుతోందా అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు పండుగల సమయంలో మాత్రమే కల్తీ ఆహారంపై వార్తలు వినిపించేవి. కానీ ఇప్పుడు ఉదయం తాగే పాల నుంచి రాత్రి భోజనంలో ఉండే పనీర్ వరకు, పిల్లలు తినే చాక్లెట్ల నుంచి ఇంట్లో వాడే నెయ్యి వరకు, హోటళ్లలో ఉపయోగించే అల్లంవెల్లుల్లి పేస్ట్ నుంచి వీధి వ్యాపారులు విక్రయించే మసాలాల వరకు దాదాపు ప్రతి ఆహార ఉత్పత్తిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా వెలుగులోకి వస్తున్న వరుస కల్తీ కేసులు ప్రజారోగ్య వ్యవస్థను అప్రమత్తం చేస్తున్నాయి. టన్నుల కొద్దీ నకిలీ ఆహార పదార్థాలు పట్టుబడుతున్నా, మార్కెట్లో వాటి ప్రవాహం మాత్రం తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. దర్యాప్తుసంస్థల ప్రకారం ఇది విడివిడిగా జరిగే నేరం కాదు. కోట్ల రూపాయల టర్నోవర్తో నడుస్తున్న ఒక వ్యవస్థీకృత నేర నెట్వర్క్గా మారింది. గతంలో కల్తీ అంటే పాలలో నీళ్లు కలపడం, మిరప పొడిలో ఇటుకపొడి కలపడం వంటి చిన్నస్థాయి మోసాలు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు సాంకేతికత, ప్యాకేజింగ్, బ్రాండింగ్ను ఉపయోగించి భారీ స్థాయిలో నకిలీ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. గడువు ముగిసిన ఉత్పత్తులకు కొత్త లేబుళ్లు అతికించడం, కుళ్లిపోయిన ముడి పదార్థాలను రసాయనాలతో శుభ్రపరచి మళ్లీ వినియోగించడం, కృత్రిమ రంగులు, ఫ్లేవర్లు, రసాయనాలు కలిపి నాణ్యమైన ఉత్పత్తుల్లా విక్రయించడం, ప్రముఖ బ్రాండ్లను పోలిన ప్యాకెట్లలో నకిలీ సరుకులను మార్కెట్లోకి పంపించడం వంటి అక్రమాలు సాధారణమైపోయాయి. తెలంగాణలో అధికారిక గణాంకాల ప్రకారం పరీక్షించిన 18,283 ఆహార నమూనాల్లో 2,642 నమూనాలు నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలింది. అంటే ప్రతి 100 నమూనాల్లో దాదాపు 15 నమూనాలు కల్తీ లేదా నాణ్యత లోపాలతో ఉన్నాయన్న మాట. 2021 నుంచి 2024 మధ్య పరీక్షించిన 15,702 నమూనాల్లో 2,387 నమూనాలు కూడా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్లో 2023- 2026 మధ్య 16,700 ఆహార నమూనాలను పరీక్షించగా సుమారు 1,400 నమూనాలు నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అంతేకాదు, 2018- 2022





మధ్య ఆహార కల్తీకి సంబంధించిన 14,745 కేసులు నమోదవడం రాష్ట్రంలో సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. దేశంలో అత్యధిక ఆహార కల్తీ కేసులు నమోదైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచింది. ఆహార కల్తీ కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు, ప్రాణాలను కూడా బలితీసే ప్రమాదకర నేరం. ఆంధ్రప్రదేశ్లో విషపూరిత రసాయనం కలిసిన పాలను సేవించడం వల్ల 16 మంది వరకు ప్రాణాలు కోల్పోయిన ఘటన దీనికి నిదర్శనం. పాలలో కలిసిన ఎథిలీన్ గ్లైకాల్ వంటి రసాయనాలు మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీ ఆహారంలో ఉపయోగించే కృత్రిమ రంగులు, రసాయనాలు, నాసిరకం నూనెలు, గడువు ముగిసిన పదార్థాలు వెంటనే ప్రభావం చూపకపోయినా, దీర్ఘకాలంలో కాలేయం, మూత్రపిండాలు, గుండె, జీర్ణవ్యవస్థ, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఈ ప్రమాదానికి మరింత సులభంగా గురవుతారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో పాల ఉత్పత్తులు, పనీర్, నెయ్యి, వెన్న, కోవా, చికెన్, మసాలా పొడులు, బేకరీ ఉత్పత్తులు, సాస్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వంటి ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఏర్పడింది. అయితే నాణ్యమైన ఉత్పత్తి, పర్యవేక్షణ అంతే వేగంగా పెరగకపోవడంతో అక్రమార్కులకు అవకాశం దొరికింది. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో నెయ్యిలో వనస్పతి కలపడం, పనీర్ స్థానంలో చీజ్ అనలాగ్ ఉత్పత్తులు విక్రయించడం, గడువు ముగిసిన ముడి పదార్థాలతో స్వీట్లు తయారు చేయడం, రంగులు, సువాసనలతో నాసిరకం ఉత్పత్తులను నాణ్యమైనవిగా చూపించడం వంటి అక్రమాలు బయటపడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్లో కల్తీ ఆహార నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్ ఫాస్ట్) తక్కువ కాలంలోనే సంచలన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. మార్చిలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక బృందం కేవలం మూడు నెలల్లోనే 61కిపైగా కేసులు నమోదుచేసింది. 64 మందిని అరెస్టు చేసింది. 14,685 కిలోల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుంది. 400 లీటర్ల కల్తీ ద్రవ పదార్థాలను గుర్తించింది దాడుల్లో రోజువారీ వినియోగించే పనీర్, పాల ఉత్పత్తులు, అల్లంవెల్లుల్లి పేస్ట్, టీ పొడి, నెయ్యి, వంట నూనెలు, బేకరీ ఉత్పత్తులు, చాక్లెట్లు, చికెన్, మసాలాలు, స్నాక్స్ తదితర ఉత్పత్తుల్లో కల్తీ జరుగుతున్నట్లు బయటపడింది. గడువు ముగిసిన ఉత్పత్తులకు కొత్త లేబుళ్లు అతికించడం, కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లిని రసాయనాలతో శుభ్రపరచి పేస్ట్ తయారు చేయడం, టీ పొడిలో కృత్రిమ రంగులు, గడువు ముగిసిన ఆకులు కలపడం, పనీర్ పేరుతో చీజ్ అనలాగ్ ఉత్పత్తులు విక్రయించడం, చిన్నారుల చాక్లెట్లలో గడువు ముగిసిన ఫ్లేవర్ల వినియోగం, అపరిశుభ్ర పరిస్థితుల్లో బేకరీ ఉత్పత్తుల తయారీ, పాడైన చికెన్ నిల్వ చేసి విక్రయించడం, భారీ మొత్తంలో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా చేయడాన్ని గుర్తించారు. మల్లేపల్లిలో నిర్వహించిన దాడిలో 1,090 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 875 కిలోల ముడిసరుకు, అసిటిక్ యాసిడ్, కృత్రిమ రంగులు స్వాధీనం చేసుకున్నారు. టీ పొడి రాకెట్పై దాడుల్లో 3,000 కిలోల కల్తీ టీ పొడి, 1,500 కిలోల గడువు ముగిసిన టీ పొడి గుర్తించారు. తాజాగా 825 కిలోల పనీర్, చీజ్ అనలాగ్ ఉత్పత్తులు, 325 కిలోల పాడైన చికెన్, అలాగే 90 టన్నుల చికెన్ వ్యర్థాలు కూడా పట్టుబడ్డాయి. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఒక యూనిట్పై చర్యలు తీసుకున్న వెంటనే మరో పేరుతో కొత్త యూనిట్ ఏర్పాటు చేసి అదే వ్యాపా రాన్ని కొనసాగిస్తున్నట్లు అనేక కేసుల్లో గుర్తించారు. తయారీ, నిల్వ, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ వంటి ప్రతి దశలో వేర్వేరు వ్యక్తులు ఉండటంతో

# చీలికల కాలం!

మహారాష్ట్ర

ఎ.వి.వి ప్రసాద్

పార్టీలలో చీలికలే ప్రస్తుత రాజకీయ పరిణామాలుగా కనిపిస్తున్నాయి. ఏ పార్టీలో ఎందుకు చీలిక వస్తున్నదో, చీలిన గ్రూపు ఏ పార్టీలో కలుస్తున్నదో అంతాఅనూహ్యంగా ఉంటోంది. తాజాగా మమతా బెనర్జీ పార్టీ ఎదుర్కొంటున్న సంక్షోభం మరుగున పడకుండానే మహారాష్ట్రలోని శివసేనలో కూడా కొత్త సంక్షోభం మొదలయింది. గత శుక్రవారానికి ఆరు పదులవయసు నిండి షష్టిపూర్తి చేసుకొన్న ఆ పార్టీ రెండోసారి పెద్ద కుదుపునకు గురికావడం ఆశ్చర్యం కలిగించే విషయమే. అరవయ్యేళ్ల క్రితం బాల్ థాకరే ఆ పార్టీని ఏర్పాటు చేసినప్పుడు అదో గొప్ప సంచలనం. మరాఠీ ప్రజల హక్కులు, మహారాష్ట్ర ప్రాంతీయ గుర్తింపు భావజాలంతో 1966 జూన్ 19 న ఆయన పార్టీని ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఏర్పడి జాతీయ రాజకీయాలను సైతం ఎంతగానో ప్రభావితం చేసింది. మహారాష్ట్రలో శివసేనతో పొత్తు కుదరకపోతే గెలవలేని పరిస్థితిని జాతీయ పార్టీలకు సైతం కల్పించింది. సింహం సింగిల్ గానే పోరాడుతుందన్నట్లు శివసేన కూడా రెండు దశాబ్దాల పాటు ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగింది. తర్వాత అనివార్య పరిస్థితుల్లో ఒకసారి కాంగ్రెస్ తో, మరోసారి బిజెపితో కలిసి పోటీ చేసింది. ఎవరితో చేతులు కలిపినా చివరికి పైచేయి శివసేనది గానే ఉండేది. అధికారంలో ఉన్నా, లేకపోయినా బాల్థాకరే ఉన్నంతకాలం'పెద్దపులి' తరహాలోనే శివసేన కనిపించేది. ఆ తర్వాత కాలం మారింది. 2022 లో ఏక్నాథ్ షిండే నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు శివసేనకు ఓ పెద్ద కుదుపు అనే చెప్పాలి. బాల్ థాకరే కుమారుడు ఉద్ధవ్ థాకరే పార్టీని సమైక్యంగా ఉంచలేకపోయారో, లేక ఇతరేతర ప్రభావాలు పనిచేశాయో గాని శివసేన మొదటిసారి రెండుగా చీలిపోయింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో షిండే శివసేనకు 57సీట్లు రాగా, ఉద్ధవ్ సేనకు 20 మాత్రమే వచ్చాయి. బిజెపి అండతో షిండే మంచి ఊపుమీద ఉన్నా, ఉద్ధవ్ మాత్రం పార్టీ ఉనికిని కాపాడుకొనే యత్నంలో కొట్టుమిట్టాడుతున్నారు. బాల్ థాకరే ఉన్నప్పుడు సమైక్య పార్టీకి 20శాతం పైగా ఓట్లుఉండగా, పార్టీతో పాటు ఓట్లు కూడా చీలిపోయి షిండే గ్రూపునకు దాదాపు 12శాతం, ఉద్ధవ్ గ్రూపునకు 9 శాతం ఓట్లు వచ్చాయి. ఈ దశలో ఉద్ధవ్ సేనలో మరో చీలిక అనివార్యంగా కనిపించడం ఆశ్చర్యకరమైన పరిణామమే. 'ఆపరేషన్ టైగర్' పేరుతో అధికార పార్టీ చేపట్టిన ఆకర్షణ ప్లాన్ ఇప్పుడుచాలామంది ఎంపీలపై వలవేసింది. గతవారం ఆ వలలో ఆరు గురు ఉద్ధవ్ఎంపీలు పడడం అందరిని ఉలికి పాటుకు గురి చేసింది. ఆ ఆరుగురు ఇంతకాలం ఉద్ధవ్ గ్రూపులో ఎంతో విధేయత కలిగినవారే. సంజయ్జాదవ్, సంజయ్ దేశ్ముఖ్, సంజయ్ పాటిల్, నగేశ్ పాటిల్, నింబాల్కర్, బాబాసాహెబ్ వాక్చౌరే గత బుధవారం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరారు. దానిని స్పీకర్ వెంటనే ఆమోదించేశారు కూడా. అక్కడితో ఉద్ధవ్ శివసేన రెండుగా చీలినట్లయింది. ఇక ఉద్ధవ్ వైపు మిగిలింది ముగ్గురు ఎంపీలే. షిండే బలం 13 ఎంపీలకు పెరిగింది. నాలుగు సంవత్సరాల క్రితం శివసేనలో షిండే చీలిక తెచ్చినపుడు అతడేం చేయగలడనే అంతా భావించారు. కానీ ఆయన వెంటనే సిఎం కావడమే గాక తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం పదవి చేపట్టారు. అందుకు కారణాలు వేరే ఉన్నాయి. ఇప్పుడు బలంపెరగడంతో ముందు ముందు ఆయన స్థాయి మళ్లీ మారవచ్చు. కేంద్ర మంత్రి కాగలరనే మాట కూడా వినిపిస్తోంది. శుక్రవారం శివసేన షష్టిపూర్తి సమావేశంలో ఉద్ధవ్ మాట్లాడుతూ తాను పార్టీ నాయకత్వం నుంచి తప్పుకొనడానికి సిద్ధంగా ఉన్నానంటూ ఎంతోవేదనగా అన్నారు. అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తాననన్న ఉద్ధవ్ ఇక పార్టీని ఏం ఉద్ధరిస్తారనే అనుమానం అందరిలో కలిగించారు. మరో సమావేశంలోషిండే మాట్లాడుతూ 'ఇది ట్రైలర్ మాత్రమే, అసలు సినిమా ముందుంది' అనడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. బహుశా మిగిలిన ముగ్గురు ఉద్ధవ్ ఎంపీలు కూడా జారిపోవచ్చనే అనుమానం అందరిలో కలుగుతోంది. ఎంతో ఉన్నతస్థానానికి ఎదిగిన శివసేన ఇలా ముక్కల వడానికి ఉద్ధవ్ బలహీనతలు కూడా కారణమనే చెప్పాలి. సొంత అనుచరగుణానికి పార్టీలో ఇచ్చిన ప్రాధాన్యం నిబద్ధతతో పనిచేసిన నాయకులకు ఇవ్వలేదనే ఆరోపణలు ఉద్ధవ్పై ఉన్నాయి. ఆయన కుమారుడు ఆదిత్యథాకరే పెత్తనం ఎక్కువ కావడం, ఆయన కనుసన్నల్లోని వారికే పార్టీపదవులు లభిస్తూండడం తిరుగుబాట్లకు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. తన గ్రూపును కాంగ్రెస్లో విలీనం చేయాలని ఒకసారి, బిజెపిలో విలీనం చేయాలని మరోసారి ఉద్ధవ్ భావించడం కూడా పార్టీలో వ్యతిరేకతను పెంచింది. ఆయన వద్ద ఒక స్థిరమైన ఆలోచన లేనందువల్లే పార్టీలో తాజా చీలికకు దారితీసిందని కూడా అంటున్నారు. లోక్సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడం కోసం బిజెపియే పార్టీల్లో చీలికలను ప్రోత్సహిస్తున్నదనే ఆరోపణలున్నా, పార్టీలు దృఢంగా ఉంటే ఏం చేయగలుగుతుందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఉద్ధవ్ శివసేనలో చీలిక వార్తలు వినిపిస్తున్న తరుణంలోనే సమాజ్వాదీపార్టీ, శరద్పవార్ ఎన్సీపీలో కూడా చీలికలు రాబోతున్నాయనే వార్తలు గుప్పుమన్నాయి. ఎస్పీలోని అంతర్గత విభేదాలవల్ల దాదాపు 25మంది ఎంపీలు గోడ దాటే ప్రయత్నం చేస్తున్నట్లుగా వినిపిస్తోంది. అలాగే శరద్ ఎన్సీపీలో 8మంది ఎంపీలుండగా, ఐదుగురు ప్లేటు ఫిరాయించవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఏక్షణంలో ఏదైనా జరగవచ్చు. రాజకీయ పరిణామాలుహఠాత్తుగా సంభవిస్తున్నాయి. గోడమీద పిల్లులు ఎక్కువవుతున్నాయి. ఇండియా కూటమిబలపడకుండా చేయడమనే వ్యూహం కూడా ఈ పరిణామాల వెనుక ఉండవచ్చు. ఏదిఏమైనా ప్రాంతీయ పార్టీలకు ఇది చీలికల కాలమనే అనుకోవాలి. ●



ఉద్ధవ్ థాకరే

# అట్టుడుకుతున్న అంతర్గత సంక్షోభం

బొలీవియా

గన్ని మోహన్

అశాంతి, అల్లర్లు, విధ్వంసం రాస్తారోకో దిగ్బంధనాలతో అట్టుడికిపోతున్న దేశాల్లో ఇప్పుడు దక్షిణ అమెరికా దేశం బొలీవియా కూడా చేరింది. ఐదుదేశాల సరిహద్దులున్న ఈ చిన్న దేశంలో అధ్యక్షుడు తక్షణమే రాజీనామా చేయాలన్న ఏకైక డిమాండ్తో 40రోజులుగా జరుగుతున్న ఆందోళనఉధృత రూపం దాల్చడంతో దేశం మొత్తం అత్యవసర స్థితిని ప్రకటించారు. అధ్యక్షుడు రోడ్రిగో పాజ్ ఎన్నికై కేవలం ఆరునెలలే అయినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలోఘోరంగా విఫలమయ్యారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని పేర్కొంటూ ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని తక్షణమే దిగిపోవాలంటూ నిరసనకారులు అందోళనలు చేస్తున్నారు. రాజధాని లాపాజ్, టిలాటా, ఇంగావి ప్రావిన్స్, ఎల్ ఆల్టో వంటినగరాల్లో ఆందోళనకారులు రహదారులన్నింటినీ మూసివేయడంతో ఇతర ప్రాంతాలతో ఈ నగరాలు కటాఫ్ అయ్యాయి. దేశవ్యాప్తంగా ఆహారం, మందులు, నిత్యాసవరసరుకుల రవాణాకు తీవ్రమైన ఆటంకాలు ఏర్పడటం, ఇంధన కొరత కూడా పతాకస్థాయికి పెరిగిపోయి సంక్షోభంలోకి నెట్టివేసింది. నిత్యావసర వస్తువులు అందుబాటులోకి రావడంలేదు. దేశంలో రాజకీయ ఆర్థికసంక్షోభం మరింతగా ముదురుతుండటంతో ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకే అత్యవసర స్థితి విధించాల్సి వచ్చిందని, చర్చలకు వారు అంగీకరించడం లేదని ప్రభుత్వ వర్గాలు ప్రకటించడంతో ఆందోళనలు మరింత ఉధృతం అయ్యాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, వేతనాలు తక్కువగాఉండటంతో ప్రజల్లో అసంతృప్తి పేరుకునిపోయింది. తమ మద్దతుతో ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన అధ్యక్షుడు తమ సమస్యలు పెడచెవిన పెట్టారని నిరసనకారులు ఆక్రోశిస్తున్నారు. ఏడునెలలకాలంలోనే అధ్యక్షుడు రోడ్రిగోపాజ్పై పతాకస్థాయిలో అసమ్మతి రాజుకుంది. ప్రతిపక్ష కుట్రఅనేందుకు కూడా వీలులేని విధంగా దేశంమొత్తం రైతులు, కార్మికులు, ఉద్యోగులు అందరూ ఆందోళనల్లో పాల్గొనడంతో పాజ్కు గడ్డుపరిస్థితులు ఏర్పడ్డాయి. బొలీవియాలో రెండుదశాబ్దాలపాటు అధికారంలో ఉన్న మూవ్మెంట్టు వార్డ్ సోషలిజం ఎంఎఎస్ పార్టీ పాలనకు ముగింపు పలికి అధ్యక్షుడు రోడ్రిగో పాజ్కు పట్టం కట్టారు. కానీ పాలనలోకి వచ్చి ఏడునెలలు అవుతున్నా ప్రజామోదయోగ్యమైన పనులు ఏ ఒక్కటీ చేపట్టలేదన్న అక్కసుప్రజల్లో పెరిగిపోయింది. గతంలో సైనిక చర్యల కారణంగా పలువురు బొలీవియా అధ్యక్షులు పదవులు కోల్పోయారు కూడా. ఇప్పుడు అత్యవసరపరిస్థితి అమలుకు వస్తే పాజ్ పరిస్థితి కూడా అదే అవుతుందన్న భావన కూడా అధికార పార్టీలో వ్యక్తం అవుతోంది. బ్రెజిల్, పరాగ్వే, పెరూ, చిలీ దేశాల సరిహద్దులతో ఉన్న బొలీవియా దిగువ మధ్యాదాయ దేశాల జాబితాలో ఉంది. తలసరి జిడిపి 4421 డాలర్లు మాత్రమే. జిడిపి కూడా 80.74 బిలియన్డాలర్లు. దేశ జనాభా కూడా 12.7 మిలియన్ల మందిమాత్రమే ప్రతి చదరపు కిలోమీటరుకు 10.5 మంది మాత్రమే నివసించే వీలున్న ఈ చిన్నదేశంలో ఒక్కసారిగా ప్రజల్లో పాలకులపై అసమ్మతి రాజుకుంది. ఇంధన ధరలు స్థిరీకరించాలని, అనవసర భూసంస్కరణలు రద్దుచేయాలన్న డిమాండ్లతోపాటు వేతనాలు పెంచాలని, ఇంధనం, డాలర్ నిధుల కొరతను అరికట్టాలని కోరుతూ పాజ్ తక్షణమే రాజీనామా చేయాలని పట్టుబడుతున్నారు. నిరసనలకకు పాల్పడుతున్న గ్రూపుల్లో అత్యధిక శాతం మాజీ వామపక్ష అధ్యక్షుడు ఇవో మొరేల్స్ కు చెందినవారే ఉన్నారని రోడ్రిగో వర్గం ఆరోపిస్తోంది. దేశంలోని సుమారు 90 రహదారులన్నింటినీ దిగ్బంధనం చేయడంతోనే సంక్షోభం పతాకస్థాయికి చేరకుండా కట్టడిచేయాల్సి వస్తోందని పాజ్ చెపుతున్నారు. అయితే ఆందోళనకారులు మాత్రం పాజ్ దిగిపోయేంతవరకూ తగ్గేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. పరిస్థితులను చూస్తుంటే అత్యవసరస్థితి నిబంధనలు ఉల్లంఘించేటట్లు కనిపిస్తున్నది. ఇక సైనిక చర్య తప్పదన్న భావన కూడా ప్రభుత్వంలో ఉంది. అదే జరిగితే గత అధ్యక్షులకు ఎదురయినఉద్వాసన పరిస్థితులే రోడ్రిగోను కూడా చుట్టుముడతాయని ఆదేశ రాజకీయ పండితులు నిర్వచిస్తున్నారు. గతంలోని వామపక్ష అధ్యక్షుడు దేశంలో ఉన్న అమెరికా డ్రగ్ ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీని బహిష్కరించారు. ఆ తర్వాత 18ఏళ్లకు ఇప్పుడు బొలీవియా యుఎస్తో కలిసి డ్రగ్స్ మాఫియా కట్టడికి సంయుక్త కార్యాచరణ అమలు చేస్తున్నది. దీనితో ఇప్పుడు నిరసనల్లో డ్రగ్ కార్టెల్ హస్తం కూడా ఉండి ఉంటుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అధ్యక్షుడు పాజ్కు పరిసరాల్లోని చిన్న దేశాల మద్దతు సంపూర్ణంగా ఉంది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా కూడా బొలీవియాకు అండగా నిలుస్తామని వారంతా గత ఫ్లోరిడా సదస్సులోనే పాజ్కు భరోసా ఇచ్చారు. కొకైన్ తయారీలో ఉపయోగించే కోకాను ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో ప్రపంచంలోనే మూడో దేశంగా బొలీవియా నిలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు దేశంలో ఉన్న అంతర్గత సమస్యలను చక్కదిద్దాల్సిన బాధ్యత పాజ్ భుజాలపైనే ఉంది. ఇందుకోసం ఆయన అమెరికా, చైనా వంటి దేశాలతోపాటు అగ్ర రాజ్యాల సహకారం కూడా అనివార్యం అని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే చైనా బొలీవియాకు వాణిజ్య మిత్ర దేశంగా ఉంది. పెట్టుబడులు అధికంగా వస్తేనే ఉపాధి రంగం కుదుటపడుతుందన్నది తెలిసిందే. ఇప్పుడు ఈ దిశగా కృషిచేస్తే తప్ప బొలీవియా కొత్త అధ్యక్షుడికి పదవీగండం తప్పేటట్లు లేదని ఆందోళన ఉధృతి చెప్పకనే చెపుతోంది. అత్యవసర పరిస్థితిలో సైనిక చర్యలతో ఉక్కుపాదం మోపితే గత అధ్యక్షుల పరిస్థితే ఎదురవుతుందన్న హెచ్చరికల ను కూడా పరిగణనలోనికి తీసుకుని ఇప్పుడు రోడ్రిగో ముందుకు వెళ్లాల్సిన సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారనే చెప్పాలి. ఈ అంతర్గత సంక్షోభాన్ని పాజ్ ఎలా అధిగమిస్తారన్నది కాలమే నిర్ణయించాలి. ●



రోడ్రిగో పాజ్

# అధిక సంతానంతో ఆర్థిక స్థితి చక్కబడుతుందా?

బొల్లిముంతసాంబశివరావు

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ప్రజలకు అమూల్యమైన్న సందేశం ఇచ్చారు. పిల్లలే కుటుంబాలకు సంపద. ప్రతి కుటుంబం నలుగురు పిల్లలను కనండి, మూడోకాన్పుకి 30వేలు, నాలుగోకాన్పుకి 40 వేలు ఇస్తానని ఆయన సందేశంలో చెప్పారు. ఎంత మంది పిల్లలను కనాలని చంద్రబాబుగారు ఎలా చెబుతారు. అది భార్యాభర్తల ఇష్టం మీద, ముఖ్యంగా స్త్రీ ఇష్టం మీద పిల్లల సంఖ్య ఆధారపడి ఉంటుంది. స్త్రీలు, పిల్లలను కనే యంత్రాలుగా ఎలా చూస్తాము! నలుగురు పిల్లలను కనమంటున్న చంద్రబాబు, తన మంత్రివర్గ సహచర కుటుంబాలను నలుగురు పిల్లలను కనమని చెప్పవచ్చు గదా! నలుగుర్ని కనమని చెబుతున్న చంద్రబాబు అంతర్యం ఏమిటి? పేదరికం, అధిక జనాభా గురించి కార్ల్మార్క్స్ అభిప్రాయం పేదరిక, ఆకలి నిరుద్యోగం అనేది జనాభా పెరుగుదల వల్ల కాదని, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని అసమానతల వల్ల వస్తోందని కార్ల్మార్క్స్ప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికులు పేదరికంలో ఉంటారు. తమ కుటుంబానికి ఆసరాగా శ్రామిక కుటుంబాల పిల్లలను కంటారు. పెట్టుబడిదారులు లాభాలను గడించడానికి యంత్రాలు ఉపయోగిస్తారు. ఫలితంగా కార్మికులకు పని దొరకని కారణంగా నిరుద్యోగులుగా మారతారు. ఈ నిరుద్యోగ సైన్యాన్ని ఉపయోగించి కార్మిక వేతనాలను తగ్గించి లాభాలు పెంచుకుంటారని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల గురించి మార్క్స్ అభిప్రాయానికి భిన్నంగా అంబేద్కర్ అభిప్రాయం ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు, పేదరిక నిర్మూలనకు జనాభా పెరుగుదల పెద్ద అడ్డంకిగా ఆయన భావించారు. కుటుంబ నియంత్రణను, చిన్న కుటుంబాలను గట్టిగా సమర్థించారు. జనాభాని నియంత్రించకుండా పేదరికాన్ని రూపు మాపడం అసాధ్యమన్నారు. జనాభా నియంత్రణకు క్లినిక్లు ఏర్పాటు చేయాలన్నారు. పేదరికం గురించి కార్ల్మార్క్స్ ఇలా చెప్పారు. పేదరికం అనేది వ్యక్తిగత వైఫల్యం లేదా వనరుల కొరత కాదు. అది పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికవర్గంపై పెట్టుబడిదారులు చేసే దోపిడీకి ప్రత్యక్ష ఫలితం. సమాజంలో పరిశ్రమలు, భూమి వంటి ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది పెట్టుబడిదారుల, భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. వీటిని కోల్పోయిన తమ జీవనం కోసం తన శ్రమను అమ్ముకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుంది. తానుఉత్పత్తి చేసే విలువలో కొంత భాగం మాత్రమే వేతనంగా అందుతుంది. మిగిలిన అదనపు విలువను పెట్టుబడిదారుడు దోచుకుంటాడు. ఫలితంగా కార్మికుడు నిరంతరం పేదరికంలో ఉంటాడు. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందే కొద్దీ సంపద కొద్ది మంది వద్దే పోగువుతుంది. కార్మికుడి పరిస్థితి మరింత దిగజారుతుంది. మరింత పేదరికాన్ని ఎదుర్కొంటాడు. పరిశ్రమలు, భూమి, సహజ వనరులు సమాజంపరమైతేనే పేదరికం తొలుగుతుంది. అంబేద్కర్, పేదరికానికి అధిక జనాభా కారణమని, జనాభాని నియంత్రించాలని చెప్పారు. సంపద కేంద్రీకరణ గురించి గాని, పరిశ్రమలు, భూమిపై కార్మికులకు, గ్రామీణ పేదలకు హక్కు ఏర్పడితేనే పేదరికం పోతుందనిచెప్పలేదు. జనాభా పెరుగుదల వస్తువుల వినియోగదారుడిగా, శ్రామికుడిగా కీలక పాత్రపోషిస్తుంది. జనాభా పెరిగే కొద్దీ మార్కెట్లో శ్రామికుల సంఖ్య పెరుగుతుంది. దానివల్ల పెట్టుబడిదారులు తక్కువ వేతనాలకే కార్మికులను నియమించుకునే అవకాశం ఏర్పడుతుంది. పెట్టుబడిదారులు ఉత్పత్తిచేసే వస్తువుల కొనుగోలుకు జనాభా అవసరం. జనాభా పెరిగేకొద్దీ మార్కెట్ పరిమాణం విస్తరించి లాభాలు పెరుగుతాయి. అందుకే పెట్టుబడిదారులకు పేదల జనాభా పెరుగుదల అవసరం. పేదరికం, జనాభా పెరుగుదల గురించి మార్క్స్ చెప్పిన నిర్వచనం భారతదేశానికి సరిపోతుంది. అధికార మార్పిడి జరిగిన నాటి నుంచి నేటి వరకు పాలక ప్రభుత్వాలు అనుసరించిన, అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారుల అనుకూల విధానాల వల్ల దేశ సంపద అత్యధిక భాగం అతికొద్దిమంది వద్ద పోగుబడి ఉంది. నిరుద్యోగం ,ఉపాధిలేమి, చాలీచాలని వేతనాల వల్ల



అత్యధిక మంది పేదలు పేదరికాన్ని అనుభవిస్తున్నారు. పారిశ్రామిక వేత్తల దోపిడీకి గురవుతున్నారు. పేదకుటుంబాలు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థికపరిస్థితుల్లో, పిల్లలను కూడా కుటుంబ పోషణలో భాగస్వాములను చేస్తున్నారు. పిల్లలను చదువుకి, ఆటలకు దూరం చేసి పనులకు పంపుతారు. వారి ద్వారా లభించే ఆదాయం కూడా కుటుంబ ఆర్థిక పరిస్థితుల్లో ఏమార్పు తీసుకురాలేదు. పిల్లలకు సమకూర్చే ఆర్థిక చేయూత కన్నా కుటుంబ ఖర్చు ఎక్కువగా ఉంటుంది కాబట్టి, కుటుంబాల ఆర్థిక సంక్షోభం, పేదరికం కొనసాగుతూనే ఉంటుంది. పేద కుటుంబాల అధిక సంతానం వల్ల శ్రామికుల సంఖ్య పెరుగు తుందేగాని, సంపద చేకూరదు. శ్రామికులకు ఉద్యోగ, ఉపాధి కల్పించలేని ప్రభుత్వ విధానాల వల్ల, ప్రభుత్వసంస్థలను ప్రైవేటు చేయడం, మూసివేయడం వల్ల నిరుద్యోగం తీవ్రం అవుతుంది. ఫలితంగా నిరుద్యోగ సైన్యం పెరిగింది. పారిశ్రామిక వేత్తలకు చౌకగా శ్రామిక శక్తి మార్కెట్లో దొరుకుతుంది. పేదకుటుంబాల పిల్లలు బాలకార్మికులుగా మారుతారు. చౌకగా శ్రామిక శక్తి దొరకటం వల పారిశ్రామికవేత్తలకు ఎక్కువ లాభాలు వచ్చి, వారి సంపద పెరుగుతున్నది. పారిశ్రామికవేత్తల అధిక లాభాల కోసం కార్మిక హక్కులు హరిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టాలను చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన నలుగురు సంతానం వల్ల పారిశ్రామిక వేత్తలకు శ్రామికులు చౌకగా దొరకడానికి, వారి సంపద పెరగటానికి ఉపయోగపడుతుంది. పేదలకు సంపదసృష్టి లేకపోగా, కుటుంబానికి మరింత భారం పెరుగుతుంది. 1975లోఎమర్జన్సీ విధించబడింది. జనాభా నియంత్రణ కోసమంటూ సంజయ్గాంధి. బలవంతంగా విచ్చలవిడిగా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాడు. నలుగురు పిల్లలను కనడం కోసం చంద్రబాబు ప్రభుత్వం కుటుంబాలపై వత్తిడి పెడుతుందా! జనాభా పెరగకపోవడం మంచిది కాదని, ఇద్దరికి మించి పిల్లలను కనాలని 2019లో అమరావతి సమీపంలో నేలపాడులో నిర్వహించిన పసుపు, కుంకుమ కార్యక్రమంలో చంద్రబాబు మహిళలకు పిలుపు ఇచ్చారు. మోడీ నాయకత్వాన ఎన్డిఎ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దేశంలో మతవిద్వేసాలు ఎక్కువ అయ్యాయి. ముస్లింల జనాభా పెరుతుందని, హిందువులు కూడా ఎక్కువ మంది పిల్లలను కనాలని, కొంత మంది నాయకులు మాట్లాడుతున్నారు. కర్ణాటకలోని ఉడిపిలో హిందూ పరిషత్ ఆధ్వర్యాన జరుగుతున్న ధర్మ సంపద్కార్య క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాధారణ ఎన్నికల ప్రచారంలో సంపద సృష్టించి పథకాల అమలుతో పాటు, పేదరికాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తానని, ఉద్యోగ, ఉపాధి కల్పిస్తానని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి రెండుసంవత్సరాలు పూర్తి అవుతూ ఉంది. సంపద సృష్టిలేకపోవడమే కాకుండా 3.5 లక్షలకోట్ల రూపాయలకుపైగా అప్పును మాత్రం చంద్రబాబు సృష్టించారు. సంవత్సరానికి ఐదులక్షల ఉద్యోగాలు కల్పిస్తాననిచెప్పి, కల్పించకపోగా, ఉన్నఉద్యోగాలనే ఊడ బెరుకుతున్నారు. ఫలితంగా పేదరికం నిరుద్యోగం పెరుగుతూ ఉంది. అమలు సాధ్యంకాని పీ 4పథకం ద్వారా పేదరికాన్ని తొలగిస్తానని చెప్పారు. ఆచరణలో విఫలం అయింది. ఇప్పుడు ఆ పథకం గురించి మాట్లాడటం లేదు. చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం, తాను చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలంఅయ్యింది. రెండు లేక మూడు వాగ్దానాలను అరకొరగా మాత్రమే అమలు జరిపింది. రెండుసంవత్సరాలుగా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు 15 వందలు ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదు. విద్యార్థుల ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలు ఇవ్వలేదు. ఆరోగ్య శ్రీ పథకానికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో, ప్రైవేట్హాస్పటల్స్ ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేశాయి. ఎన్టీఆర్ రైతు భరోసా మొదటి ఏడాది రైతులకు ఇవ్వలేదు. రైతుల పంట కొనుగోళ్ల బాధ్యత తీసుకోలేదు. అందరికీ విద్యా, వైద్యం అందిస్తానని చెప్పి, ఆరెంటినీ ప్రైవేటీకరణ చేస్తున్నది. మెడికల్కాలేజీలను, పోర్టులను పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నది. ఫలితంగా ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతను దారి మళ్లించడానికి, పారిశ్రామికవేత్తలను శ్రామిక శక్తిని చౌకగా అందించడానికి నలుగురు పిల్లల అంశాన్ని ముందుకు తెచ్చారు. ●



# గుంటూరు వార్త









శనివారం చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో సిఎం చంద్రబాబునాయుడు పర్యటన చిత్రమాలిక. (చిలకలూరిపేట-ప్రభాతవార్త)

## నగర ప్రజల భాగస్వామ్యం ఉంటేనే క్లీన్ గుంటూరు సాధ్యం

### నగర కమిషనర్ కె. మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 20 ( ప్రభాతవార్త ) : గుంటూరు నగరం క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరుగా మారాలంటే నగర ప్రజల విస్తృత భాగస్వామ్యం కీలకమని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర (సాసా) కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కొనసాగింపులో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిఎంసి ప్రధాన కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి, మార్కెట్ మెయిన్ రోడ్ స్వీపింగ్, విజ్ఞాన మందిరం దగ్గర కల్వర్ట్ ఫాగింగ్, డ్రైన్లలో టెమిఫాజ్ స్ప్రే, సిల్ట్ తొలగింపు, పబ్లిక్




టాయ్ లెట్స్ శుభ్రత పరిశీలన చేసి, విజ్ఞాన మందిరం ప్రాంగణంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం సాసా కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని, గత నాలుగు శనివారాల నుండి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల ఈసారి సాసా కార్యక్రమం మరింత ప్రత్యేకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో భాగంగా ప్రతి వారం ఒక థీమ్‌ను నిర్దేశించుకున్నామన్నారు. అలాగే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డ్రైన్లలో పూడికతీత పనులను కూడా చాలా వరకు పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు. నగరంలోని .ప్రతి ఒక్క చిన్న సందులో ఉండే డ్రైన్లను కూడా రెగ్యులర్‌గా క్లీన్ చేస్తూ ఉండాలని, పరిశుభ్రత అనేది అత్యంత ముఖ్యమైన అంశమని గుర్తుంచుకొని పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌జీఓలు, సివిల్ సొసైటీలు అందరూ కలిసి వస్తేనే ఈ పరిశుభ్రతను నిలబెట్టుకోగలమని, కాబట్టి ప్రతి వార్డ్ లో ఉండే యాక్టివ్ సిటిజన్స్, అసోసియేషన్లను కూడా భాగస్వాములు కావాల్సిందిగా స్థానిక అధికారులు, సిబ్బంది విజ్ఞప్తి చేయాలని సూచించారు.. స్వచ్ఛ సర్వేక్షన్‌లో మన నగరానికి దేశంలోనే టాప్ ర్యాంక్ రావాలని ఆకాంక్షిస్తూ, కార్యక్రమానికి సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, ఉపా సెల్ పిఓ సింహాచలం మేనేజర్ బాలాజీ బాష, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్

గుంటూరు విద్య, జూన్ 20 ప్రభాతవార్త : నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ జిల్లాలోనీ 22 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు జరగనున్నది. పెన్ను పేపర్ విధానంలో జరిగే ఈ పరీక్షకు ఈసారి 15 నిమిషాలు అదనంగా సమయాన్ని పెంచారు. ప్రశ్న పత్రాన్ని ఆ 15 నిమిషాల వ్యవధిలో క్షుణంగా అభ్యర్థులు అధ్యయనం చేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఎన్ టి ఏ ఈ అవకాశాన్ని కల్పించింది. పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించడానికి జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు . నీట్ పునః పరీక్ష కు 22 పరీక్షా కేంద్రాల ద్వారా 6609 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. అన్ని కేంద్రాల వద్ద ప్రాథమిక సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు , నిరంతర విద్యుత్తు ఉండాలని, పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని ఉన్నతాధికారులు ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థులను తనిఖీ చేయాలని, అనుమతి లేని ఏ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుప్రక్కల జిరాక్స్ దుకాణాలు మూసి వేయడం జరుగుతుందని అధికారులు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణ నిమిత్తం జాయింట్ కలెక్టర్ మొత్తం పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారని, గుంటూరు పట్టణ పరిధిలో జిల్లా విద్యాశాఖ అధికారి, మంగళగిరి పట్టణ పరిధిలో ఎంటీఎంసి కమిషనర్, తెనాలి పట్టణంలో రెవిన్యూ డివిజనల్ అధికారి, నాగార్జున విశ్వవిద్యాలయం కేంద్రంలో గుంటూరు రెవిన్యూ డివిజన్ అధికారి పర్యవేక్షణ అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కూడా అధికారులను పర్యవేక్షణకు నియమించామని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, పనితీరు, రికార్డింగ్ తదితర అంశాలను స్పష్టంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ సూపరింటెండెంట్ ను కోరారు. పరీక్షలు పక్కాగా, పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగరాదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో ముందుగానే అన్ని ఏర్పాట్లు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.

## 23న క్రైస్తవుల బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త: ఈనెల 23వ తేదీన గుంటూరు నగరంలో క్రైస్తవ యువత జరిపే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్ బాబు, (ఐక్య ) ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు) విజ్ఞప్తి చేశారు. పాత గుంటూరు లూథరన్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని రాజ సుందర బాబు మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ ఎత్తివేతకు 75 సంవత్సరాల క్రితమే అంకురార్పణ జరిగిందని



దాన్ని ఫలితమే 1950వ సంవత్సరంలో రాష్ట్రపతి ఉత్తర్వులని డాక్టర్ రాజసుందర్ బాబు అన్నారు. మతాన్ని అడ్డంపెట్టి ఎస్సీల రిజర్వేషన్ విధానాన్ని ఎత్తివేసే కుట్రలో కాంగ్రెస్ పునాది వేస్తే దానిని బిజెపి కొనసాగిస్తుందని డాక్టర్ రాజా సుందర్ బాబు అన్నారు. భారతదేశంలో క్రైస్తవ మతం ముస్లిం మతాల పట్ల వివక్షత వ్యతిరేకత తీవ్రంగా ఉందని, 1956 వ సంవత్సరంలో సిక్కులకు, 1990 సంవత్సరంలో బౌద్ధులకు రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ చేసి వారికి ఎస్సి హోదా ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

## రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ నిధులు

చిలకలూరిపేట, జూన్ 20,ప్రభాతవార్త: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ప్రతిష్టాత్మకమైన ఖిఅన్నదాత సుఖీభవఖి పథకం ద్వారా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్థానిక పత్తిపాటి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ




సందర్భంగా పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.వ్యవసాయమే ఆర్థిక వ్యవస్థకు వెన్నెము కసభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, "రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. అన్నదాత కష్టాలను గుర్తించే ప్రభుత్వం మనది. గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులను అధిగమిస్తూ, రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఈ పథకాలను రూపొందించాం. ప్రతి పైసా నేరుగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పారదర్శకంగా చేరుతోంది" అని పేర్కొన్నారు.కార్యకర్తలే ప్రభుత్వానికి బలం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.చిలకలూరిపేట అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతాంగాన్ని ఆదుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన చంద్రబాబు

### నెట్‌జీరో కాన్సెప్ట్‌లో భాగంగా ఇండక్షన్ స్టవ్ అందజే

### చిన్నారులతో కలిసి రాగి జావ తీసుకున్న సీఎం

చిలకలూరిపేట, జూన్ 20,ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సందర్శించారు. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర, అన్నదాత సుఖీభవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు లింగంగుంట్ల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి తొలుత అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నెట్ జీరో విధానంలో భాగంగా రూ.32 కోట్లతో రాష్ట్రంలోని 44,346 అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇండక్షన్ స్టవ్‌లు, పాత్రలను అందజేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి లింగంగుట్ల అంగన్వాడీ కేంద్రానికి ఇండక్షన్ స్టవ్, స్టీల్ పాత్రలను అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని సరుకుల నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో కలిసి జావ తీసుకున్న సీఎం అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముందుగా టీచర్, సహాయకురాలు స్వాగతం



పలికారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు ఇచ్చే పోషకాహారం, ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలకు అందిస్తోన్న సేవలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇండక్షన్ స్టవ్‌ను అందుకున్న అంగన్వాడీ సహాయకురాలు సీఎం సమక్షంలోనే రాగి జావను కాచారు. చిన్నారులతో మమేకమైన సీఎం...వారితో కలిసి కింద కూర్చునే రాగి జావను తీసుకున్నారు. కాసేపు వారితో ముచ్చటించారు. పచ్చదనం పెంపులో భాగంగా అంగన్వాడీ ప్రాంగణంలో అంగన్వాడీ సిబ్బందితో కలిసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా, అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆర్గానిక్ వేరుశనగ గానుగను సందర్శించిన సీఎంసతీమణి భువనేశ్వరితో ఫోన్లో మాట్లాడి కోల్డ్‌ప్రెస్డ్ వేరుశనగ కొనుగోలుప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు నాగభూషణానికి సీఎం ప్రశం..చిలకలూరి పేట అన్నదాత సుఖీభవ కార్యక్రమం సందర్భంగా పల్నాడు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... లింగంగుంట్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తోన్న రైతు గుడిపల్లి నాగభూషణంకు చెందిన పొలాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతు నాగభూషణం తాను చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సీఎం చంద్రబాబుకు వివరించారు. గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని నాగభూషణం తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు భూసారం, దిగుబడులు పెరిగి వ్యవసాయం



లాభాదయకంగా మారిందని సీఎంకు వివరించారు.. నాగభూషణం లాంటి రైతులే ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శంగా నిలుస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. ఇదే సమయంలో నాగభూషణానికి చెందిన గానుగను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. వేరుశనగ, నువ్వులు, కొబ్బరి తదితర నూనెగింజలను సహజ పద్ధతిలో గానుగ ద్వారా నూనె ఉత్పత్తి చేస్తున్నట్టు నాగభూషణం వివరించారు. గానుగ ఏర్పాటు అదనపు ఆదాయ వనరుగా మారిందని, ఇటువంటి సంప్రదాయ ఆధారిత పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని సీఎం అభిప్రాయపడ్డారు. తాము ఉత్పత్తి చేస్తున్న కోల్డ్‌ప్రెస్డ్ వేరుశెనగ నూనెను అనేక మందికి సరఫరా చేస్తున్నామని, మీరు కూడా వినియోగించాలని ముఖ్యమంత్రిని నాగభూషణం కోరారు. ఇంట్లో ఏదైనా వస్తువులు కొనుగోలు చేయాలంటే తన సతీమణి భువనేశ్వరిని అడగాలంటూ అక్కడి నుంచే ఆమెకు ఫోన్ చేసి మాట్లాడి ఒక లీటరు వేరుశనగ నూనెను సీఎం చంద్రబాబు కొనుగోలు చేశారు.

## నీట్ రీ-ఎగ్జామ్‌కు విస్తృత ఏర్పాట్లు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్20, ప్రభాతవార్త: ఏఎన్‌యులో నేడు నీట్ రీ -ఎగ్జామ్ జరుగనుంది. ఈపరీక్షకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ తెలిపారు. ఈ పరీక్షకు 2280మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. 11గం.ల నుంచి విద్యార్థులకు అనుమతి ఉంటుందని,వర్సిటీ మెయిన్ గేట్ వద్ద నుంచి విద్యార్థులకోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈమేరకు శనివారం అబ్జర్వర్‌లకు, ఛీఫ్ సూపరింటెండెంట్‌లకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. వర్సిటీ కేంద్రంలో తగు సమాచారం కోసం బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. తహశీల్దార్‌లను డ్యూటీ మేజేస్ట్రేట్‌లుగా నియమించారన్నారు. సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 150మంది పోటీలు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నామని తెలిపారు.

## భద్రతా ఏర్పాట్లు పరిశీలన

గుంటూరు క్రైమ్, జూన్20, ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉండవల్లి గుహలు వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో యోగా గురువు బాబా రాందేవ్ రాష్ట్ర యోగా,ప్రకృతి వైద్య విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి సంబంధించి గుంటూరు జిల్లా పోలీస్ శాఖ తరఫున చేపట్టిన భద్రతా,బందోబస్తు ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్రంగా పరిశీలించారు. వీవీఐపీలు, వీఐపీలు, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, జిల్లా అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఎ.టి.వి. రవికుమార్ పర్యవేక్షణలో ఉండవల్లి గుహలు, పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టబడ్డాయి.కార్యక్రమ వేదిక,వీవీఐపీల రాకపోకల మార్గాలు,ట్రాఫిక్ నిర్వహణ,వాహనాల పార్కింగ్,ట్రాఫిక్ మళ్లింపులు,భద్రతా తనిఖీలు,రూట్ బందోబస్తు, రూట్ క్లియరెన్స్ పార్టీలు,బాంబ్ డిటెక్షన్ (బీడీ) బృందాల తనిఖీలు తదితర చర్యలు సమర్థవంతంగా అమలు చేయబడ్డాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని,వేదిక పరిసర ప్రాంతాలు,రాకపోకల మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని,ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని,పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (లి వీ) ఎ.టి.వి. రవికుమార్,నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ,ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,ఏఆర్ డీఎస్పీ సంకురయ్య,తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు..

## నీట్ పునఃపరీక్ష నిర్వహణకు పటిష్ట బందోబస్తు

గుంటూరు క్రైమ్, జూన్20, ప్రభాతవార్త: జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న నీట్ (యూజీ)2026 పునఃపరీక్ష ప్రశాంతంగా,పారదర్శకంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసిన 26 పరీక్షా కేంద్రాలలో మొత్తం 7,312 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద తగిన సంఖ్యలో పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించి కట్టుదిట్టమైన బందోబస్తు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## హిందూ ఫార్మసీ కళాశాల బి. ఫార్మసీ ఎం. ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల


గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త : కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చిన తర్వాత నిర్వహించిన హిందూ ఫార్మసీ కళాశాల బి. ఫార్మసీ, ఎం.ఫార్మసీ మొదటి సెమిస్టర్ విద్యార్థుల పరీక్షా ఫలితాలను హిందూ హై స్కూల్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జి. శివరామ్ ప్రసాద్, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు , కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదనరావు విడుదల చేశారు. బి.ఫార్మసీ మొదటి సంవత్సరం పరీక్షలకు 100 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 98 మంది ఉత్తీర్ణత



సాధించినట్లు, వారిలో 8.9 ఎస్ జిపిఏ తో వి.సునీల్ ప్రథమ ర్యాంకు , 8.86 ఎస్ జిపిఏ తో ఎస్. జ్యోతిర్మయి ద్వితీయ ర్యాంకు సాధించారని తెలియ చేశారు. ఎం.ఫార్మసీ ప్రథమ సంవత్సర మొదటి సెమిస్టర్ వివిధ శాఖల నుండి 56 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో అందరూ (100 ) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, అటానమస్ సంస్థల నిబంధనలను పాటిస్తూ పరీక్షలను నిర్వహించిన చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ డాక్టర్ ఆర్.గోవిందరాజన్, పరీక్షా నిర్వహణ కమిటీ సభ్యులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు , కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు , హానరరీ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి , పాలకమండలి సభ్యులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మాడి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య లు తమ అభినందనలు తెలియచేశారు.

## అవోపా ఆధ్వర్యములో గోపూజ గోసేవ

గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త: నెహ్రూనగర్ లోని "గోశాల" యందు 175 వ గోపూజ మరియు గో సేవ కార్యక్రమము అవోపా అధ్యక్షులు కే.వి. బ్రహ్మం అధ్యక్షతన ఘనంగా జరిగినది. ఈ సందర్భంగా అవోపా అధ్యక్షులు కే.వి. బ్రహ్మం మాట్లాడుతూ గో సేవ చేయడం ద్వారా అనేక యజ్ఞాలు చేసిన ఫలితం లభిస్తుందని, గోవులకు ఆహారం పెట్టడం వలన పితృదేవతలు సంతోషిస్తారని, గో ఉత్పత్తులు ఉపయోగించడం వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపినారు. తొలుత మహిళలు గోవులను శుభ్రముగా కడిగి, పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించినారు. మహిళలకు భక్తి గీతాలు మరియు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. పర్యావరణ పరిరక్షణకై గో భక్తులు వెంకట్రావు మరియు రమణనంద్ వివిధ రకాల పూల మరియు పండ్ల మొక్కలు 500 పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమములో "అవోపా" కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, గో సేవ కన్వీనర్ చామర్తి రమేష్ మరియు గోశాల నిర్వాహకులు సురేష్ కుమార్ జైన్, రమేష్ కుమార్ జైన్, వినోద్ కుమార్ జైన్ మరియు సభ్యులు 300 మంది పాల్గొన్నారు.



## మహిళా దొంగలను అరెస్టు చేసిన తెనాలి రూరల్ పోలీసులు:

తెనాలి జూన్20(ప్రభాతవార్త): దేవాలయంలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళలను అరెస్టు చేసిన తెనాలి రూరల్ పోలీసులు. పోలీసుల కథనం ప్రకారం తెనాలి పట్టణంలోని శాంతినగర్ కు చెందిన నాగరాజు పాలపర్తి గంగోత్రి మొగిలి పద్మ పాలపర్తి సేనమ్మ వీరందరూ జూన్ 12వ తేదీ తెల్లవారుజామున తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామంలో శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి గుడి ప్రాంగణంలో నీ దేవాలయ చెందిన ఇత్తడి రాగి వస్తువులను, మరియు దేవాలయ కలశాలను వెండి వస్తువులను దొంగిలించి వాటిని ఆటోలు తీసుకువెళ్లగా, అది గమనించిన గ్రామస్తులు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితులపై ఎస్సై ఆనంద్ కేసు నమోదు చేసి రూరల్ సీఐ నాయబ్ రసూల్ పర్యవేక్షణలో నిందితులు ఆటోలో వెళ్లిన రూట్ లోని సీసీ కెమెరాలు పరిశీలించి అధునాతన సాంకేతిక పరికరాల ద్వారా గుర్తించి శనివారం మధ్యాహ్నం నందివెలుగు జంక్షన్ వద్ద ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకున్నారు వారి నుండి దొంగతనం చేసిన ఇత్తడి రాగి మరియు కలశాలను స్వాధీన పరుచుకున్నారు. అయితే కేసులో మొదటి ముద్దాయి నాగరాజు ఆటోతో సహా పరారయ్యాడు. మహిళా నిందితులు చిత్తుకాగితాలు మరియు ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకోవటానికి ఊరూరా తిరుగుతూ, ఏ ఇంటిలో మనుషులు లేరు ఏ ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి అనే విషయాన్ని గమనించి, రాత్రి సమయాలలో మారుతాళాలతో దొంగతనాలు చేస్తూ ఉంటారని, వీరికి మొదటి ముద్దాయి నాగరాజు నాయకత్వం వహిస్తాడని నిందితులు తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదు అందిన సకాలంలో స్పందించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగతనం చేసిన నిధులను కనిపెట్టి వారిని అరెస్టు చేసిన, తెనాలి రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ మరియు సిబ్బందిని, అలాగే వారికి దిశ నిర్దేశం చేసిన తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్ ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.



## 48గంటల్లో ముద్దాయిని అరెస్ట్ చేసిన కొల్లిపర పోలీసులు:

కొల్లిపర జూన్20(ప్రభాతవార్త): వృద్ధుడిని బెదిరించి దోపిడీ చేసిన ముద్దాయిని కేవలం 48 గంటల వ్యవధిలోని అరెస్టు చేసి చోరీ సొత్తుని రికవరీ చేసిన కొల్లిపర పోలీసులు. పోలీసుల కథనం మేరకు కొల్లిపర గ్రామ నివాసి కొల్లి వెంకటరెడ్డి గత గురువారం తెల్లవారుజామున తన ఇంటి ఆవరణలో పశువుల మేత వేయటానికి బయటకు రాగా అప్పటివరకు బయట వేచి ఉన్న అపరిచిత వ్యక్తి శ్రీనివాసరెడ్డిని మంచం పైకి నెట్టి నీ దగ్గర చేతికి ఉన్న ఉంగరాలు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించగా ఫిర్యాది భయపడి అతని ఉంగరాలను ఇచ్చేశాడు అంతేకాకుండా సదరు దొంగ వెళుతూ శ్రీనివాసరెడ్డి సెల్ ఫోన్ ను తీసుకొని పారిపోయాడు. అనంతరం ఫిర్యాదిదారుడైన శ్రీనివాసరెడ్డి కొల్లిపర పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై ప్రసాద్ తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్ ఆదేశాల మేరకు సిబ్బంది రామకోటేశ్వరరావు రామకృష్ణ కూర్మారావు అశోక్ ల సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు చేపట్టి ముద్దాయి బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాంభట్ల వారి పాలానికి చెందిన పగడం ఉమా శంకర్ రెడ్డి గా గుర్తించి శనివారం వల్లభాపురం గ్రామ కరకట్ట వద్ద ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుండి దొంగిలించబడిన బంగారపు ఉంగరాలు రెండు రికవరీ చేసి ముద్దాయిని రిమాండ్ కు తరలించటం జరిగింది. ఫిర్యాదు అందిన సకాలంలో స్పందించి కేవలం 48 గంటలలోపే దొంగను అరెస్టు చేసి సొత్తును రికవరీ చేసిన కొల్లిపర ఎస్సై ప్రసాద్ ని మరియు సిబ్బందిని తెనాలి డిఎస్పి జనార్ధన రావు అభినందించారు ఈ సందర్భంగా డి.ఎస్.పి జనార్ధన రావు మాట్లాడుతూ కొన్ని మండల గ్రామ ప్రజలందరూ మీ గృహాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని దాని ద్వారా నిరంతర నిఘా ఉంటుంది కావున ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.



## పర్యావరణం రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

నగరం , జూన్ 20, ప్రభాతవార్త: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని నగరం ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిధిలోని పూడివాడ గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను బయట, రోడ్ల పక్కన పడేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని తెలియజేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతను తెలియజేశారు. మనం వినియోగించే పాలిథిన్, ప్లాస్టిక్ అవశేషాలు భూమిలో కలిసేందుకు సంవత్సరాల కాలం పడుతుందని ఈ వ్యవధిలో ప్లాస్టిక్ అవశేషాలు పర్యావరణాన్ని హానికరం గా మారతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జనసేన ఐటీ విభాగం ఛైర్మన్ మిరియాల శ్రీనివాసరావు కు ఘన సన్మానం

మంగళగిరి, జూన్ 20, ప్రభాతవార్త : జనసేన పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర ఛైర్మన్ మిరియాల శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నార్త్ అమెరికా స్పెషల్ రిప్రెజెంటేటివ్‌గా నియమితులైన సందర్భంగా మంగళగిరిలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గంలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్ బాబు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఐటీ విభాగం



నాయకులు, జనసేన శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై మిరియాల శ్రీనివాసరావును అభినందించారు... ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మిరియాల శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐటీ విభాగాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడంతో పాటు సోషల్ మీడియా వేదికగా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఏపీ ఎంఎస్ ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, చందు సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, గంజి చిరంజీవి, కిలారి రోశయ్య, బాడిత శంకర్, జొన్న రాజేష్, పాల్గొన్నారు.

**పవన్ కళ్యాణ్‌కు మిరియాల శ్రీనివాసరావు విలువైన ఆస్తి:**
**ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు**

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ ఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రారంభమైన నాటి నుంచి మిరియాల శ్రీనివాసరావు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన అంకితభావం, సమర్థతను గుర్తించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఐటీ విభాగం ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారని గుర్తు చేశారు. పార్టీకి మిరియాల శ్రీనివాసరావు ఒక విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను చందు సాంబశివరావు, గంజి చిరంజీవి, కిలారి రోశయ్య, జొన్న రాజేష్, మిరియాల వెంకటేశ్వరరావు, రాయపాటి అరుణ, రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్లు ఉయ్యూరు శ్రీనివాస్, చవ్వాకుల కోటేష్ బాబు, జిల్లా కోఆర్డినేటర్లు నేర్సు వివేక్, శివప్రట్ల నక్కల, శ్యాంప్రసాద్ పాశం, వెంకటేష్, యాపరాల లక్ష్మీకాంత్ జనసైనికులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మిరియాల శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

నిజాంపట్నం, జూన్ 20, ప్రభాతవార్త: స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని మంత్రి సోదరుడు శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని పల్లపట్లలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, సిడిపిఓ అనూరాధ, ఎంపిడిఓ నాగలక్ష్మి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.



## ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 20, ప్రభాతవార్త : అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఎలాంటి తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన సర్ ప్రక్రియలో భాగంగా శనివారం ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్వోలు, బిఎల్ఎ లు ఓటర్లకు అందించారు. మండలంలోని మేజర్ పంచాయితీ కొర్నెపాడు గ్రామ ముట్లూరు 148 బూత్ లో 683 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 530 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించడం జరిగిందని బిఎల్ఓ నాగమణి, బిఎల్ఎ రాజేష్ తెలిపారు. ఈ ఫారాలు ఇంటింటి సందర్శనల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన సర్‌లో ప్రజలు పాల్గొనాలని కోరారు.



# పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: మంత్రి మనోహర్

తెనాలి మున్సిపాలిటీ జూన్20(ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని దానికోసం ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్కను నాటాలని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం పట్టణం లోని



,బాలాజీరావుపేటలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళికి ప్రాణవాయువు అందిస్తూ ప్రకృతిలో సమతుల్యత పాటిస్తూ మానవ మనుగడలో ప్రముఖ పాత్ర పోషించేది చెట్లేనని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెట్లు నాటే కార్యక్రమం చేయాలని తద్వారా భావితరాలకి స్వచ్ఛమైన గాలి ప్రకృతి అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. భూమి మీద జీవజాలంతో పాటు మొక్కలు కూడా ప్రకృతిలో భాగమేనని మానవుడికి జీవితాంతం ఉపయోగపడే మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు.

## ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగించుకోవాలి

కొల్లిపర, జూన్ 20 ప్రభాతవార్త: గ్రామీణ ప్రజలు ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగించుకోవాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు చంద్రా అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మెడ్‌స్టార్ హస్పిటల్ ఆద్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా విద్య శిభిరంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చంద్రా మాట్లాడుతూ మెడికల్ క్యాంపు ద్వారా దీర్ఘకాలిక రోగాలను గుర్తింవచ్చన్నారు. బీపీ..షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రతలు తీసుకుంటూ వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు. అనంతరం 120 మందికి మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమవరపు లంక కోటిరెడ్డి, గ్రామపెద్దలు పుచ్చకాయల మోహనరెడ్డి, చుండూరు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



## రైతుల సంక్షేమమే కూటమి పభుత్వం లక్ష్యం-ఏడిఏ విజయబాబు

కొల్లిపర, జూన్ 20 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తుందని ఏడిఏ విజయబాబు అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర పాలకేంద్రం కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏడిఏ విజయబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా 6,995 మంది రైతులకు రూ.3 కోట్ల 49 లక్షల 75 వేలు రైతుల ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. అదేవిధంగా పిఎం కిసాన్ క్రింద 5 వేల 490 మంది రైతులకు 9 లక్షల 80 వేలు రూపాయలు జమ అయినట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు..ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులు..విత్తనాలు కొనుతగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా షాపు నుండి బిల్లులు తీసుకోవాలన్నారు. సమావేశంలో కొల్లిపర సొసైటీ అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



# నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం, వెరసి కూటమి ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలన: మంత్రి నాదెండ్ల

తెనాలి మున్సిపాలిటీ జూన్20(ప్రభాతవార్త): నమ్మకం,అభివృద్ధి, సంక్షేమం వెరసి కూటమి ప్రభుత్వం అందించిన రెండేళ్ల సుపరిపాలనతో,రాష్ట్రంలో ప్రజల మోములో సుఖసంతోషాలు వెల్లి విరుస్తున్నాయని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం తెనాలి పురపాలకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన .."రెండేళ్ల సుపరిపాలన విజయోత్సవ సభ"..లో మంత్రి,నాదెండ్ల మనోహర్, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ,ప్రతిపక్ష ఓటు చీలనివ్వకూడదనే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుతో ఏర్పడిన కూటమికి ప్రజలు అందించిన నమ్మకం, మద్దతు, తీర్పుతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు."పదవి అనేది అలంకారం కాదు, బాధ్యత" అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంసుపరిపాలన ను స్వపరిపాలనగా మార్చి తమ మద్దతుదారులకే పథకాలు పరిమితం చేసిందని, కూటమి ప్రభుత్వం మాత్రం రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. తెనాలి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.12 లక్షల కోట్ల అప్పుల భారంలోకి నెట్టివేసినప్పటికీ, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. తెనాలి





నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం సాధించిన ముఖ్య విజయాలు గమనిస్తే,అన్నదాత సుఖీభవ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు రూ.20,000 పెట్టుబడి సాయం మూడు విడతల్లో అందజేసామని, 5,302 మంది రైతుల నుంచి 31 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు, రూ.75.49 కోట్ల చెల్లింపులను 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమచేసామని, తల్లికి వందనం పథకం ద్వారా 29,293 మంది విద్యార్థులకు రూ.37.31 కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు. 2,739 మహిళా సంఘాలకు రూ.326 కోట్ల రుణాలు మంజూరు చేసామని,పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.60 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేసామన్నారు. రూ.26 కోట్లతో క్రిటికల్ కేర్ ఆసుపత్రి ఏర్పాటు, అత్యవసర వైద్య సేవలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని విజయపథంలో నడిపించేందుకు నాయకులు, కార్యకర్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, అత్యంత సమర్థవంతమైన పాలకుడు చంద్రబాబు నాయుడు అని ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నామని వృద్ధాప్య పెన్షన్ మొదలు దీపం పథకం అన్నదాత సుఖీభవ స్త్రీ శక్తి వంటి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 12 వేల ఎకరాల్లో గంజాయి సాగు చేసి రాష్ట్రాన్ని గంజాయి వనంగా మారిస్తే కూటమి ప్రభుత్వం గంజాయి రహిత రాష్ట్రంగా మార్చిందని అలాగే రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామం గా మార్చి యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వ కృషి చాలా ఉందన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదని కోటమి ప్రభుత్వం కేవలం 148 రోజుల్లో డీఎస్సీ నిర్వహించి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు తెనాలి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటారి వాసుదేవ నాయుడు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు మహిళలు, పెద్ద ఎత్తున కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు యాప్ ద్వారానే ఎరువులు ఇవ్వాలి

ప్రతిపాడు, జూన్ 20, ప్రభాతవార్త : రైతులకు ఏపీఏఐ ఎంఎస్ యాప్ ద్వారానే ఎరువులు అందించాలని మండల స్పెషలాఫీసర్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య తెలిపారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల సెంటర్ ను స్పెషల్ ఆఫీసర్ చెన్నయ్య, ఇతర అధికారులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఎరువులు సక్రమంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో నూతనంగా ఏపీఏ ఐఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్యేక చొరవతో ప్రతి రైతుకు వారు సాగుచేస్తున్న విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు అందేలా ఈ యాప్‌ను ప్రవేశపెట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో నేటి నుంచి రైతులకు యాప్ ద్వారా ఎరువుల పంపిణీ ప్రారంభమైనట్లు చెప్పారు. అనంతరం మన గ్రోమోర్ ఎరువుల దుకాణానికి సంబంధించి పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు ఎరువులు అందించకుండా అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎలీషా బాబు, ఇన్చార్జి తహసిల్దార్ రాజీవ్ కుమార్, వ్యవసాయ అధికారి సునీత, వీఏఏ త్రినాథ్, రైతులు, మన గ్రోమోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బాల చిత్రకారులకు మంత్రి నాదెండ్ల ప్రశంస

తెనాలి మున్సిపాలిటీ జూన్20(ప్రభాతవార్త): కూటమిప్రభుత్వం రెండు సంవత్సరాలు సుపరిపాలన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలంక సంఘం ఏర్పాటు చేసిన స్టాల్స్ లో విద్యాశాఖకు సంబంధించి, చిత్రలేఖన విభాగంలో భాగంగా స్టూడెంట్స్ వేసిన చిత్రాలను మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ వీక్షించి ఆనంద పరవసులయ్యారు. విధ్యార్థిని భాను వేసిన వెంకటేశ్వర స్వామి పెయింటింగ్ తో ఆహ్వానం పలుకగా,బాల చిత్రకారుడు వేసిన రకరకాల పెయింటింగ్స్ ను చూసి, ముఖ్యంగా జాస్మిన్ వేసిన "ఇండియన్ కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా "పెయింటింగ్ చాలా బాగా వేసిందని, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశంసించారు. ఎంఈఓ లు, లక్ష్మీనారాయణ, జయంత్ కుమార్ ఆదేశాల మేరకు, చిత్రలేఖన ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ పెయింటింగ్ లో విద్యార్థులకు తర్ఫీదునిచ్చి, పోటీలకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఎన్నో పతకాలు సాధించిన ఫోటోలు, 3 వేలకు పైగా పోస్ట్ కార్డులు (గ్రీటింగ్స్), యోగాంధ్ర2025,ఎంపీటీమ్, విద్యార్థులతో ఆకృతులను తయారు చేయడంలో తనదైన శైలి,తెనాలి ఉపాధ్యాయులు నటించిన రేపేంది నాటికకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం వచ్చిన సందర్భంగా, మంత్రి నాదెండ్ల మనోహర్ సన్మానించిన తదితర ఫోటోల తో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్ అందరినీ ఆకట్టుకున్నాయి.



## లైసెన్సు లేకుండా ఎరువులు అమ్మొద్దు...అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

**--ఎరువుల తనిఖీ ప్రత్యేక బృందం అధికారి తిరుమలదేవి**

కొల్లిపర, జూన్ 20 ప్రభాతవార్త: లైసెన్సు లేకుండా ఎరువులు అమ్మవద్దని...అంతేగాకుండా రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువుల తనిఖీ ప్రత్యేక బృందం అధికారి తిరుమలదేవి డీలర్లను హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో వ్యవసాయశాఖ తనిఖీ బృందం ఎఉరువులు..పురుగు మందుల షాపులను ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఎఉరువులకు,.. పురుగుమందులకు సంభందించిన రికార్డులను.. స్టాక్ ను ..లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుమలదేవి మాట్లాడుతూ ఎరువుల షాపుల యజమానులు లైసెన్స్..ఫారమ్ ఓలను జత చేయాలని పేర్కొన్నారు. ఏపిఏఐఎంఎస్‌లో వివరాలు నమోదు చేసుకుని మరలా దానిని వెరిఫై చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా..డీఏపీ కొనుగోలు చేయటానికి అర్హులు కాబట్టి రైతులందరూ యాఫ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విత్తనాలను అమ్మాలని చెప్పారు. డీలర్లు అందరూ తప్పనిసరిగా ఈ ఫాస్ మిషన్లు వాడాలని చెప్పారు. తనిఖీలో ఏవోలు గోపీనాథ్,ప్రియదర్శిని, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



## బాధ్యతలను మరువద్దు..ప్రతి దరఖాస్తును పరిశీలించండి

**--డిప్యూటి ఎంపీడీవో దానయ్య**

కొల్లిపర, జూన్ 20 ప్రభాతవార్త: ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ..ప్రతి దరఖాస్తును స్వీకరించి పరిశీలించాలని డిప్యూటి ఎంపీడీవో దానయ్య అన్నారు. మండల కేంద్రం కొల్లిపర సచివాలయాన్ని ఆకస్మింగా తనిఖీ చేసి తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలు అందించి..ప్రజల మన్ననలు పొందాలన్నారు. సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు.




## నిందితులకు రిమాండ్ విధించిన తహసీల్దార్ గోపాలకృష్ణ



తెనాలి మున్సిపాలిటీ జూన్20(ప్రభాతవార్త): దొంగతనం కేసులో నిందితులుగా ఉన్న నిందితులకు రిమాండ్ విధించిన తెనాలి మండల తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ. వివరాల్లోకి వెళితే, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ హోదాలో, తెనాలి మండల తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ శనివారం కొల్లిపర మండల పోలీసులు ప్రవేశ పెట్టిన చెరుకుపల్లి మండలం పగడంవారి పాలెం గ్రామమునుకు చెందిన పగడం ఉమా శంకర్ రెడ్డి(23) రూరల్ పోలీసులు ప్రవేశ పెట్టిన పాలపర్తి నాగరాజు, (25)మొగిలి భాగ్యా రావు, (35)మరియు కట్టా గోపి అనువారికి దొంగతనం కేసులో 15 రోజులు జుడీషియల్ రిమాండ్ విధించి గుంటూరు సబ్ జైల్ కు పంపించారు.

## ఓటు హక్కును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

పెదకూరపాడు, జూన్20(ప్రభాతవార్త): అమరావతి మండలాల్లోని వైయస్ఆర్ సీపీ శ్రేణులు , బి ఎల్ ఎ లతో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధం అత్యంత కీలకమైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు, అమరావతి మండలాల్లోని వై యస్ ఆర్ సీపీ బి ఎల్ ఏ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్ ) ప్రక్రియను అప్రమత్తంగా చేయాలనీ తెలిపారు. రాబోయే రోజుల్లో మన భవిష్యత్తును నిర్ణయించేది ఓటు హక్కు మాత్రమేనని అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలి అన్నారు. మనం అప్రమత్తంగా లేకపోతే అర్హులైన వారి ఓట్లను గల్లంతు చేసేందుకు కొందరు కుట్రలు, ప్రయత్నాలు చేసే అవకాశం ఉందన్నారు . ముఖ్యంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. సార్ పక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, దొంగ ఓట్లను గుర్తించి వాటిని తక్షణమే తొలగించేలా చూడాలన్నారు. ప్రజలు, ముఖ్యంగా వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ ప్రక్రియను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు . మీ ఓటు భద్రంగా ఉందో లేదో సరిచూసుకోవడం మీ బాధ్యత అని నంబూరు శంకరరావు అన్నారు.



## మార్పు కోసం ఒక అడుగు టీం కృషితో తాళ్లచెరువులో అభివృద్ధి పనులకు శ్రీకారం

అచ్చంపేట జూన్ 20 (ప్రభాతవార్త): అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామంలోని ఎస్సీ మాదిగపల్లెలో ఉన్న దేవుడు మాన్యం ప్రాంత అభివృద్ధికి "మార్పు కోసం ఒక అడుగు" టీం చేసిన కృషి ఫలించింది. 2002 సంవత్సరంలో దేవుడు మాన్యంలో 234 మంది లబ్ధిదారులకు గృహ స్థలాలు కేటాయించినప్పటికీ, ఇప్పటి వరకు రహదారులు, డ్రైనేజీ కాలువలు వంటి మోలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన "మార్పు కోసం ఒక అడుగు" టీం సభ్యులు పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారికి, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా గారికి వినతిపత్రాలు సమర్పించారు. వారి చొరవతో దేవుడు మాన్యంలో రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి సంబంధించిన చర్యలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అచ్చంపేట మండల పంచాయతీరాజ్ ఏఈ ధర్మకోట శివయ్య మాట్లాడుతూ, దేవుడు మాన్యం ప్రాంతాన్ని పరిశీలించి అభివృద్ధి పనులకు అవసరమైన అంచనా వ్యయ ప్రతిపాదనలు (ఎస్టిమేట్లు) సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో "మార్పు కోసం ఒక అడుగు" టీం నాయకులు మేదర రాఘవరాజు, దుగ్గి శ్రీనివాసరావు, రేపూడి జోజి (మాజీ సర్పంచ్), మేదర అజయ్, రేపూడి అనిల్, చింతపల్లి అనిల్, దేవరకొండ బాబు తదితరులు పాల్గొన్నారు. దేవుడు మాన్యం ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## రోటరీ గవర్నర్ రాంప్రసాద్ జన్మదినం సందర్భంగా దుస్తులు పంపిణీ

తెనాలి జూన్20(ప్రభాతవార్త): రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శనివారం రోటరీ డిస్ట్రిక్ట్ 3150 డిస్టిక్ గవర్నర్ డాక్టర్ సోమవరపు వెంకటరాం ప్రసాద్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం పేదలకి దుప్పట్లు పంపకం జరిగింది, రోటరీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ ద్వారా దుప్పట్ల పంపకం జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, డిస్టిక్ టీం కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్, క్లబ్ సభ్యులు గుమ్మడి ప్రసాద్, కొల్లి రాజేంద్రప్రసాద్, వేలివోలు ఇందిర, మల్లాది అర్జున్, సూర్యనారాయణ, ఆలపాటి కిరణ్, రాజశేఖర్ రెడ్డి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## దానాల్లో ఉత్తమమైనది, భూదానం

తెనాలి జూన్20(ప్రభాతవార్త): శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో తెనాలిలో చేపట్టిన నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం కు సేకరిస్తున్న భూదాన విరాళం లో భక్తులందరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.శనివారం స్థానిక బాలాజీ రావు పేట లోని ప్రియ థియేటర్ ఎదురు గల కోట బదరీ నాథ్ గుప్తా స్థల ప్రాంగణం నందు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామికి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ నేతృత్వంలో సభ్యులు ,భక్తులు సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ గావించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసునికి తెనాలిలో నిర్మించదలచిన ఆలయానికి భక్తులు తమ శక్తానుసారం సహకారం అందించి తోడ్పడాలన్నారు. తన కుమార్తె లాస్య ప్రియ తనకు ఇచ్చిన పాకెట్ మనీని దాచుకొని శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్టుకు ఒక అడుగు భూదాన విరాళం అందజేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.ట్రస్ట్ నిర్వాహకులు ఆర్వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో 13626 నుండి ఎనిమిది శనివారములు, వారానికి 8 సార్లు చొప్పున శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం కు ట్రస్ట్ సేకరిస్తున్న భూదాన విరాళం లో ఇంటర్ విద్యార్థిని, సంగం జాగర్లమూడి కి చెందిన నారాయణం లాస్య ప్రియా ఒక అడుగు భూదాన విరాళం అందజేయడం అభినంద నీయమన్నారు. దివ్య క్షేత్రం భూదాన విరాళంలో భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ట్రస్ట్ చేపట్టే ఆధ్యాత్మిక సేవలలో సంకీర్తన బృంద సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం లో భాగంగా వైఖానస పండితులు నారాయ్ణణ. గోవర్ధన లక్ష్మీ రఘురామ్ దంపతులకు ట్రస్టు సభ్యులు స్వామి వారు వస్త్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. విద్యార్థిని లాస్య ప్రియ మాట్లాడుతూ తనకు ఇష్ట దైవమైన వెంకటేశ్వర స్వామికి తెనాలిలో ట్రస్టు నిర్మించే ఆలయం కు సేకరిస్తున్న భూదాన విరాళంలో ఒక అడుగు భూదాన విరాళం అందజేయడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రు ఇచ్చిన పాకెట్ మనీని ఇటువంటి కార్యక్రమానికి ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు.. కార్యక్రమంలో భాగంగా పారాయణలో పాల్గొన్న మహిళలకు సంకీర్తన బృందం గరుడాద్రి గ్రూప్ సభ్యులు పసుపు, కుంకుమను అందజేశారు..కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వరావు, మదుపల్లి చంద్రశేఖర్ ,గుడివాడ బాలకృష్ణ, జంజం రామారావు, ట్రస్ట్ సభ్యులు రొంపిచర్ల సురేష్,మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్, అంబటి శ్రీనివాసరావు,కోట రవిశంకర్, బచ్చు లీలా ప్రసాదరావు,సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.



## తెనాలి చిత్రకారుని ప్రతిభ, రావి ఆకుపై యోగా చిత్రం




తెనాలి జూన్20(ప్రభాతవార్త): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టార్ , వ్యంగ్య చిత్రకారుడు పణిదెపు వెంకట కృష్ణ (కృష్ణశ్రీ )రావి ఆకుపై యోగాసనాలు చేస్తున్న చిత్రం మరియు ఖియోగా డే ఖి అనే ఆంగ్ల అక్షరాలను కత్తిరించి అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. పండుగలు, ప్రత్యేక దినాలలో కూడా రావి, కరంలు, టేకు, బాదం ఆకు లపై ఎన్నో వైవిధ్య చిత్రాలు కత్తిరించి ప్రముఖుల మన్ననలు పొందారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:

రేపల్లె, జూన్ 20, (ప్రభాతవార్త): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు గత కొంతకాలంగా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, పట్టణాల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజ్ నిర్వహణ వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్న కార్మికులకు తగిన వేతనాలు, గృహ వసతి, సంక్షేమ సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా సీనియర్ నాయకులు కన్నెగంటి సుబ్బారావు, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కౌన్సిల్ సభ్యులు కొక్కిలిగడ్డ దుర్గ, బెజ్జం ముఖర్జీ, బాపట్ల జిల్లా ఏఐటీయూసీ మున్సిపల్ ఉపాధ్యక్షులు పడమటి టిక్షాలు, రేపల్లె ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శిరంశెట్టి శ్రీనివాసరావు, కార్మికులు మద్దాల రమేష్, బి. నాగరాజు, బి. నాగపండు, మెరిక కుమారి, శ్రీరామ్ నారాయణ, టి. వెంకటేశ్వరరావు, వై. వెంకన్న, భూపతి దుర్గారావు, శిరంశెట్టి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం

రేపల్లె, జూన్ 20, (ప్రభాతవార్త): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేనేత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 22న బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని శనివారం ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. భట్టిప్రోలు అద్దేపల్లి గ్రామంలో చేనేత వాడల్లో ప్రచార నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ లు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రాల రూపంలోనూ ఆందోళన కార్యక్రమాల ద్వారా విన్నవించుకున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు నాగమల్లేశ్వరరావు, డిపాల సాంబశివరావు, టి. మోహనరావు, తాడిపర్తి సత్యనారాయణ, మంగయ్య, జి.వి. కృష్ణారావు, ఎస్. గోపాలస్వామి, పి. శంకరరావు, డి. హేమలత, దార్సిక్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్ఎఎస్ఎ, ఓసిఎస్ కార్యక్రమం

రేపల్లె, జూన్ 20, (ప్రభాతవార్త): స్థానిక పురపాలక సంఘం పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర,ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాలు శనివారం ముగిసాయి. మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు దిశ నిర్దేశంతో సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, మెప్మా సిబ్బంది, పాఠశాల,కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, గృహాల నుండి ఉత్పన్నమయ్యే వ్యర్థాలలో తడిపొడి, హానికారక చెత్త ను వేరుచేయడంపై అవగాహన కల్పిస్తూ, పచ్చదనంపరిశుభ్రత లక్ష్యంగా అందరిని భాగస్వామ్యం చేశారు.పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.




## అనారోగ్య బాధితులకు బాసటగా ముఖ్యమంత్రి సహాయ నిధి: అనగాని శివప్రసాద్

రేపల్లె, జూన్ 20, (ప్రభాతవార్త): రేపల్లె నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న బాధితులను ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటోందని తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత అనగాని శివప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల 51 వేల 380 సిఎం ఆర్ఎఫ్ చెక్కు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నిబద్ధత,చొరవ,ప్రజల సంక్షేమమే పరమావధిగా భావిస్తూ పరిపాలన చేస్తున్నందునే ప్రజలకు ఆర్థిక ప్రయోజనం లభిస్తున్నదని చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి విడుదల చేయడం అభినందనీయమన్నారు. అర్హులకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని శివప్రసాద్ వెల్లడించారు. ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ సేవలు ప్రశంసనీయమన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా కూటమి పాలనలో రేపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## ఇంటర్, పది పరీక్షలలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్ధులకు పారితోషకం పంపిణీ

యడ్లపాడు, జూన్ 20, ప్రభాతవార్త : యడ్లపాడు మండలం లో 2025/2026, సంవత్సారములో ఇంటర్ మరియు పదో తరగతి పరీక్షలలో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు అభినందన మరియు నగదు పారితోషికం భాహుకరణ కార్యక్రమాన్ని నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ వారు నిర్వహించినారు. కార్యక్రమములో జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల మరియు ఇంటర్మీడియట్ లో మండలం లో ఫస్ట్ ర్యాంక్ సాధించినవారు దార్నసి అరవింద్ (579/600) - జగ్గాపురం, దండా వేణు మాధవ చౌదరి (576/600) - ఉన్నవ, పటాన్ నాస్మిన్ (571/600) - యడ్లపాడు, షెక్ అషిఫా (570/600) - లింగారావుపాలెం, ఆర్ కార్తీక్ సాహు (564/600) - తిమ్మాపురం, సి హెచ్ లికిత (555/600) - సొలస,టి కరుణశ్రీ (534/600) - వంకాయలపాడు, మానుకోండ యస్వీత రెడ్డి (514/600) - సందెపూడి, ఎల్ అక్షి త (482/600) - కారుచోల, డి లక్షి ్మ గాయత్రి (944/1000) - యడ్లపాడు ఇంటర్ కాలేజీ, పైన పేర్కొనిన ప్రతి యొక్క విద్యార్థికి ప్రోత్సాహక పారితోషకం 1000/, నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ వారు భాహుకరించినారు. ఈ కార్యక్రమములో పాల్గొనిన ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు పూలతోను , శాల్వతోను సత్కరించుకోవటం జరిగినది. ఈ కార్యక్రములో పాల్గొనలేను విద్యార్ధులకు, వారి తల్లితండ్రులకి అందచేయటం జరిగినది. ఈ కార్యక్రములో ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణ కుమారి, ఉప అధ్యక్షుడు యందేటి ప్రసాద రావు, ఎన్. శ్యామ్ ప్రణీత్, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్ధులు పాల్గొన్నారు.



## అన్నీశాఖల అధికారులు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించాలి

పొన్నూరు, జూన్ 20,ప్రభాతవార్త: అన్నీ శాఖల అధికారులు ప్రభుత్వ సేవలను ప్రజలకు సకాలంలో అందించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేవిధంగా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కొండా వీర వెంకట సత్యనారాయణ కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని సీతారామపురం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఆయుష్ వైద్యశాలను సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్యసేవలను వైద్యుల ద్వారా అడిగి తెలుసుకొన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీలో ఎంత మంది పిల్లలు ఉన్నారు..? వారికి అందిస్తున్న సేవలు, అక్కడ ఉన్న వసతులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ యూరియా, డిఏపి ఎరువులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. రైతు సేవా కేంద్రంలోని సిబ్బంది రైతులకు సకాలంలో పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు అందించేవిధంగా ఆలోచన చేయాలన్నారు. పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయితీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో త్రాగునీరు సక్రమంగా అందుతుందా..?లేదా..? ప్రతి నిత్యం తడిపొడి చెత్తలను సేకరించి సక్రమంగా డంపింగ్ యార్డును నిర్వహిస్తున్నారా..? అనే విషయాలను స్వయంగా పరిశీలించి సిబ్బంది ద్వారా కొన్ని విషయాలను రాబట్టారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న, చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కనుక గ్రామాల్లో ఎలాంటి అంటువ్యాధులు ప్రభలకుండా చూడాల్సిన బాధ్యత పంచాయితీ కార్యదర్శులపై ఉందన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఏదైనా ఆరోగ్యం సరిగాలేదనుకుంటే తక్షణమే ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపీడిఓ వేముల శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

పొన్నూరు, జూన్ 20,ప్రభాతవార్త: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన హక్కు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డక్కుమళ్ళ రవి అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఓటు తొలగించిన తర్వాత మళ్ళీ ఓటు చేర్పించాలంటే చాలా కష్టమైన పని అని చెప్పారు. ప్రతి ఓటరు ప్రత్యేక సర్వే విషయంలో జాగ్రత్తగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సర్ ఎందుకు నిర్వహిస్తారంటే మరణించిన వారి పేర్లు తొలగించేందుకు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉంటే తొలగించడానికని చెప్పారు. అదేవిధంగా శాశ్వితంగా వేరే ప్రాంతానికి వలస వెళ్ళినవారి పేర్లు కూడా తొలగించేందుకన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఈ సర్ కార్యక్రమం జరుగుతున్నట్లు చెప్పారు. 20సంవత్సరాల తర్వాత జరిగే ఈ సర్ కార్యక్రమంలో ఓటర్లంతా అప్రమత్తంగా ఉండి, ప్రతి ఓటరు ఓటు హక్కు కలిగినవారు ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేసి ఖచ్చితంగా చిరునామా వ్రాయాల్సి ఉందన్నారు. ఫారం పూర్తిచేయడం తెలియనివారు బిఎల్వోలను, బిఎల్యేలను అడిగి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దామని డక్కుమళ్ళ రవి పిలుపునిచ్చారు.



## ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే ధ్యేయం

పొన్నూరు, జూన్ 20,ప్రభాతవార్త: ప్రజాసేవలో రెవెన్యూ శాఖకు, ఉద్యోగులకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవడానికి, పారదర్శకమైన సేవలను అందించేందుకు ప్రతి ఏటా జూన్ 20వ తేదీన రెవెన్యూ డే నిర్వహించుకోవడం జరుగుతుందని తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం రెవెన్యూ డేని పండుగ



వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ భారతదేశంలో 1786లో మొట్టమొదటిసారిగా బోర్డు ఆఫ్ రెవెన్యూ ఏర్పాటైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించు కొని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు. రెవెన్యూ దినోత్సవం అనేది కేవలం వేడుక మాత్రమే కాదని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలను అందించడానికి రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పునరంకితం అయ్యే రోజన్నారు. విశ్రాంత తహశీల్దార్ గేరా అంకారావు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్లు, సరిహద్దుల గుర్తింపు, భూ రికార్డుల(ఆన్‌లైన్ అప్‌డేట్)నిర్వహణ ఈ శాఖ ప్రధానమైన విధి అని చెప్పారు. ప్రభుత్వ భూములను, చెరువులను, ఇతర ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా రెవెన్యూ శాఖకే వర్తిస్తుందన్నారు. రెవెన్యూలో విధులు నిర్వహిస్తున్నామంటే ఎంతో గర్వంగా చెప్పుకోదగ్గ విషయమన్నారు. వ్యక్తి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు రెవెన్యూ శాఖతో సంబంధం ఉందన్నారు. రెవెన్యూలో పనిచేసే ఉద్యోగులు తమ విధులను పారదర్శకంగా అందిస్తే ప్రజల్లో మంచి కీర్తిప్రతిష్టలు సంపాదించవచ్చన్నారు. రెవెన్యూలో పనిచేస్తున్నామంటే ఒక గౌరవ ప్రదమైనది భావించాలన్నారు. ఉద్యోగులందరూ ప్రజాసేవకే అంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విశ్రాంత తహశీల్దార్ అంకారావు, విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ పగడాల పాండురంగారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, కరీముల్లా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నల్లపు మౌనిక, జూనియర్ అసిస్టెంట్లు నాగేశ్వరారవు, సిసిల్, కంప్యూటర్ ఆపరేటర్లు సుబ్రహ్మణ్యం, విఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు, జూన్ 20,ప్రభాతవార్త: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో భాగంగా శనివారం పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత




పాఠశాల నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను, కాలువల్లో సిల్ట్‌ను తొలగించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కాలువల్లో, రోడ్లపై చెత్తా చెదారాలను వేయవద్దని కోరారు. క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఇ వెంకయ్య చౌదరి, మునిసిపల్ మేనేజర్ పిన్నిబోయిన పోతురాజు, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్, రోటరీక్లబ్ నాయకుడు నన్నపనేని బాలకృష్ణ, నాయకులు ఆకుల సాంబశివరావు, గురుబాలు, షేక్ యాసిన్‌బాబా, మునిసిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## పలు ప్రవేటు పాఠశాలలను తనిఖీ చేసిన డిఇఓ

గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త: గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష గుంటూరు నగరంలోని కెవిపి కాలనీ, శ్రీనివాసరావుపేట లొ గల సుజాత స్కూల్స్, సిద్ధార్థ స్కూల్ తనిఖీ చేశారు ఈ సందర్భంగా పాఠశాల గుర్తింపు, రికార్డులు తనిఖీ చేశారు ఏ ప్రైవేట్ పాఠశాల అయినా ప్రభుత్వం నిబంధన ప్రకారము నడుచుకోవాలని, ప్రభుత్వము నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, పాఠశాల కాంపౌండ్ లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అమ్మ రాదని అన్నారు పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యాలు మరియు వసతులను పరిశీలించారు విద్యార్థుల చూసి రాత పుస్తకాలు మరియు పాఠ్యపుస్తకాలను తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు .



## నువా ఆవిష్కరణ వినూత్నం

గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త : ప్రకృతి అద్భుతాల సృష్టిలో భాగంగా నూతన ఆభరణాల ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక మలబారులో జరిగింది ఈ సందర్భంగా ఆవిష్కరణ కార్యక్రమమైన నువా గురించి మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ. అహ్మద్ మాట్లాడుతూ"మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిశ్శబ్దంగా ఆకారమిస్తున్న ప్రకృతి యొక్క సూక్ష్మ నిర్మాణాలు, ఆకృతులు మరియు వివరాల అందాన్ని వేడుక చేసుకోవడమే ఈ కలెక్షన్ ప్రధాన ఉద్దేశ్యం అని పేర్కొన్నారు నువా ద్వారా ఆ సహజ సౌందర్యాన్ని ఆధునిక న్యాచురల్ ఆభరణాల కలెక్షన్‌గా మలచాలని మేము కోరుకున్నామనీ వెల్లడించారు. ఇది సొగసైనదిగా ఉండటంతో పాటు వివిధ సందర్భాలకు అనువుగా, నేటి మహిళల జీవనశైలికి సరిపోయేలా ఉండాలనేది మా లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రతి ఆభరణం అత్యుత్తమ హస్తకళను సహజ విలాసాన్ని సమతుల్యం చేస్తూ, తరతరాల పాటు ఆస్వాదించదగిన విధంగా రూపొందించబడింది." అని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త రమణారావు స్టోర్ హెడ్ నజీర్ మేనేజర్ వినయ్ మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ సపోర్టింగ్ వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన అవసరం


గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త : లైఫ్ సపోర్టింగ్ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన అవసరమని గుండె ఊపిరితిత్తులు లివర్ కిడ్నీ తదితర ముఖ్యమైన శరీర అంతర్భాగాల అవయవాల అంశాలలో అత్యవసర వైద్య సేవలు రోగులు పొందే విషయంలో అత్యవసరంగా అందించాల్సిన లైఫ్ సపోర్టింగ్ సేవలపై ప్రజలకు అవగాహన ఎంతైనా అవసరమని యశోద వైద్యశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ కోలా, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ మాధవరెడ్డి లు వెల్లడించారు. స్థానికంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అంతర్జాతీయ స్థాయి అత్యవసర ప్రాణరక్షణ చికిత్సలు ఎంతో అవసరమని తెలిపారు. అత్యధిక సాంకేతికత తో కూడిన అవయవ మార్పిడి వైద్య విధానాల్లో అద్భుత ప్రగతి వైద్య రంగంలో అభివృద్ధి చెందిందన్నారు. భారతీయ వైద్యరంగ ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి చేరాయని పేర్కొన్నారు. వైద్య ప్రమాణాల్లో అత్యున్నత గ్లోబల్ స్టాండర్డ్స్ కలిగిన ఎక్స్ట్రా కార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ నుండి సమస్త అత్యున్నత స్థాయి ప్లాటినం అవార్డును కైవసం చేస్తుందని తెలిపారు. ఆధునిక వైద్యరంగంలో అత్యంత సంక్లిష్టమైన లైఫ్ సపోర్ట్ తెరపిలలో ఈ సి ఎం ఓ ఒకటని ఈ గౌరవం తమ చికిత్స విధానాలు విజయవంతమైన ఫలితాలు మల్టీ డిస్నేనరి టీం వరకు నిరంతర శిక్షణ యొక్క బలాన్ని స్పష్టం చేస్తుందని వైద్యులు పేర్కొన్నారు. ఎండ్ స్టేజి కార్డియాక్ లేదా రెస్పిరేటరీ ఉన్న రోగుల ప్రాణాలను రక్షించడంలో ఈసీఎంఓ ఒక బలమైన వారధిగా పనిచేస్తుందని వైద్యులు పేర్కొన్నారు. అత్యవసర లైఫ్ సపోర్టింగ్ వైద్య సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉండటం వలన అత్యవసర సమయాలలో సరైన నిర్ణయాన్ని తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాసిం వలి, కే. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## యోగా దైనందిన జీవితంలో భాగం కావాలి..

### భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ..

గుంటూరు విద్య జూన్ 20 ప్రభాతవార్త: యోగాను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం చేసేందుకు భాష్యం విద్యాసంస్థలు భాష్యం యోగోత్సవ్ పేరిట ప్రతి ఏటా యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ అన్నారు. శనివారం భాష్యం గరుడ క్యాంపస్ లో రెండు రోజుల పాటు జరగనున్న భాష్యం యోగోత్సవ్ 2026 కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు యోగా కార్యక్రమాన్ని రామకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ స్ఫూర్తిని ప్రతి విద్యార్థిలో నిలిపేందుకు భాష్యం విద్యాసంస్థల అన్ని శాఖలలో ఈ రెండు రోజుల యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు దైనందిన జీవితంలో యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు, యోగా అవశ్యకతను వివరించారు. స్వయంగా రామకృష్ణ యోగాసనాలు వేసి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. భాష్యం విద్యాసంస్థలలో 202627 విద్యా సంవత్సరానికి భాష్యం అన్ని క్యాంపస్ లలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి కార్యక్రమాలను నిర్ణీత సమయాల్లో విద్యార్థుల కోసం నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యోగా గురువు బి.మల్లికార్జునరావు యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాష్యం అన్ని క్యాంపస్ ల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ కు జెడ్పీహెచ్ఎస్ కొండవీడు విద్యార్థిని ఎంపిక

యడ్లపాడు, జూన్ 20, ప్రభాతవార్త : 2024/25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ పల్నాడు జిల్లా నుండి 139 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 137 మంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో 14 మంది రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపిక కావడం విశేషం.ఈ ప్రతిష్టాత్మక ఎంపికలో ఎడ్లపాడు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ కొండవీడు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విలాసారపు పూజ శివనాగేశ్వరి తన వినూత్న ఆవిష్కరణ రూరల్ స్పీడ్ బ్రేకర్ ప్రాజెక్టుతో రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచింది.విద్యార్థిని రూపొందించిన ఈ స్మార్ట్ రూరల్ స్పీడ్ బ్రేకర్ రెండు ఐఆర్ సెన్సార్ల సహాయంతో దూరం నుండి వస్తున్న వాహనం వేగాన్ని అంచనా వేస్తుంది. వాహనం నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువ వేగంతో వస్తే ఆటోమేటిక్‌గా స్పీడ్ బ్రేకర్ పనిచేస్తుంది. అదే వాహనం పరిమిత వేగంతో వస్తే స్పీడ్ బ్రేకర్ క్రియాశీలం కాకుండా వాహనం సాఫీగా ప్రయాణించేందుకు అవకాశం కల్పిస్తుంది.ఈ ఆవిష్కరణ గ్రామీణ రహదారులు, పాఠశాలల పరిసరాలు, ఆసుపత్రుల వద్ద రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థినికి శిక్షణ అందించిన పిఎస్ స్కూల్ అసిస్టెంట్ ఆలోకం సాంబశివరావు తెలిపారు.రాష్ట్ర స్థాయి ఎంపిక సాధించిన విద్యార్థిని పూజ శివనాగేశ్వరిని, ఆమెకు మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయుడు ఆలోకం సాంబశివరావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ మాధవి మరియు సత్యనారాయణ మూర్తి ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన వీరిద్దరిని గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది జున్ను సార్, కృష్ణ, శశికళ, కరుణామణి, ఉమ, స్లీవమ్మ, అనూష, లావణ్య తదితరులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.



## బస్సును ఢీకున్న ఆటో..నలుగురు విద్యార్ధులకు గాయాలు

యడ్లపాడు, జూన్ 20, ప్రభాతవార్త : జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై యడ్లపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వైద్య విద్యార్థులు గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు... కొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు వైద్య విద్యలో భాగంగా వైద్యపరమైన సేవలు ప్రజలకు అందించటానికి శనివారం రెండు బస్సులో యడ్లపాడు వచ్చారు. విధులు ముగించుకున్న అనంతరం వారు తిరిగి వెళ్లే క్రమంలో గ్రామంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిలిపి ఉన్న బస్సుల్లోకి ఎక్కుతున్నారు. ఇంతలో గుంటూరు వైపు నుంచి వచ్చిన నాలుగు చక్రాల ఆటో బస్సు పక్కనే ఉన్న ఐస్క్రీం బండిని, బస్సు ఎక్కుతున్న విద్యార్థులు ఢీకొట్టింది. ప్రమాదంలో విద్యార్థులు హరీష్, ఎం బాలాజీ, సాల్మాన్, సిద్దార్థ గాయపడ్డారు. హరీష్ తలకు గాయం కాగా మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమేరకు పోలీసే స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



## యోగ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం

చెరుకుపల్లి, జూన్ 20, ప్రభాతవార్త: ప్రతిరోజు కొంత సమయాన్ని యోగ కు కేటాయించడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించేందుకు మరింత తోడ్పడుతుందని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జిఎం సిహెచ్ ఏ రామరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులు యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్ పైనం రంగారెడ్డి పాల్గొన్నారు. యోగ ద్వారా శరీరానికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, యోగ సమయములో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు వంటి పలు అంశాల గురించి శిక్షకులు విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో పలు వినోదాత్మక రీతిలో యోగాసనాలను నిర్వహించడం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నేహా నిర్వాన్, డైరెక్టర్ సుధా మాధవి, డీన్ సరిత, పాఠశాల సిబ్బంది ,విద్యార్థినీ విద్యార్థులు,పలువురు పాల్గొన్నారు.

## హైకోర్టులో పిల్ తేలకుండా స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం ఎలా వెళ్తుంది: కేసన శంకరరావు

తాడేపల్లి, జూన్ 20, ప్రభాతవార్త: బీసీల సమగ్ర కుల గణన తేల్చి,జనాభా దామాషాలో బీసీ రిజర్వేషన్లు కేటాయించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తామేసన ప్రజా ప్రయోజన వ్యాజ్యం హైకోర్టులో తేలకుండానే, స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమంటూ అడ్వకేట్ జనరల్ ఎలా చెబుతారంటూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఆ విధంగా పత్రికలలో వచ్చిన అంశాలపై కేసన ఒక ప్రకటనలో ఏ.జి ని ప్రశ్నించారు. బీసీల సమగ్ర జనగణన సుప్రీం ట్రిపుల్ టెస్ట్ ఆర్డర్ మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితి మించని రీతిలో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని తెలుపుతూ నివేదిక ప్రభుత్వానికి సమర్పించడం తోనే డెడికేటెడ్ కమిషన్ బాధ్యత ముగిసిపోయినట్లు కాదన్నారు. అన్ని బీసీ వర్గాల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జనాభా దామాషా మేరకు స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. రాష్ట్రంలోని 139 బీసీ కులాలు,అన్ని బీసీ సంఘాలు బీసీల జనాభా దామాషా మేరకు గానీ,ఎన్నికల వాగ్దానం మేరకు 34 శాతం రిజర్వేషన్ల కేటాయింపుకు గాని ప్రధాన అవరోధంగా సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి ఎత్తేపించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు గైకొనాలని కోరుతున్నాయన్నారు. ఆ ప్రధాన ఆటంకాన్ని అధిగమించకుండా రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానమైన 34 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు జరపలేదన్నారు.

## ముస్లిం యువతరం కన్వీనర్ ఇక్బాల్ అహ్మద్ కన్నుమూత

మంగళగిరి, జూన్ 20, ప్రభాతవార్త: మంగళగిరి అంజుమన్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకుని ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన అంజుమన్ రాజకీయ నేత, ముస్లిం యువతరం కన్వీనర్ హాజీ ఇక్బాల్ అహ్మద్ (75) మృతి చెందారు. ఆయనకు భార్య,



ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలరు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురి కావడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అనారోగ్యం నుంచి కోలుకున్న ఆయన గత పది రోజుల క్రితం హైదరాబాదులోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి ఇక్బాల్ అహ్మద్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బంధువులు ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికయాన్ని అదే రోజు రాత్రి మంగళగిరిలోని స్వగృహానికి తరలించారు. మంగళగిరిలోని ముస్లిం యువతకు ఆదర్శ నీయునిగా, మంగళగిరి ముస్లిం మైనార్టీల గొంతుకగా నిలిచిన ఇక్బాల్ అహ్మద్ ఆకస్మికంగా మృతి చెందడం పట్ల పలువురు ముస్లిం నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా ఇక్బాల్ అహ్మద్ కుమారులు అమెరికాలో ఉండడంతో ఆయన మట్టి కార్యక్రమం ఈ నెల 21 వ తేదీ గానీ, లేక 22వ తేదీన గానీ మంగళగిరిలోని ముస్లిం కబర్ స్థాన్ లో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

## ఆల్ ఇండియా అంతర యూనివర్శిటీల పవర్ లిఫ్టింగ్ పోటీలలో కెఎల్ విద్యార్థిని షేక్ షబీనా ప్రతిభ

తాడేపల్లి, జూన్ 20, ప్రభాతవార్త ,ఆల్ ఇండియా అంతర యూనివర్సిటీల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో కెఎల్ యూనివర్సిటీలో బిబిఎ చదువుతున్న విద్యార్థిని షేక్ షబీనా విశిష్ట ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. కెఎల్ యూనివర్సిటీలో బిబిఎ చదువుతున్న షబీనా ఈ ప్రతిష్టాత్మక పోటీలలో మెరుగైన ప్రదర్శనతో రన్నరప్‌గా నిలిచినట్లు వర్శిటీ క్రీడల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.హరి కిషోర్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ ప్రో




వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖర్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలలో షేక్ షబీనా తన పట్టుదల, కృషి, సాధనతో అందరి ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. 84 కేజీల విభాగంలో ఎంతో కఠినమైన పోటీని ఎదుర్కొంటూ ఆమె ప్రదర్శించిన సామర్థ్యం క్రీడా రంగంలో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించిందని స్పష్టం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ యూనివర్సిటీకి పేరు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు. తమ వర్శిటీలో క్రీడలకు విశిష్ట స్థానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడలలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థిని , విద్యార్థులకు వంద శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. షేక్ షబీనా సాధించిన ఈ విజయంపట్ల వర్శిటీ అధ్యాపకులు, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖర్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ ఎస్. ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.హరి కిషోర్ లు పాల్గొని షేక్ షబీనాను అభినందించి, ఆమె సాధన ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

## కనపర్తి వారి ఇలవేల్పు పెద్దమ్మ తల్లి తిరునాళ్లు

పెదనందిపాడు జూన్ 20 (ప్రభాతవార్త) ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే కనపర్తి వారి ఇలవేల్పు శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి తిరునాళ్లు పెద నందిపాడు మండలం నాగభైరవారిపాలెంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగవ రోజు శనివారం అమ్మవారికి బంగారు పుట్లలో ఆనకట్ట కట్టి రాత్రికి ఆలయం దగ్గర గజాల కొలువు అత్యంత వైభవంగా నిర్వహించి పొంగళ్ళు నివేదించారు. ఈ తిరునాళ్లలో భయనేడు వాళ్ల ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కనపర్తి ప్రముఖులు పూర్ణచంద్రరావు. లక్ష్మీ ప్రసాద్. సాంబశివరావు .నాగమల్లేశ్వరరావు రామారావుల నేతృత్వంలో కొలుపులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఐదు సంవత్సరాలకు వచ్చే ఈ అమ్మవారి తిరునాళ్ళు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. తిరునాళ్ళు మాదడానికి వచ్చే బంధుమిత్రులతో గ్రామం లో పండగ వాతావరణం నెలకొంది.



## స్వచ్ఛ సమాజం అందరి బాధ్యత..

ప్రత్తిపాడు, జూన్ 20, ప్రభాతవార్త : పల్లెలు పరిశుభ్రతను సాధించాలంటే స్వచ్ఛమైన సమాజానికి మనందరం కట్టుబడి బాధ్యతగా పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇంచార్జ్ తహసీల్దార్ ఎలీషా బాబు, రాజీవ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లేమల్లెపాడు గ్రామ పంచాయితీ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం శనివారం



ఘనంగా నిర్వహించారు. ప్రారంభంలో అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఇంచార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ..పర్యావరణాన్ని కాపాడుకోవడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని వారు నొక్కి చెప్పారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని హెచ్చరించారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపి ఆదాయం పొందే దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రాష్ట్రం మొత్తం స్వచ్ఛాంధ్రగా మారుతుందని స్పష్టం చేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి, కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పాతూరి కృష్ణారావు, మండల పరిషత్ ఏవో కె.సురేష్ బాబు, హౌసింగ్ ,ఆర్డబ్ల్యూఎస్, పిఆర్ ఏఈలు బాబూరావు, వెంకటేశ్వరరావు, కిషోర్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్ చిన్నమ్మాయి, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బొల్లా ను అడ్డుకున్న పోలీసులు

### - కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజం
### - వినుకొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? కూటమి నేతలకు 'బొల్లా' సవాల్

వినుకొండ రూరల్, జూన్ 20, ప్రభాతవార్త: రెడ్ బుక్కు సూచనల మేరకే తనను అక్రమంగా అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బొల్లా బ్రహ్మనాయుడు బెయిల్ పై విడుదల అనంతరం శనివారం నరసరావుపేట నుండి వినుకొండ వచ్చారు. పెద్ద ఎత్తున నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణ సమీపంలోని విఠం రాజు పల్లి వద్దకు ఎదురు వెళ్లారు. అయితే అక్కడ భారీగా పోలీసులు మోహరించి, బ్రహ్మనాయుడు పట్టణంలోకి



రావడానికి అనుమతించలేదు. దీంతో ఆయన అనుచరులు బ్రాహ్మణపల్లి మీదుగా కారంపూడి రోడ్ లోని బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలోకి చేరుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు కళ్యాణ మండపానికి చేరుకోవడంతో ఆ మండపం క్రిక్కిరిసిపోయింది. బ్రహ్మనాయుడు కార్యకర్తలకు అభివాదం చేస్తూ వేదిక పైకి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సభకు పగడాల వెంకటరామిరెడ్డి అధ్యక్షత వహించి నేతలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తనపై కక్షగట్టి ఎక్కడికి అక్కడ పోలీసులను దింపి, తనను వినుకొండ వస్తుంటే అడ్డుకున్నారన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎంత ఓర్పుతో ఉంటున్నప్పటికీ, తాను హైదరాబాదులో భూకబ్జా చేశానంటూ అక్రమ కేసు బనాయించారన్నారు. అక్కడ తనపై ఎటువంటి రెవెన్యూ కేసు లేదని, ఎందుకు అరెస్టు చేశారని పోలీసులను అడిగితే వారు నోరు ఎత్తలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోయింది, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎక్కడన్నా భూ ఆక్రమాలకు పాల్పడితే ఈ రెండేళ్లలో తనపై ఎందుకు చర్య తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. తన అరెస్ట్ అంతా కుట్రపూరితంగా జరిగిందన్నారు. ప్రధానంగా ప్రస్తుత నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తనపై కక్ష కట్టి ఈ అరెస్టుకు వ్యూహం రచించారన్నారు. ఆనాడు నరసరావుపేట పార్లమెంటు సీటు వైసీపీ నుండి తనకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన, ఆయన తండ్రి రత్తయ్య జగన్ చుట్టూ తిరిగి టికెట్ దక్కించుకొని గెలిచి, అప్పుడు పనులన్నీ టిడిపి వారికే చేస్తూ వైసీపీ కార్యకర్తలను విస్మరించిన నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి శ్రీకృష్ణదేవరాయలను పక్కన పెట్టారన్నారు. అప్పుడు ఆయన టిడిపిలో చేరి ఎంపీగా గెలిచి ఢిల్లీలో పైరవీలు చేస్తున్నాడని బ్రహ్మనాయుడు ఘాటుగా విమర్శించారు. శ్రీకృష్ణదేవరాయలకు చెందిన విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు ఎవరికన్నా ఫీజులు తగ్గిస్తున్నారా అని బ్రహ్మనాయుడు ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగే స్కామ్స్ లో నీకు ఏం సంబంధం లేదా అని కూడా బొల్లా ప్రశ్నించారు. తాను చేసే వ్యాపారాలకు ప్రభుత్వానికి విధిగా జీఎస్టీ కడుతున్నానని, మరి ఎంపీ, వినుకొండ లో ఉన్న ఇరువురు ప్రజా నేతలు వారు చేసే వ్యాపారాలకు జీఎస్టీ కడుతున్నారా లేదా అని ప్రశ్నించారు. ఇక వినుకొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నానని, తన హయాంలో మంచినీటి సమస్య, వినుకొండ ఘాట్రోడ్, ఆలయ నిర్మాణాలు, ఎన్ఎస్పి కాలువ కిరువైపులా ఆహ్లాదకరమైన సిమెంట్ రోడ్డు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని, వీటన్నింటిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు, చీఫ్ విప్ ఆంజనేయులకు, మక్కెనకు బ్రహ్మనాయుడు సవాల్ విసిరారు. ఇక వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు తన వెన్నంటే ఉన్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, తాను మరింత పోరాట పటిమతో రానున్న ఎన్నికల బరిలో దిగుతానని కార్యకర్తల కేరింతల మధ్య పేర్కొన్నారు.

## నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో యోగా శిక్షణ కార్యక్రమం

తాడేపల్లి, జూన్ 20, ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవం2026 సందర్భంగా నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ఫైటోకెమిస్ట్రీ విభాగం జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం శనివారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ




కార్యక్రమానికి వర్తమాన్ సంస్థకు చెందిన ఆదినారాయణ పల్లపు వారి బృందం యోగా శిక్షకులుగా హాజరై విద్యార్థులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ విధానాలు, ధ్యానం, ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు ఆరోగ్యవంతమైన జీవనశైలి సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల, సెక్రటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులు నిత్యజీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి డా. కె. సౌజన్య సమన్వయకర్తగా వ్యవహరించగా, డా. ఎస్. పద్మావతి, ప్రొఫెసర్, విభాగాధిపతి, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ఫైటోకెమిస్ట్రీ విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సి హెచ్ నాగేశ్వరరావు, కె కరుణాకర్, కె మోహనలక్ష్మి విద్యార్థులకు డా నరేష్ బాబు రేఖా అభినందనలు తెలిపారు.

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం
### రైతుల ఖాతాల్లో రూ.8.91 కోట్ల జమ

మంగళగిరి, జూన్ 20, ప్రభాతవార్త : రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్ రావు పేర్కొన్నారు. ఎన్నికల




సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు..మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నియోజకవర్గ స్థాయిలో "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ రైతన్న మీకోసం 202627" తొలి విడత పంపిణీ కార్యక్రమం, అలాగే పీఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గుత్తికొండ ధనుంజయ్ రావు మాట్లాడుతూ రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ పనులను సకాలంలో చేపట్టేందుకు అవసరమైన పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మంగళగిరి పి. సంధ్యారాణి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబదయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆకుల జయసత్య, స్వచంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ తోట పార్థసారథి, మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, యార్డ్ సెక్రటరీ ప్రభారాణి, అగ్రికల్చర్ ఏవో శైలాజరాణి, మరియు యార్డ్ డైరెక్టర్లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడిఎస్బి, పిఎంకె కింద లబ్దిదారులకు నిధులు విడుదల..

ప్రత్తిపాడు, జూన్ 20, ప్రభాతవార్త : నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు, గుంటూరు రూరల్ మండలాలకు సంబంధించి అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద లబ్ధిదారులకు రూ.1997.44 లక్షల నిధులు శనివారం విడుదలైనట్లు ఆత్మ పిడి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కూటమి నేతలు, రైతులతో కలిసి అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ నిధుల విడుదలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సైంటిస్ట్ కె.దయానా, ఆత్మ పిడి జి. వెంకటేశ్వరరావు, ఆత్మ డిపిడి టి. శ్రీనివాసరావు, గుంటూరు ఏడిఏ ఎన్.మోహన్రావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ..అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమం ద్వారా ప్రత్తిపాడు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ క్రింద 30,428 మంది లబ్దిదారులకు రూ.1521.40లక్షలు, పీఎం కిసాన్ క్రింద 23,802 మంది లబ్దిదారులకు రూ.476.04 లక్షల నిధులు విడుదల చేశారని తెలియజేశారు. ఏపీఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియా, డిఏపి తదితర ఎరువులను అందిస్తామని తెలియజేశారు.

## హోంమంత్రిపై అమర్‌నాథ్ అనుచిత వ్యాఖ్యలపై ఖండన
### - రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆకుల జయసత్య

మంగళగిరి, జూన్ 20, ప్రభాతవార్త రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యమైనవి, మహిళలను అవమానించే విధంగా ఉన్నాయని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆకుల జయసత్య తీవ్రంగా ఖండించారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమైనప్పటికీ వ్యక్తిగత దూషణలు, మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలు చేయడం వైసీపీ నాయకుల సంస్కృతికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు హోంమంత్రి వంగలపూడి అనిత సమర్థవంతంగా



పనిచేస్తుంటే, ఆమెపై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి సంకేతమని పేర్కొన్నారు. ప్రజలు వైసీపీ నాయకుల తీరును గమనిస్తున్నారని, మహిళలను కించపరిచే వ్యాఖ్యలను సమాజం ఎప్పటికీ సమర్థించదని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు, రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆకుల జయసత్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి,రాష్ట్ర స్వచ్చంద్రా కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కేశంనేని శ్రీ అనిత, వింజమూరి ఆశాబాల, మంచికల పూడి వైష్ణవి, దండమూడి శైలజారాణి, వాస పద్మావతి తదితరులు పాల్గొన్నారు

# బొల్లా అవినీతి దాహానికి హద్దుల్లేవు
### 70 ఏళ్ళు వచ్చినా భూ దోపిడీ: ఎమ్మెల్యే జీవి ధ్వజం

వినుకొండ రూరల్ జూన్,20,ప్రభాతవార్త,: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వేల కోట్ల రూపాయల భూదోపిడీకి పాల్పడ్డారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్రస్థాయిలో ఆరోపించారు. శనివారం వినుకొండలో ని తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గండిపేటలో రూ.1500 కోట్ల విలువైన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు బొల్లా బ్రహ్మనాయుడు పెద్ద కుట్ర పన్నారని విమర్శించారు. తప్పు చేసి దొరికిపోయిన తర్వాత తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా తన బంధువు పేరుతో నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు సృష్టించి, ఉన్నతాధికారుల సంతకాలు, ప్రభుత్వ రికార్డులను నకిలీ చేయడానికి రూ.12 కోట్లు ఖర్చు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ అక్రమాలను తహసీల్దార్ బయటపెట్టడంతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు.గండిపేట భూ వ్యవహారంలో తప్పు చేయకపోతే బొల్లా బ్రహ్మనాయుడు కాంచీపురానికి ఎందుకు పారిపోయారని జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. బలమైన ఆధారాలు ఉండబట్టే న్యాయస్థానం ఆయనను జైలుకు పంపిందని పేర్కొన్నారు. ప్రస్తుతం వచ్చినది కేవలం బెయిల్ మాత్రమేనని, కేసు విచారణ పూర్తికాకముందే తాను నిర్దోషినని చెప్పుకోవడం సరికాదన్నారు. నిజంగా తప్పు చేయకపోతే న్యాయస్థానాలపై, దర్యాప్తు సంస్థలపై నమ్మకం ఉంచి చట్టపరంగా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, బహిరంగ చర్చల పేరుతో సవాళ్లు విసరడం, రాజకీయ నాటకాలు ఆడటం మానుకోవాలని సూచించారు. తప్పు చేసి జైలుకు వెళ్లి, బయటకు వచ్చాక సిగ్గులేకుండా ఊరేగింపులు నిర్వహించడం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడికి తగదన్నారు.ఈ కేసులో బాధిత రైతులు స్వయంగా ఫిర్యాదులు చేయడంతోనే పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని జీవీ స్పష్టం




చేశారు. తప్పు చేసినప్పుడు చట్టం తన పని తాను చేసుకుంటుందని, దానికి వయసుతో సంబంధం లేదన్నారు. ఎకరానికి రూ.4 కోట్ల చొప్పున భూములు కొనుగోలు చేసి, వాటిని ఎకరానికి రూ.60 కోట్లకు విక్రయించి భారీ లాభాలు పొందాలని చూసిన దురాశ బొల్లా బ్రహ్మనాయుడిదేనని ఆరోపించారు. దురాశ దుఃఖానికి చేటని, 70 ఏళ్ల వయసులో కూడా ఇంత అవినీతి దాహం ఎందుకని ప్రశ్నించారు. ఎంతమందిని బెదిరించి, భూములు దోచుకున్నారో ప్రజలకు తెలుసని అన్నారు. విలువలు, విశ్వసనీయత గురించి బొల్లా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. "నీ దోపిడీకి హద్దులు లేవా?" అని ప్రశ్నించారు.తనపై, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు , జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుపై బొల్లా బ్రహ్మనాయుడు చేసిన విమర్శలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని జీవీ ఆంజనేయులు తెలిపారు. బొల్లా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, రాజకీయంగా బురదజల్లే ప్రయత్నమేనని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో వినుకొండను ఎలా దోచుకున్నారో ప్రజలు చూశారని, అందుకే గత ఎన్నికల్లో ఆయనను ఘోరంగా ఓడించారని గుర్తుచేశారు. ప్రజల తీర్పు వచ్చిన తర్వాత కూడా మారకుండా వినుకొండ ప్రశాంతతను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే ప్రజలే మరోసారి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బొల్లా బ్రహ్మనాయుడు నిరాధార ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.గండిపేట భూముల వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ తదితరుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామని జీవీ ఆంజనేయులు తెలిపారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఇలాంటి వారిని ఎలా సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. జగన్‌కు నిజంగా సిగ్గు ఉంటే బొల్లా బ్రహ్మనాయుడిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు తనను నమ్ముకున్న వారిని నట్టేట ముంచిన వ్యక్తి అని ధ్వజమెత్తారు. గ్రామాల్లో తెరబొమ్మల ద్వారా సినిమాలు ప్రదర్శించిన రోజుల నుంచి పాల వ్యాపారం వరకు బొల్లా బ్రహ్మనాయుడు ఎవరెవరిని, ఏ విధంగా మోసం చేశారో వినుకొండ నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసని అన్నారు. ప్రస్తుతం నీతులు, విలువల గురించి మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు ముందుగా ప్రజలకు క్షమాపణలు చెప్పి, తాను చేసిన తప్పులను ఒప్పుకోవాలని సూచించారు. భూకబ్జాలు, అక్రమాలు, మోసాలు చేయడం బొల్లా బ్రహ్మనాయుడికి వెన్నతో పెట్టిన విద్యలా మారిందని మక్కెన మల్లికార్జునరావు విమర్శించారు. విలేకరుల సమావేశంలో వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు యోగాసనాలు ఎంతో ఉపయోగకరం..

ప్రత్తిపాడు, జూన్ 20, ప్రభాతవార్త : మానసిక ప్రశాంతతకు శరీరక దృఢత్వానికి యోగాసనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని ఎనమదొల గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, సిబ్బంది యోగాను నిర్వహించారు.



ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ యోగాసనాలను జీవితంలో భాగ స్వామ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగాస నాలు ఎంతో ఉపయోగకరమని వివరించారు. యోగా శరీరాన్ని, మనస్సును, ఆత్మను ఏకంచేసే ఒక జీవన విధానమని చెప్పారు. నిరంతరం యోగాసనాలు సాధన చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, రోజంతా ఉత్సాహంగా ఉంటుందని, శరీరానికి, మనస్సుకు మధ్య సమతుల్యతను సాధించేందుకు, ఒత్తిడితో కూడిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగా ఒక అద్భుతమైన సాధనమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఆసనాలు వేయడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి, రక్తప్రసరణ మెరుగవుతాయన్నారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ.. రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో యోగా, ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాసనాలను భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇషా ఫౌండేషన్ నుంచి శరత్ చంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య, వివిధ శాఖల హెచ్ఓడిలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ మరియు ఎన్సిసి విభాగం అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## నేడు100వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ : గుంజ గంగారావు



పెదకూరపాడు,జూన్ 20, ప్రభాతవార్త : నియోజకవర్గ పరిధిలోని అమరావతి పట్టణంలో నిర్వహిస్తున్న వంద రోజులు ప్రజల వద్ద కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గుంజ గంగారావు తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులకు కార్యకర్తలకు అలాగే మరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగు తమ్ముళ్లకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 100వ రోజు కార్యక్రమాన్ని అమరావతి పట్టణ నడిబొడ్డున ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లో నూతన ఉత్సాహం కలుగ చేస్తుందని గంగారావు అన్నారు . ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు,ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అన్న హాజరవుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తలు నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గంగారావు కోరారు.

## చెంచు గిరిజనుల అభివృద్ధికి మరో ముందడుగు

అమరావతి, జూన్ 20,ప్రభాతవార్త : అమరావతి చెంచు కాలనీలో చెంచు గిరిజనుల సంక్షేమం మరియు సాధికారత లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సామాజిక కార్యకర్త, చెంచు గిరిజనులపై విశేష పరిశోధన చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అవార్డు గ్రహీత ఫా. వినోద్ అమర్లపూడి నాయకత్వం వహించారు.




చెంచు గిరిజనుల విద్య, ఆరోగ్యం, ఉపాధి మరియు సామాజిక అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది చెంచు కుటుంబాలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్లోట్టీన్ ఫాదర్స్ గ్లోరియా డేయి రీజినల్ రెక్టర్ ఫా. బాలాజీ బోయళ్ల మరియు ఎఫ్‌సీసీ సిస్టర్స్ ప్రొవిన్షియల్ సిస్టర్ బెట్సీ హాజరై గిరిజనులను ఉద్దేశించి ప్రసంగించారు.కార్యక్రమంలో భాగంగా చెంచు మహిళలకు చీరలు పంపిణీ చేయడంతో పాటు పాల్గొన్న కుటుంబాలకు ఆహార పొట్లాలను అందజేశారు. గిరిజనుల అభ్యున్నతికి సమాజంలోని ప్రతి వర్గం సహకరించాలని అతిథులు పిలుపునిచ్చారు. ఫా. వినోద్ అమర్లపూడి మాట్లాడుతూ, చెంచు సమాజ అభివృద్ధి కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజలు మరియు గిరిజన నాయకులు ఫా. వినోద్ అమర్లపూడి చేస్తున్న సేవలను అభినందిస్తూ, చెంచు సమాజ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

21-6Pg5_21-6Pg5.qxd 20/Jun/26 11:37 PM Page 1



# డిఎంకెతో పొత్తుకు ఐయుఎంఎల్ గుడ్ బై

## తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం

## సిఎం విజయ్ టివికెకు ఐయుఎంఎల్ మద్దతు

**చెన్నై,జూన్ 20:** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. డిఎంకెకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. అటు అన్నాడిఎంకె నుంచి సొంత ఎమ్మెల్యేలు పార్టీ వీడుతుంటే ఇటు డిఎంకె నుంచి మిత్రపక్షాలు దూరం అవుతున్నాయి. టివికెకు మద్దతు కారణంగా కాంగ్రెస్ డిఎంకె మధ్య బంధం తెగిపోయింది. ఇక 1962 నుంచి డిఎంకెతో కలిసి రాజకీయ ప్రయాణం చేస్తున్న ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) గుడ్ బై చెప్పింది. విజయ్‌తో కలిసి తమ రాజకీయ ప్రయాణం కొనసాగించాలని నిర్ణయించింది.


తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ కాలంగా అధికార ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకె) కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఆ కూటమికి గుడ్ బై చెప్పటం సంచలనంగా మారుతోంది. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఎన్నికలకే పరిమితం కాకుండా సామాజిక సమీకరణాల్లోనూ ప్రముఖ పాత్ర పోషిస్తూ వచ్చింది. గత కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న తీవ్ర భేదాభిప్రాయాలు, శ్రేణుల మధ్య అసంతృప్తి చివరకు కూటమి నుంచి శాశ్వత ఉపసంహరణకు దారితీశాయి. ఒక బలమైన మైనారిటీ భాగస్వామిని కోల్పోవడం అధికార డిఎంకె శ్రేణులకు గట్టి ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

ఎన్నికల్లో సీట్ల కేటాయింపు విషయంలో తలెత్తిన జటిలమైన సమస్యలుగా తెలుస్తోంది. విజయ్ కేబినెట్‌లో చేరటంతో గత కొంత కాలంగా జరిగిన ఎన్నికల్లో ముస్లిం లీగ్ ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదు. ఐయుఎంఎల్ బలంగా ఉన్న ఉత్తర మరియు దక్షిణాది జిల్లాల్లో డిఎంకె స్థానిక నేతల పెత్తనం పెరగడం ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఆగ్రహాన్ని కలిగించింది.

మరోవైపు, పార్టీ సీనియర్ల అభిప్రాయం ప్రకారం, ఐయుఎంఎల్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా డిఎంకె ప్రవర్తించడం కూడా ఈ నిర్ణయానికి దారితీసింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలీగ్ మూడు స్థానాల్లో పోటీ చేసి రెండు సీట్లు గెలుచుకుంది.

విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతుగా నిలిచిన సమయంలో డిఎంకెతో కొనసాగటం పైన సందేహాలు మొదలయ్యాయి.

ముస్లిం లీగ్ ఎమ్మెల్యే ఏ.ఎం. షాజహాన్ టివికె ప్రభుత్వంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టారు. డిఎంకెతో దశాబ్దాలుగా ఉన్న స్నేహాన్ని వదులుకోవడం కష్టమైనప్పటికీ, రాష్ట్రంలో వచ్చిన రాజకీయ మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐయుఎంఎల్ జాతీయ అధ్యక్షుడు కె.ఎం. ఖాదర్ మొహిదీన్ స్పష్టం చేశారు.





# దక్షిణ లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు

## మరో ఐదుగురి మృతి, పలు ఇళ్లు, కార్యాలయాలు ధ్వంసం

**బీరూట్,జూన్ 20:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించి ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా సిద్ధమవుతుంటే ఈ ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గండికొడుతోంది. లెబనాన్‌పై వరుసగా దాడులు చేస్తోంది. శనివారం కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌పై ఈ రోజు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు మరణించారు. హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్ దాడికి దిగడం విశేషం. ఈ దాడిపై లెబనాన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ లెబనాన్‌లోని నబాతే జిల్లాలోని అనేక ప్రదేశాలపై ఇజ్రాయెల్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక ఇండ్లు, బిల్డింగులు ధ్వంసమయ్యాయి. ఐదుగురు మరణించారు. ఫిరంగి దాడులుకూడా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. అంతకు ముందు శుక్రవారం జరిపిన దాడుల్లో కూడా 16 మంది మరణించారు. అనేకమంది గాయపడగా, పలువురు కూలిన బిల్డింగులు, ఇండ్ల శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఇజ్రాయెల్ దాడులపై అమెరికా ఆగ్రహంగా ఉంది.

ఒకపక్క ఇరాన్‌తో అమెరికా శాంతి ఒప్పందం కుదుర్చుకుని, యుద్ధాన్ని ముగించాలని భావిస్తుంటే.. ఇజ్రాయెల్‌మాత్రం ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై దాడులు చేస్తోంది. అక్కడ ఇరాన్ మద్దతుతో నడుస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద శిబిరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడి చేస్తోంది. ఈ దాడుల్ని ఇరాన్ ఖండిస్తోంది. ఇజ్రాయెల్ వైఖరి కారణంగా, స్విట్జర్లాండ్‌లో ఇరాన్, అమెరికా మధ్య జరగాల్సిన తుదిదశ చర్చలు కూడా వాయిదాపడ్డాయి. దీంతో ఇజ్రాయెల్ వైఖరిపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ మాట్లాడారు. శాంతి ఒప్పందం సమయంలో కాస్తబాధ్యతతో వ్యవహరించాలని నెతన్యాహుకు ట్రంప్ సూచించారు. దాడుల్ని వెంటనే ఆపాలనికోరారు. ట్రంప్ మాటల్ని లెక్కచేయకుండా ఇజ్రాయెల్ మాత్రం దాడులు చేస్తూనే ఉంది.

# నీట్ విద్యార్థి ఆత్మహత్య



**ఘజియాబాద్,జూన్ 20:** ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్ విజయ్‌నగర్ పరిధిలో గుండెల్ని పిండేసే మరో విషాదకర ఘటన వెలుగు చూసింది. నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న జతిన్ కుమార్ అనే 22 ఏళ్ల విద్యార్థి మానసిక ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. జతిన్ తన తల్లిదండ్రులకు ఉన్న ఒకే ఒక్క కుమారుడు. కాగా, అతని తండ్రి రాజేష్ కుమార్ సహారన్‌పూర్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెడికల్ సీటు సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్న జతిన్‌కు 2026 మే నెలలో జరిగిన నీట్ పరీక్ష ఐదో ప్రయత్నం. ఆ పరీక్ష ముగిసినప్పటికీ, మళ్లీ జరగబోయే నీట్ పరీక్ష కోసం అతను విజయ్‌నగర్ సెక్టార్9లోని తన గదిలో ఉంటూ తిరిగి ప్రిపరేషన్ సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయం వరకు తన గదిలో చదువుకుంటూనే ఉన్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు అతడిని నిద్ర లేపడానికి గదిలోకి వెళ్లేసరికి జతిన్ నిర్జీవంగా ఫ్లోర్‌పై పడి ఉండటం చూసి తల్లడిల్లిపోయారు. ఉరివేసుకున్న సమయంలో ఫ్యాన్‌కుకట్టిన తాడు తెగిపోవడంతో మృతదేహం కింద పడినట్లు గుర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సిటీ కొత్వాలీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఉపాసన పాండే, విజయ్‌నగర్ పోలీసులు, ఫోరెన్సిక్ బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

# ఆలయంపైకప్పు కూలి ఆరుగురు మృతి

## శిథిలాలకింద 20 మంది భక్తులు



**పర్భని, జూన్ 20:** మహారాష్ట్రలోని పర్భనీ జిల్లాలో ఉన్న యశ్వాడి ఆలయంలో ఇవాళ ఓ అపశృతి చోటు చేసుకుంది. ఆలయ నిర్మాణ పనులు జరుగుతుండగా గర్భాలయం ముందున్న పైకప్పు ఉన్నట్లుండి ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న భక్తులపై ఈ కప్పు శిథిలాలు పడిపోయాయి. దీంతో సుమారు 40 మంది భక్తులు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వెంటనే అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆలయం పైకప్పు కూలిన ఘటనలో భారీగా భక్తులు చిక్కుకుపోయినట్లు తెలియడంతో హుటాహుటిన అధికారులు అక్కడికి చేరుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పర్భనీ జిల్లా సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఆలయం ఛత్రపతి శంభాజీనగర్ నుండి సుమారు 190 కిలోమీటర్ల దూరంలో ఉన్న యశ్వాడి గ్రామంలో ఉంది. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఆలయ సభా మండపం (బయటి హాలు) పైకప్పు కూలిపోయిందని పోలీసులు తెలిపారు. పోలీసులతో పాటు జిల్లా యంత్రాంగం తమ బృందాలను ఘటనా స్థలానికి పంపాయయన్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అయితే ఈ ఘటనలో ఇప్పటివరకూ ఆరుగురు చనిపోయినట్లు తెలుస్తోంది. మిగతా వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి.

అయితే, ఘటనా స్థలం నుంచి వెలువడిన ఫోటోలు, వీడియోల ఆధారంగా మండపం నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని జిల్లా అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని బ్లాక్ చేసి సహాయక చర్యలను ముమ్మరం చేశారు.. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. హనుమాన్ ఆలయం ఉండటం, శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు కార్యక్రమం జరుగుతుండగా, మండపం పైకప్పు అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఉండడంతో ఆరుగురు మృతిచెందారు మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనిఅధికారులు చెబుతున్నారు.

# పాక్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదు

## యుఎస్ ఉపాధ్యక్షుడు వాన్స్

**వాషింగ్టన్, జూన్ 20:** పాకిస్థాన్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అన్నారు. అందువల్లే ఇరాన్‌తోకుదుర్చుకున్న ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను విడుదల చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. అమెరికా–ఇరాన్ డీల్‌కు ఖతార్‌తో కలిసి పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జూన్ 15న మధ్యంతర శాంతి ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించగా. రెండు రోజుల తర్వాత ఈ ఒప్పందం అధికారిక పత్రం విడుదలైంది. పాకిస్థాన్, ఖతార్‌లో పత్రికా స్వేచ్ఛ సరిగ్గా లేకపోవడం, పారదర్శకతపై ఉన్న ఆందోళనల కారణంగానే వివరాలను విడుదల చేయడానికి వాషింగ్టన్ సమయం తీసుకుందని వాన్స్ పేర్కొన్నారు. దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛకు భంగం కలిగించే చట్టాలను ప్రభుత్వం అమలు చేయడాన్ని అమెరికా



రాజ్యాంగం నిషేధిస్తుందని జెడి వాన్స్ పేర్కొన్నారు. పాక్‌లో అటువంటి రాజ్యాంగపరమైన రక్షణలు లేకపోవడంతోనే ఈ ఆలస్యం జరిగిందన్నారు. ఇరాన్‌తో చేసుకున్న ఒప్పందంలో ఆ దేశానికి గణనీయమైన రాయితీలు ఇచ్చే అవకాశం ఉన్నందున.. అమెరికా అవగాహన ఒప్పందం వివరాలను గోప్యంగా ఉంచుతోందని వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.

# శ్రీరాముని విగ్రహం నిలిపివేతపై వెల్లువెత్తిన నిరసన

**ఢాకా,జూన్ 20:** ఒక ఫొటో చుట్టూ మొదలైన వివాదం ఇప్పుడు దేశవ్యాప్త ఉద్యమంగా మారుతోంది. బంగ్లాదేశ్‌లో రాముడి విగ్రహ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఇస్లామిక్ వర్గాలు చేసిన చర్యలు హిందూ సమాజంలో తీవ్ర ఆగ్రహం రేపాయి. రాముడి చిత్రాన్ని అవమానించారనే ఆరోపణలతో వేలాది మంది హిందువులు శుక్రవారం ఢాకావీధుల్లోకి వచ్చారు. జై శ్రీరామ్ నినాదాలతో భారీ ర్యాలీలునిర్వహించారు. ఢాకాలోని షాబాగ్ ప్రాంతం నిరసనకారులతో కిక్కిరిసిపోయింది. రాముడి చిత్రాన్ని అవమానించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల ప్రారంభంలో గైబంధా జిల్లాలో జరిగిన ఓ నిరసన కార్యక్రమంలో కొందరు మత ఛాందసవాదులు రాముడి చిత్రంపై చెప్పు ఉంచారని హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైనా ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని అంటున్నాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 72 గంటలగడువు విధించాయి. అప్పటిలోగా చర్యలు తీసుకోకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించాయి. ఉత్తర బంగ్లాదేశ్‌లోని పలాష్‌బారిలో 81 అడుగుల ఎత్తుతో రాముడి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఇది పూర్తైతే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రాముడి విగ్రహంగా నిలిచేది. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఆలయ సముదాయంలో 50 అడుగుల కృష్ణుడి విగ్రహం, 30 అడుగుల శివుడి విగ్రహం కూడా నిర్మించాలనే ప్రణాళిక ఉంది. విగ్రహ నిర్మాణానికి వ్యతిరేకంగా కొన్ని ఇస్లామిక్ సంస్థలు బెదిరింపులకు దిగినట్లు ఆలయ కమిటీ చెబుతోంది. ఓ మత బోధకుడు బుల్డోజర్‌తో విగ్రహాన్ని కూల్చేస్తానని హెచ్చరించాడని ఆరోపించింది. దీంతో శాంతి భద్రతల దృష్ట్యా పనులు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. వివాదాలు వద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

విగ్రహ నిర్మాణానికి అడ్డంకులు తొలగించకపోతే, బంగ్లాదేశ్‌లోని 64 జిల్లాల్లో ఒక్కో రామాలయం నిర్మిస్తామని హిందూ మహాజోట్ ప్రకటించింది. శనివారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు పూజా ఉత్సవాల జాతీయ కమిటీ తెలిపింది. దీంతో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. బంగ్లాదేశ్ జనాభాలో హిందువులు సుమారు 8 శాతం మంది ఉన్నారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 133 సామాజిక, మత ఘర్షణల ఘటనలు నమోదైనట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

# ఐఇడి బాంబులు పేలి ఏడుగురు మృతి

## ముగ్గురికి గాయాలు

**పెషావర్, జూన్ 17:** పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫుక్తున్క్వా ప్రావిన్సులో పేలుళ్ల ఘటన జరిగింది. బన్నూ జిల్లాలోని మర్యా బేరే ఏరియాలో రోడ్డుపై నాటిన ఐఇడి బాంబులు పేలాయి. ఈ ఘటన ఏడు మంది మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అయితే ఇప్పటి వరకు ఏ గ్రూపు కూడా పేలుళ్లకు బాధ్యత ప్రకటించలేదు. బన్నూ జిల్లా పోలీసు అధికారి మాట్లాడుతూ.. రోడ్డుపై నాటిన ఐఇడి పేలడం వల్ల ఒవ్యాన్‌లో వెళ్తున్న వారిలో అయిదుమంది మృతిచెందారు. రెస్క్యూ మిషన్‌లో భాగమైన మరో వాహనం కూడా ఐఇడి పేలుడుకు లోనైట్లు పోలీసు అధికారి చెప్పారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మృతుల దేహలను, గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. హాథీ కేల్ గ్రామం నుంచి బన్నూ సిటీకి వెళ్తున్న ప్రయాణికుల వ్యాన్‌ను టార్గెట్ చేస్తూ ఐఇడి పేలుడు జరిగింది.ఆ ప్రాంతాన్ని సెక్యూర్టీ దళాలు, పోలీసులు చుట్టుముట్టారు. బ్లాస్ట్ సైట్ నుంచి ఆధారాలను సేకరించారు. సిఎం సోహేల్ అఫ్రిది ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

# ఫిక్స్‌డ్‌డోస్ కాంబినేషన్ మందులపై నిషేధం



**న్యూఢిల్లీ,జూన్ 20:** దేశంలో రోగుల భద్రతను బలోపేతం చేయడం, ఔషధాల హేతుబద్ధ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందుల తయారీ, అమ్మకం, పంపిణీపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ వెల్లడించింది. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940లోని సెక్షన్ 26ఏ కింద ఈ నిషేధాన్ని విధించారు. భారత మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందులపై సమగ్ర సమీక్ష జరపాలని సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను కలిపి ఒకే ఔషధంగా తయారు చేయడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ అంటారు. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (టిడిఎబి) ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ ఎఫ్‌డిసి మందులపై ఈ కమిటీ లోతైన శాస్త్రీయ విశ్లేషణ జరిపింది. వాటి భద్రత, సమర్థత, చికిత్సా విలువలను అంచనా వేసింది. ఈ సమీక్షలో 16 రకాల ఎఫ్‌డిసి మందులకు సరైన చికిత్సాపరమైన హేతుబద్ధత లేదని, వాటిని వాడటం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని కమిటీ తేల్చింది. ఈ మందుల వల్ల కలిగే ప్రయోజనాల కంటే వాటితో ముడిపడి ఉన్న నష్టాలే ఎక్కువగా ఉన్నాయని తన నివేదికలో పేర్కొంది. నిపుణుల కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ 16 మందులను నిషేధించాలని నిర్ణయించింది. నిషేధిత మందుల జాబితాలో కొన్ని చర్మ సంబంధిత (డెర్మటలాజికల్) ఉత్పత్తులు, నొప్పి నివారణ మందులు, కడుపునొప్పిని తగ్గించే యాంటిస్పాస్మోడిక్ డ్రగ్స్‌తో పాటు కొన్ని యాంటీబయాటిక్ ఆధారిత ఫార్ములేషన్లు కూడా ఉన్నాయి.

# జనరల్‌బోగీలో ప్రయాణీకుడిని చితకబాదిన తోటిప్రయాణీకులు

**న్యూఢిల్లీ,జూన్ 20:** రాజధానిలోని షాదరా రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కే క్రమంలో జరిగిన ఘర్షణ ఒక ప్రయాణికుడి ప్రాణాలను బలితీసుకుంది. ప్లాట్‌ఫారమ్ నంబర్3పై యోగా ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలోకి ఎక్కేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని కొందరు తోటి ప్రయాణికులు అత్యంత దారుణంగా కొట్టి చంపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్‌కు చెందిన పంకజ్ ధామా అనే వ్యక్తి హరిద్వార్ వెళ్లేందుకు ఉదయం 6గంటల ప్రాంతంలో షాదరా స్టేషన్‌కు చేరుకున్నాడు. యోగా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారమ్ పైకి రాగానే జనరల్ బోగీలోకి ఎక్కేందుకు ప్రయాణికుల మధ్య ఒక్కసారిగా తోపులాట మొదలైంది. ఈ క్రమంలో పంకజ్‌కు కొందరు ప్రయాణికులతో స్వల్ప వివాదంతలెత్తింది. ఆగ్రహంతో ఊగిపోయిన తోటి ప్రయాణికులు పంకజ్‌పై దాడి చేసి, కిందపడేసి కాళ్లతో, చేతులతో విచక్షణారహితంగా బాదారు. ఘటనా స్థలంలో ఉన్న ఒక ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ జోక్యం చేసుకుని పంకజ్‌ను గుంపు నుంచి విడిపించారు. ఆ తర్వాత అతడిని ప్లాట్‌ఫారమ్ ఫ్లోర్‌పై లాగి అలాగే వదిలేశారు. సకాలంలో వైద్యం అందక పంకజ్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

# 'కాస్త నోరు మూసుకుంటారా?'

## ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస ప్రతినిధి మధ్య వాగ్వాదం



**న్యూయార్క్, జూన్ 20:** ఐక్యరాజ్యసమితిలో రసాభాస చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి మధ్య వాగ్వాదం నడిచింది. ఘర్షణల సమయంలో లైంగిక హింస నిర్మూలన అంశంపై న్యూయార్క్‌లో జరిగిన సమావేశంలో మాటల యుద్ధం చోటుచేసుకోవడంతో ఇతర సభ్యులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

సంక్షోభ ప్రదేశాల్లో లైంగిక హింసపై ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన వార్షిక నివేదిక వివాదాస్పదంగా మారింది. దీనిలో రష్యా, ఇజ్రాయెల్ దళాల పేర్లను కూడా చేర్చడంతో ఆ దేశాలు మండిపడ్డాయి. దాదాపు 15 యేళ్ల క్రితం మొదలైన ఈ నివేదికలో తొలిసారి ఇజ్రాయెల్ పేరును చేర్చారు. పాలస్తీనాలో ఆ దేశ దళాలు చేస్తున్న హింసకు ఫలితంగానే ఐరాస ప్రతినిధి ప్రమీలా పాటెన్ దీనిని ప్రవేశపెట్టారు. అయితే పాటెన్ పక్షపాతంతో వ్యవహరించారని, ఆమె రాజీనామా చేయాలని ఈ సమావేశంలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ డిమాండ్ చేశారు. అలాగే ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మరో యుఎన్ ప్రతినిధి వానెస్సా ఫ్రేజియర్ స్పందించారు. సభా మర్యాద కాపాడాలని, వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలంటూ ఆమె కాస్త అరిచి చెప్పారు. అలాగే తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ఇజ్రాయెల్ ఐరాసలో సభ్య దేశం. మీరు యుఎన్‌లో పని చేస్తున్నారు. కాస్త నోరు మూసుకోండి. ఆ రిపోర్టు సిగ్గుచేటు. మీరు ఈ పదవిని ఎందుకు తీసుకున్నారో నాకు తెలుసు. మాకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారంలో మిమ్మల్ని భాగం కానివ్వబోం' అంటూ ఫ్రేజియర్‌ను ఉద్దేశించి ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. కాగా.. పాలస్తీనాలో చిన్నారుల హక్కుల ఉల్లంఘనల ఘటనలు పెరగడంపై గుటెరస్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చేటుచేసుకుంది.

# సంక్షిప్త వార్తలు

## లింకన్‌మెమోరియల్‌వద్ద అంతర్జాతీయ యోగా డే

**వాషింగ్టన్,జూన్ 20:** అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని చారిత్రక లింకన్ మెమోరియల్ వద్ద 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. భారత రాయబార కార్యాలయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది యోగాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో నేషనల్ మాల్ ప్రాంతం బహిరంగ యోగా శిబిరంతో కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో భారత సంతతి ప్రజలతో పాటు స్థానికులు, యోగా శిక్షకులు, యోగా పట్ల ఆసక్తి గల ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వాషింగ్టన్ మాన్యుమెంట్, రిఫ్లెక్టింగ్ పూల్ నేపథ్యంగా యోగామ్యాట్‌లు పరుచుకుని శ్వాసవ్యాయామాలు, ఆసనాలు, ధ్యానం నిర్వహించారు.



## పార్టీ వీడిన నేతలపై రౌత్ ఆగ్రహం

**ముంబయి,జూన్ 20:** మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం చెలరేగింది. శివసేన (యుబిటి) ఎంపీ సంజయ్ రౌత్ పార్టీని వీడిన నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ధారాశివ్ ఎంపీ ఓంరాజే నింబాల్కర్, హింగోలి ఎంపీ నగేశ్ పాటిల్ అస్థికర్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. పార్టీ ఇచ్చిన అవకాశాలతోనే రాజకీయంగా ఎదిగిన నేతలు ఇప్పుడు పార్టీని వీడడం ద్రోహమని రౌత్ అన్నారు. ఒకప్పుడు ఉద్ధవ్ ఠాక్రేను ఎప్పటికీ వదిలిపెట్టనని చెప్పిన నేతలే ఇప్పుడు మారిపోయారని ఎద్దేవా చేశారు. పేడలో పుట్టిన పురుగులు మళ్లీ పేడలోకే వెళ్లాయి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కూడా రౌత్ విమర్శలు సంధించారు.



## ఉద్రిక్తతలమధ్య శివసేన 60వ వ్యవస్థాపక వేడుకలు

**ముంబయి, జూన్ 20:** శివసేన పార్టీ 60వ వ్యవస్థాపక వేడుకలు ముంబైలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతల నడుమ జరిగాయి. పార్టీ వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ ఠాకరే ఆశయాలకు తామే అసలైన వారసులమంటూ ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం, మాజీ సిఎం ఉద్ధవ్ ఠాకరే (యుబిటి) వర్గం విడివిడిగా భారీ బహిరంగసభలను నిర్వహించాయి. గోరెగావ్‌లో జరిగినసభలో ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కొన్నిరోజులుగా కొందరునేతలు తమపై గుంపులుగా మొరుగుతున్నారని, అయితే పులిఎప్పుడూ ఒంటరిగానేనడుస్తుందని, అదే అసలైన శివసేన అని వ్యాఖ్యానించారు.

## హిజాబ్ ధరించలేదని గాయనికి 74 కొరడా దెబ్బలు

**టెహ్రాన్, జూన్20:** ఇరాన్‌కు చెందిన గాయని పరాస్తూ అహ్మదీ చేసిన ఒక యూట్యూబ్ వీడియో ఫలితం 74 కొరడా దెబ్బల శిక్ష అంటూ వచ్చిన తాజా తీర్పు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. హిజాబ్ ధరించకుండా ఆన్‌లైన్ సంగీత కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆమెతో పాటు ప్రొడక్షన్ బృందంలోని సభ్యులకు కఠిన శిక్షలు విధించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 2024లో అహ్మదీ తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ సంగీత కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ కార్యక్రమంలో ఆమె హిజాబ్ లేకుండా, చేతులు పూర్తిగా కనిపించే నల్లటి దుస్తుల్లో పాటలు పాడింది. పురుష సంగీతకారులతో కలిసి చేసిన ఈ ప్రదర్శన సోషల్ మీడియాలో వైరల్ అయింది.



## కోల్‌కతా ఎయిర్‌పోర్టులో గన్‌తో వ్యక్తి హల్‌చల్

**కోల్‌కతా,జూన్ 20:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో ఒక వ్యక్తి గన్‌తో హల్‌చేశాడు. అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగినప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ నేపథ్యంలో తన భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చేతిలో పిస్టల్ ఉన్న అతడు బిజెపి వ్యక్తి అని, ఎంతకైనా తెగించడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. అభిషేక్ బెనర్జీ శనివారం దీని గురించి ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు.



## పద్మావతిఅమ్మవారి సేవలో తెలంగాణ సిఎస్ రామకృష్ణారావు

**తిరుపతి,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె,రామకృష్ణారావు కుటుంబంతో కలసి శనివారం సాయంత్రం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుచానూరుకు చేరుకున్న ఆయనకు, కుటుంబసభ్యులకు టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోనికి చేరుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన తిరుమలకు వెళ్ళారు.



## యోగాసనాలతో నగర సంకీర్తన మండలి

**తిరుపతి, జూన్ 20 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీ వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ తిరుపతినగరంలో నిర్వహించే నగర సంకీర్తన కార్యక్రమం అనంతరం, నగర సంకీర్తన మండలి సభ్యులు యోగాసనాల ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు. గోవిందరాజస్వామి ఆలయం ముందు నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, ఆరోగ్యం, క్రమశిక్షణల సమ్మేళనంగా నిలిచింది. యోగ గురువు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి యోగ ప్రాముఖ్యతను చాటి చెప్పారు. యోగ ప్రతి మనిషి జీవితంలో అంతర్భాగం కావాలని, యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షి ంచుకోవచ్చుని పేర్కొన్నారు. ప్రధా నమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో దేశవ్యా ప్తంగా యోగ దినోత్సవ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో, యోగపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

భక్తి మార్గంలో నడు స్తూనే ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవ ర్చుకోవాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నగర సంకీర్తన మండలి సభ్యులు వాసు దేవరెడ్డి, మునినాథరెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, రెడ్డిబాబు, నాగేశ్వరరెడ్డి, జైనేంద్ర, సిద్దవరం వెంకటాద్రి, కొండే జంగారెడ్డి, మురళి, మిట్టపల్లి బ్రహ్మానందం, కేశవులు, నాగరా జరెడ్డి, అరుణమ్మ, జయమ్మ, పద్మావతి, సుశీల, జ్యోతి, కళ్యాణి, సిద్ధమ్మ, ఉషశ్రీ, కల్పన



## ఆధ్యాత్మిక నగరంలో భక్తి సంకీర్తన

**తిరుపతి, జూన్ 20 ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం ప్రతి శనివారం తెల్లవారుజామున భక్తి పారవశ్యంలో మునిగిపోతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటోంది. వేంకటేశ్వర స్వామి కృప కటాక్షాలు నగరమంతా విరాజిల్లాలని ఆకాంక్షి స్తూ భజన మండలి సభ్యులు ప్రతివారం నిర్వ హిస్తున్న నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. శనివారం ఉదయం సంప్ర దాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు ఉదయం ఐదు గంటలకు చేరు కున్నారు. అక్కడ శ్రీహరి నామస్మరణల మధ్య మేళతాళాలు, మంగళ వాయిద్యాల నాదంతో నగర సంకీర్తన ఘనంగా ప్రారంభమైంది. చిన్నా రుల నుంచి వృద్ధుల వరకు భక్తులు భజనల్లో పాల్గొంటూ ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మం డలి సభ్యులు మునినాథరెడ్డి, భాస్కరాచారి, జ్యోతి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, వెంకటాద్రి, అరుణమ్మ, జయమ్మ, విజయకుమారి, అమరావతి, రేవతి, ఉమా జి,పద్మ, వై.పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, నాగరాజామ్మ, పద్మావతి,

## ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తే సహించం

**విజయవాడ,జూన్ 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్టీఐని దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టాన్ని వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా ప్రభుత్వ అధికారులను వేధించడానికి వినియోగిస్తే సహించబోమని తేల్చి చెప్పింది. మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సంబంధించిన కేసులో ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఫిర్యాదుదారుడు పదేపదే దరఖాస్తులు దాఖలు చేసి పలువురిని ఇబ్బందులకు గురి చేయడంపై ఆగ్రహించింది. ఈ మేరకు ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దాఖలు చేసినట్లు విచారణలో వెల్లడైందని కమిషన్ తెలిపింది. ఇప్పటికే అతను కోరిన సమాచారాన్ని కళాశాల అధికారులు అందించినప్పటికీ, అదే అంశాలపై మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంపై అనవసర భారం మోపినట్లు కమిషన్ గుర్తించింది. విచారణలో భాగంగా ఫిర్యాదుదారుడు 800కు పైగా పేజీల సమాచారాన్ని ఉచితంగా పొందిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. కేసుపై పూర్తి విచారణ అనంతరం ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కొట్టివేస్తూ విచారణను ముగించినట్లు కమిషన్ వెల్లడించింది. ప్రజా ప్రయోజనం, పారదర్శకత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీఐ చట్టాన్ని వినియోగించాలని మరోసారి సూచించింది.

## గోదావరిలో కానిస్టేబుల్ మృతదేహం లభ్యం

### వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్,20 ప్రభాతవార్త:** తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం రోడ్‌కం రైలు వంతెన పైనుంచి గోదావరిలోకి దూకి గల్లంతైన కాకినాడకు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ వంశీ మృతదేహం శనివారం లభ్యంఅయింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం తూర్పుగోదావరి జిల్లా శ్రీరాంపురానికి చెందిన చంద్రమళ్ల వంశీ కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ వంశీ ప్రస్తుతం సెలవులో ఉన్నారు. కుటుంబ సభ్యులు ఆయనకు పెళ్లి సంబంధం చూసి నిశ్చితార్థదానికి ఏర్పాట్లు చేశారు. అయితే ఓ మహిళా కానిస్టే బుల్ రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్ లో వంశీ పై ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు పలుమార్లు వంశీని పిలిపించి విచారించారు. తాజాగా గురువారం కూడా మరోసారి కౌన్సి లింగ్ నిర్వహిం చారు. అదే రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత వంశీ



వంశీ(ఫైల్)

బయటకు వెళ్లి తన తండ్రికి ఫోన్ చేసి తాను ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇటీవల నా కుమారుడు వంశీకి పెళ్లి సంబంధం కుదిరిందని అప్పటికే పరిచయం ఉన్న మహిళా కానిస్టేబుల్ పెళ్లి చేసుకోవాలని వంశీని వేధిస్తున్నా రని ఆమెని వివాహం చేసుకోవాలని లేకపోతే ఉద్యోగం పోతుందని పోలీసులు సైతం ఒత్తిడి చేశారని దీంతోనే తమ కుమారుడు గోదావరిలో దూకాడని వంశీ తండ్రి వీర వెంకటరావు తెలిపారు. నిన్నటి నుంచి నదిలో గాలింపు చేపట్టిన ఎన్డీఆర్ బృందాలు శనివారం మృతదేహాన్నీ గుర్తించాయి. పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రెండేళ్ల విజయోత్సవ సభ విజయవంతం

**రాయచోటి, జూన్ 20 ప్రభాతవార్త:** రెండేళ్ల విజయోత్సవ సభ రాయచోటిలో విజయవంతంగా నిర్వహించారు. సభలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దార్శనిక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమం వైపు వేగంగా పయనిస్తుందన్నారు. రెండేళ్లలోనే అభివృద్ధికి కొత్త దిశను చూపుతూ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకం కింద 51013 మంది రైతులకు సంవత్సరానికి 20000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ సుమారు 102 కోట్లు వార్షిక భరోసా కల్పించామన్నారు దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం 34,521 కుటుంబాలకు లబ్ధి చేకూరాగా 256359 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి 20 కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు తల్లికి వందనం పథకం ద్వారా 76,442 మంది విద్యార్థులకు 52,47 మంది తల్లులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద 37, 555 లబ్ధిదారులకు ప్రతినెల సామాజిక భద్రత పెన్షన్లు అందిస్తున్నామన్నారు మూడు ఆసుపత్రులను అభివృద్ధి చేసి మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి 160 వైద్య పరికరాలను సమకూర్చి 2630 ఆరోగ్య శిబిరాల ద్వారా 64 వేల మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందించామన్నారు విద్యారంగంలో 114 అదనపు తరగతి గదులు 161 పాఠశాలల్లో తాగునీటి సదుపాయాలు 254 డిజిటల్ క్లాస్ రూమ్ లు ఏర్పాటుచేసి



ర్యాలీలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

10409 మంది విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోజనం కల్పించామన్నారు ఈ విధంగా సూపర్ సెక్స్ హామీల అమృతపాటు యువత మహిళలు రైతులు పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష ్యం అన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దు తానని పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ విజయోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ అనిత యాదవ్ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా

### ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

**అనంతపురం, జూన్ 20 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తా. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా జర్నలిస్టులకు పింఛన్, పక్కా ఇళ్లు, ప్రమాద బీమా సౌకర్యం లాంటి న్యాయమైన కోర్కెలు.. వాటి పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సమాజంపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్వహకం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు గత ప్రభుత్వం చేసిన వడ్డీలకే సరిపోవడం లేదు అన్నారు. అయినా.. న్యాయమైన జర్నలిస్టుల డిమాండ్లు సీఎంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సోషల్ మీడియా వల్ల సమాజానికి ఎంత మంచి ఉందో.. అంతకంటే చెడు ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ నాది కూడా జర్నలిస్టుల కులమని, జర్నలిస్టుగా పని చేసిన నాకు వాళ్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు,




సోషల్ మీడియా ప్రభావంపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఆర్థికమంత్రి పయ్యావుల

సమస్యలు నాకు బాగా తెలుసు అన్నారు. వారి సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కృషి చేయాలని అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయూ జాతీయ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వల్ల కలిగే ప్రయోజనాలు, దుస్స్వభావాలు వివరించారు. భావాప్రకటన స్వేచ్ఛ దృష్ట్యా సోషల్ మీడియాను రద్దు చేయాలనడం సరైంది కాదని. అయితే నియంత్రణ ఉండాలని అన్నారు. ఐజేయూ జాతీయ సెక్రటరీ జనరల్ సోమసుందర్ మాట్లాడుతూ సోషల్ మీడియాను సమాజం హితం కోసం ఉపయోగించాలని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టులకు పింఛన్, ప్రమాదబీమా, పక్కా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఐజేయూ ప్లీనరీలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సీఎం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

అనంతరం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు గా సహకారాలు అందిస్తామని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐసీ డైరెక్టర్ లక్ష్మి ప్రసాద్ బాబు, అనంతలక్ష్మి విద్యాసంస్థల చైర్మన్ అనంత రాములు, రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ కేఎం షకీల్ షఫీ, ఐజేయూ కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్. భోగేశ్వర్ రెడ్డి, ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఆయుఫ్ సహ యూని యన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కారాకొల్లులో అన్నదాత సుఖీభవ మొదటి పంపిణి

**తొట్టంబేడు, జూన్ 20 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమం,వ్యవసాయ అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పేర్కొన్నారు. తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడత నగదును ఆమె చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ, "నియో జకవర్గంలోని అర్హులైన రైతులందరికీ మొదటి విడత కింద మొత్తం రూ. 18.55 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్నాం. పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందిస్తున్న ఈ నగదును రైతులు సద్వినియోగం చేసుకోవాలి" అని ఆకాంక్షించారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు మరిన్ని మేలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అని ఆమె వివరించారు. ఈ మేరకు




మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ ఖరీఫ్ సీజన్ పెట్టుబడి సాయంగా మొదటి విడత నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అన్నదాతను రాజును చేయడమే మా లక్ష్యం అని, ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నా ప్రభుత్వం తమదే అన్నారు పెట్టుబడి సాయంగా అందుతున్న ఈ నగదును రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, జయచంద్ర నాయుడు, అధికారులు ఏవో రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కారాకొల్లు గ్రామ పరిసర ప్రాంతాల రైతులు, స్థానిక కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## భీమవరం బుల్స్‌పై తుంగభద్ర విజయం

### ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జ్ఞానేశ్వర్

**కడప, స్పోర్ట్స్,జూన్ 20, ప్రభాతవార్త :** ఏపీఎల్-2026 సీజన్-5లో భాగంగా కడపలోని వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియం వేదికగా జరిగిన నాల్గవ రోజు తొలిమ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ జట్టు భీమవరం బుల్స్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బ్యాటింగ్, బౌలింగ్ లో సమిష్టిగా రాణించిన వారియర్స్ 6 వికెట్ల తేడాతో బుల్స్‌ను చిత్తు చేసింది. టాస్ అనంతరం తొలుత బ్యాటింగ్‌కు దిగిన భీమవరం బుల్స్‌కు ఓపెనర్లు తగిన శుభారంభం ఇవ్వలేదు. జట్టు తరఫున తోట విఘ్నే శ్వర సాయి శ్రావణ్ 32 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 50 పరుగులు సాధించి ఆకట్టుకున్నాడు. మునీష్ వర్మ 21 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 35 పరుగులు చేసి సహకరిం చాడు. అయితే గత మ్యాచ్‌లో సెంచరీతో మెరిసిన రేవంత్ రెడ్డి ఈసారి 15 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 17 పరుగులకే పరిమితమయ్యాడు. తుంగభద్ర వారియర్స్ బౌలర్లలో సాయి చరణ్ 3 వికెట్లతో సత్తా చాటగా.. సౌరబ్ కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. స్టీఫెన్, మల్లికార్జున, దీపక్ చెరో వికెట్ సాధించారు. దీంతో భీమవరం బుల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. 154 పరుగుల విజయలక్ష ్యం తో బరిలోకి దిగిన తుంగభద్ర వారియర్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. సి.ఆర్. జ్ఞానేశ్వర్ బ్యాట్‌తో విధ్వంసం సృష్టిస్తూ 56 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో అజేయంగా 75 పరుగులు సాధించాడు. కాకి సత్య సూర్య జయంత్ 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 46 పరుగులు చేసి విజయానికి బలమైన పునాది వేశాడు. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయినా వారియర్స్ ఆటగాళ్లు ఒత్తిడికి గురికాకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. 18 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకున్నారు. బుల్స్ బౌలర్లలో సీహెచ్ రవితేజ 3 వికెట్లు, యశ్వంత్ ఒక వికెట్ సాధించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును విజయతీరాలకు చేర్చిన సి.ఆర్. జ్ఞానేశ్వర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రెండవ మ్యాచ్ లో కాకినాడ కింగ్స్ మరియు క్యాపిటల్ అమరావతి రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. కాకినాడ కింగ్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన కాకినాడ కింగ్స్ జట్టు 14 ఓవర్లు ముగిసేసరికి 143/ 4 పరుగులు సాధించింది. జట్టులో ఎమ్. అభిషేక్ 37 బంతుల్లో 57పరు గులతో రాణించగా యువన్ 0 పరుగులతో లేక్ హాజ్ 6 బంతుల్లో 4 పరుగులతో క్రీజులో ఉన్నారు.






## ఆస్ట్రేలియాలో ఎగ్జిబిషన్‌కు కుప్పం మామిడి పళ్లు

### నేడు యోగాడే సందర్భంగా ప్రదర్శన

**కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప ్పంకు మరో ఘనత దక్కింది. హార్టీకల్చర్ హబ్‌గా సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కుప్పం రూపుదిద్దుకుంది. పూలు, పళ్లు, కూరగాయల సాగు, వంగడాలు, నారు తయారీలో కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ దేశంలోనే పేరు ప్రఖ్యాతులు గడించి గతేడాది స్కోచ్ అవార్డు సైతం అందుకున్న విషయం విదితమే. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో రైతులు సాగు చేసిన మామిడి పళ్లను అంతర్జాతీయ వేదికలో ప్రదర్శించనున్నారు. ఉద్యానవన శాఖ అధ్వర్యంలో కుప్పం ప్రాంతంలో రైతులు పండించిన మామిడి పళ్లను సేకరించి ఆస్ట్రేలియాలో ప్రదర్శనకు ఈనెల 18నపంపించారు. ఆదివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ నగరంలో ఇండియా మ్యాంగో ఎగ్జిబిషన్‌ను నిర ్వహించనున్నారు. దీంతో అపెడ వారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సాగయ్యే మామిడి కాయలను ఓసం ఫుడ్ సొల్యూషన్స్ యజమాని అగ్రి క్లినిక్ కోటేశ్వరరావు నేతృత్వంలో శాంతిపురం మండలంలో సేకరించిన రెండు టన్నుల మామిడి కాయలను ఆస్ట్రేలియాలోని ఇండియన్ ఎంబసీకి అపెడ జిఎం వినితసుధాంశు నేతృత్వంలో ఎగుమతి చేశారు. శాంతిపురం మండలం నాయనపల్లికి చెందిన రైతులు శ్రీనివాసరెడ్డి, సుధాకర్, మంజునాథరెడ్డి, సిద్ధావూరుకు చెందిన రైతు దొరస్వామి యొక్క మామిడి తోటల నుంచి మామిడి పళ్లను ఎంపిక చేసి సిడ్నీ నగరంకు పంపినట్లు ఉద్యానవన శాఖ ఎ.డి. పల్లవి తెలిపారు.



## మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

### ఏఐటియుసి డిమాండ్

**శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి తొండ మల్లికార్జున్, వైయస్ మణి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కోగిల హరి యన్ జాను ఏఐటీయూసీ జిల్లా నాయకులు కత్తి రవి, మునిచందు, సిపిఐ మండల కార్యదర్శి శివ కుమార్ ప్రజానాట్యమండలి చారులతో నాయకులు మురళి కొండమ్మ శారదమ్మ మధు మురళి పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు డెడికేటెడ్ కమిషన్ అధ్యయనం: రాజీవ్ రంజన్ మిశ్రా

**చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమీషన్ సమగ్ర అధ్యాయనం నిర్వహిస్తోందని డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ భవనంలో శనివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై అధ్యాయనం, అర్జీల స్వీకరణ కార్యక్రమంను డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమీ షన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు డెడికేటెడ్ కమీషన్ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర అధ్యాయనం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జడ్పీ సిఇఒ రవికుమార్‌నాయుడు, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ భాషా, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిసిల హక్కుల సాధనకు సహకరించండి

**విజయవాడ, జూన్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** బీసీల హక్కుల సాధన కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జులై 27, 28 తేదీల్లో చేపట్టే కార్యక్రమాలకు మద్దతివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ నూకానమ్మ కోరారు. తొలి రోజు జంతర్ మంతర్‌వద్ద జరిగే ధర్నా, ప్రదర్శన ఆ తర్వాత రోజు జరిగే సెమినార్‌లో కూటమి పార్టీల ఎంపీల, మంత్రులు మద్దతుగా పాల్గొనేలా చూడాలని విన్నవించారు. ఈ మేరకు సచివాలయంలో సీఓఎంను ఆమె కలిసి వినతిపత్రం అందతించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కీకల హామీలైన చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, బీసీ తదితర వాటి సాధన కోసం కృషి చేస్తున్నామని చంద్రబాబుకు ఆమె వివరించారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల అమలుకు జాతీయ బీసీ సంక్షేమం సంఘం సంపూర్ణ మద్ద తు ఉంటుందని తెలిపారు. మహిళా రిజర్వే షన్‌లో బీసీ మహిళలకు ఉపకోటా ఉండేలా కేం ద్రంతో మాట్లాడాలని విన్నవించారు. వీటికి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.



## పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి: ఎమ్మెల్యే

మాచర్ల, జూన్ 20 ప్రభాతవార్త: పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక నెహ్రూనగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి సైడ్ కాలువల్లో ఉన్న వ్యర్థాలను తొలగించారు.



ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, కజ్జం సైదయ్య, పార్టీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మదార్‌సాహెబ్, కళ్లం రామాంజిరెడ్డి, కంభంపాటి అనిల్‌కుమార్, బీజేపీ నాయకులు కాంతికుమార్, సురేష్, వజ్రంనాయక్, కొమెర శివ, శాంతి, మొసిన్, ఖలీల్, ముజఫర్, ఉప్పుతోళ్ల దుర్గారావు, పిచ్చయ్య, నలమాల వెంకటేశ్వర్లు, కందుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్యసేవతోనే పేదలకు మెరుగైన వైద్యం

మాచర్ల, జూన్ 20 ప్రభాతవార్త: పేదలకు మెరుగైన వైద్యం ఎన్టీఆర్ వైద్యసేవతోనే సాధ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక రవితేజ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ వైద్యసేవలను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న వారికి సత్వర వైద్యసేవలు అందించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ భరోసాగా నిలుస్తుందన్నారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుష్మా, సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ రాజబోయిన మధు, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, మదార్‌సాహెబ్, కజ్జం సైదయ్య, కళ్లం రామాంజిరెడ్డి, కంభంపాటి అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, బీజేపీ నాయకులు కాంతికుమార్, సురేష్, వజ్రంనాయక్, కొమెర శివ, శాంతి, మొసిన్, ఖలీల్, ముజఫర్, ఉప్పుతోళ్ల దుర్గారావు, పిచ్చయ్య, నలమాల వెంకటేశ్వర్లు, కందుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేసీపీ సిమెంట్స్ సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే

మాచర్ల, జూన్ 20 ప్రభాతవార్త: పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, పచ్చదనం పెంపొందించేందుకు కేసీపీ సిమెంట్స్ వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆయన కేసీపీ జీఎం వి.వెంకటరమణ ఆహ్వానం మేరకు ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమంలో భాగంగా కేసీపీ



సిమెంటు ఫ్యాక్టరీ ప్రహరీ గోడపై ప్రజలను అవగాహనపరిచేలా వేసిన వాల్ పెయింటింగ్స్‌ను పరిశీలించారు. సంస్థ మున్సిపాలిటీ పరిధిలో అందిస్తున్న సేవలు, సామాజిక కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, మదార్‌సాహెబ్, కంభంపాటి అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, బృంగా రమణ, కొమెర శివ, షేక్ మైనా తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ వస్తాను.. మార్పు కనిపించాలి: ఎమ్మెల్యే

మాచర్ల, జూన్ 20 ప్రభాతవార్త: స్థానిక పీడబ్ల్యూడీ కాలనీ 5వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ వస్తాను.. మార్పు కనిపించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అందించే





పౌష్టికాహారం సరకులను, స్టాక్ రికార్డును, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పిల్లలతో పలకపై అక్షరాలు దిద్దించి, అప్పజెప్పించుకున్నారు.

**అంగన్‌వాడీ కేంద్రమా? అంగడా?**


అంగన్‌వడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది అంగన్‌వాడీ కేంద్రమా..? అంగడా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం వెలుపల కనీసం బోర్డు లేకుండా ఈ కేంద్రాన్ని ఎలా నడుపుతున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. కేంద్రం లోపల చిన్నారులకు అందించే పోషకాహార మెను బోర్డు లేకపోవడాన్ని గమనించి, బోర్డు ఎందుకు పెట్టలేదని అడిగారు. అలానే హాజరు రిజిస్టరులో ఉన్న సంఖ్యకు, కేంద్రంలో ఉన్న చిన్నారుల సంఖ్యకు సరిపడకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో వంట వండకుండా ఇంటి నుంచి వండి తీసుకురావడాన్ని గమనించిన ఎమ్మెల్యే కేంద్రంలో వంట చేయకుండా ఇలా ఎందుకు చేస్తున్నారని ఆరాతీశారు. తనిఖీలో సిబ్బంది ఇచ్చిన సమాధానాలకు ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, కేంద్రంలో ఉండాల్సిన నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సూచించారు.

## గ్రామాల్లో సర్ ప్రక్రియపై అవగాహన



మాచర్ల, జూన్ 20 ప్రభాతవార్త: జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మాచర్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సర్ ప్రక్రియపై బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమాన్ని మాచర్ల తహశీల్దారు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాచర్ల మండల పరిధిలోని కంభంపాడు, తదితర గ్రామాల్లో సర్ మ్యాపింగ్ ప్రక్రియ పరిశీలించారు. బీఎల్‌ఓలకు తగు సూచనలు చేశారు. ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నగదు పంపిణీ



మాచర్ల, జూన్ 20 ప్రభాతవార్త: దుర్గి మండల కేంద్రంలో శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నగదు చెక్కులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 38,923 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. మొత్తం రూ.25 కోట్ల 79 లక్షల 3 వేల విలువ చేసే నగదు చెక్కును అందజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ జగదీష్‌రెడ్డి, వ్యవసాయాధికారి అమీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వపు గోడను ఆవిష్కరించిన నాగసరపు

నరసరావుపేట టౌన్, జూన్ 20 ప్రభాతవార్త : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఖిమా ఛారిటబుల్ ట్రస్ట్‌ఖి ఆధ్వర్యంలో శనివారం వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. ప్రజల వద్ద నిరుపయోగంగా ఉన్న బట్టలు, పుస్తకాలు, ఇతర వస్తువులను సేకరించి, వాటి అవసరమున్న



పేదలకు అందించాలనే సదుద్దేశంతో ట్రస్ట్ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై ఖిమానవత్వపు గోడఖి ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరాయ గుప్తా మాట్లాడుతూ సమాజంలో ఇతరులకు ఉపయోగపడే ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన ట్రస్ట్ సభ్యులను అభినందించారు. పట్టణ ప్రజలందరూ తమ వద్ద ఉన్న పాత వస్తువులను, బట్టలను ఇక్కడ అందజేయాలని కోరారు. అవసరంలో ఉన్న వారికి అవి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, బెల్లంకొండ అనిల్, సిగినంశెట్టి పావని, శివ, పలుకూరి సాల్మన్, అంబటి ప్రేమ్ కుమార్, ఎస్. వసంత్, నిజం మోహిద్దీన్, కోట ఆనంద్ పాల్గొన్నారు.

## పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ

రొంపిచర్ల,జూన్ 20 ప్రభాతవార్త :: నరసరావుపేట ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అవోపా ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో పట్టణంలోని సుమారు నలభై పాఠశాలల్లో ఆరు వేల నోట్ బుక్స్, పెన్నులు,ఎక్కాల పుస్తకాలు,వేమన శతకాలు,పలకలు పంపిణీ చేయడం జరుగుతుంది.ఈ పంపిణీలో భాగంగా శనివారం స్థానిక శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రాథమిక తరగతుల విద్యార్థులకు సుమారు మూడు వందలు నోట్ బుక్స్,నలభై పలకలు,ఎక్కాలు, వేమన శతక పద్యాల పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అవోపా విద్యాకమిటి ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో నాలుగేళ్లుగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కి శ్రీకారం చేసిన్నట్లు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని చక్కగా చదువు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అవోపా అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ సాయి శ్రీనివాస్, కోశాధికారి కె. వెంకటప్పయ్య, అవోపా ప్రతినిధులు పొట్టి హనుమంతరావు,అర్వపల్లి రమేష్, అచ్యుత్ రావు, కొప్పురావూరి శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ డైరెక్టర్స్ ఎస్.కె. జిలానీ మాలిక్, డివిఎస్ఎన్ పున్నారావు,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజా,టీచర్స్ జ్యోత్స్న, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ టీచర్ అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కెరిడ్జ్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

నరసరావుపేట టౌన్, జూన్ 20 ప్రభాతవార్త :: నరసరావుపేటలోని కెరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం మరియు ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ యోగా ఆసనాలు వేసి, ప్రాణాయామం మరియు ధ్యానం చేశారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు క్రమశిక్షణ పెరుగుతాయని విద్యార్థులకు వివరించారు. యోగం భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని, ప్రతి విద్యార్థి యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు సూచించారు. అనంతరం, ఫాదర్స్ డే వేడుకలను కూడా ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, ప్రసంగాలు ప్రదర్శించారు. తండ్రుల ప్రేమ, త్యాగం మరియు మార్గదర్శకతను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, ప్రైమరీ కోఆర్డినేటర్ షహనాజ్ బేగం, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజీ పాల్గొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ఆకస్మిక తనిఖీలు

నరసరావుపేట, జూన్ 20 ప్రభాతవార్త : : నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం పట్టణంలోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వెంకటరెడ్డి నగర్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాబాపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరుపై సమీక్షించారు. ఎస్ఆర్‌కేటీ కాలానిలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను




తనిఖీలు చేసి పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు చేరేలా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

## సాయికృష్ణ లాక్ అప్ డెత్ పోలీస్ పెద్దల సహకారంతోనే జరిగింది ! డాక్టర్ గోపిరెడ్డిశ్రీనివాస్ రెడ్డి

నరసరావుపేట, జూన్ 20 ప్రభాతవార్త : విజయవాడ కాపు యువకుడు గాదే సాయికృష్ణ లాకప్ డెత్ ఉదంతాన్ని డైవర్షన్ చేయడానికే కారుమూరి సునీల్ అరెస్ట్ చేశారని వైయస్సార్సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గాదే సాయికృష్ణ ను మార్కాపురం నుంచి టాస్కోర్స్ పోలీసులు కృష్ణలంక పోలీస్ స్టేషన్ కి తీసుకొచ్చి అక్కడ నుంచి లాడ్జికి తీసుకెళ్లి దారుణంగా కొట్టి ఆర్ఎంపి వైద్యునితో వైద్యం చేయించి చంపినట్లు ఆరోపించారు. అనంతరం బస్టాండ్ లో అనాథ శవంలా మున్సిపాలిటీ వారిచే దహన కార్యక్రమాలు చేశారన్నారు. లాకప్ లో పోలీసులు ఒక వ్యక్తిని చంపడం ఒక నేరమైతే, చనిపోయిన వ్యక్తి బాడీని కూడా తల్లిదండ్రులకు అప్పగించకపోవడం దారుణమన్నారు. సాయికృష్ణ చనిపోయి ఇప్పటికీ 45 రోజులు అవుతుందని, దీన్ని వైసీపీ వెలుగులోకి తీసుకొచ్చి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎప్పుడైతే వారి ఇంటికి వెళ్ళారో అప్పుడు రాత్రికి రాత్రి ఈ ఘటనపై ఎఫ్ఆర్ కట్టి సీఐ ని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా విజయవాడలో క్రాంతి కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేస్తే, ఆ కుర్రవాడు కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని చెప్పారు. కర్నూలు జిల్లాలో గంగమ్మ అనే గిరిజన మహిళ లాక్ అప్ డెత్, తెనాలిలో జ్యోతి అనే మహిళ పోలీసుల వేధింపుల వల్లే చని పోతున్నానని సూసైడ్ వీడియో కూడా విడుదల చేసి చనిపోవడం జరిగిందన్నారు. ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వంలో 750 హత్యలు మానభంగాలు జరిగాయని, రాష్ట్రంలో సగటున రోజుకు ఒక హత్య లేక ఆత్మహత్య జరుగుతుందని, సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వలేకపోయినా ఈ ప్రభుత్వం రోజుకొకరిని బలి తీసుకుంటుందని ఏద్దేవా చేశారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కేంద్రంతో సంబంధం లేకుండా రూ. 20 వేలు ఇస్తానన్న చంద్రబాబు హామీ ఏమైందన్నారు. ఈ ప్రభుత్వం చేతకాని పాలన చేస్తుందని, ఈ రాష్ట్రంలో అక్రమ అరెస్టులు తప్ప పరిపాలన ఏమి జరగటం లేదన్నారు. వైసీపీ ఇటీవల నిర్వహించిన చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల ర్యాలీలు రాష్ట్రమంతా సూపర్ సక్సెస్ అయ్యాయని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ ర్యాలీలలో వేలాదిగా పాల్గొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభలు జనం లేక వెలవెలబోయాయని ఈ ప్రభుత్వానికి డౌన్ ఫాల్ స్టార్ట్ అయిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ చిలకలూరిపేట పరిశీలకులు చిట్టా విజయభాస్కర్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జగన్ వంచనలతో మోసపోయిన రైతుకు.. కూటమి ప్రభుత్వంతో నిజమైన భరోసా

సత్తెనపల్లి, జూన్ 20, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న వివిధ హోదాల్లో వున్న కూటమి నాయకులు . డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగింది వ్యవసాయం లాభసాటి కావాలి అన్నదాతల బతుకులు మారాలి అన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 90 శాతం అమలు చేశాం పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తున్నాం. గత ప్రభుత్వం పంటల బీమా కూడా చెల్లించలేదు సత్తెనపల్లి నియోజకవర్గం లో 36,752 రైతన్నలకు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు 24.33కోట్ల విడుదల చేయటం జరిగిందన్నారు.



## ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

పిడుగురాళ్ల, జూన్ 20 ప్రభాతవార్త : పిడుగురాళ్ల పట్టణంలో శనివారం టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు కుమార్తె, సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను కూటమి మహిళా నేతలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నేతృత్వంలో కేక్‌ను కట్ చేశారు. భువనేశ్వరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 20 ప్రభాతవార్త : రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన పథకం రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 45,69,817 మంది రైతులకు 3,125.47 కోట్ల ప్రభుత్వం అందించనుందన్నారు. గురజాల నియోజకవర్గ పరిధిలో 35,676 మందికి రైతులకు రూ.23.127 కోట్లను అందించారు. అనంతరం వ్యవసాయ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మార్కెట్‌యార్డు చైర్మన్ తురకా వీరస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీకృష్ణదేవరాయలు, ఏవోలు సంధ్యారాణి, రావమ్మ, వెంకటేష్, పుల్లారెడ్డి, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రతకు నెలలో ఒక రోజు కేటాయించాలి ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 20 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు నెలలో ఒక రోజు కేటాయించాలని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా చీపురుపట్టి యార్డు పరిసరాలను ఊడ్చి శుభ్రం చేశారు. ప్రజలు అనారోగ్య సమస్యల భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రజలు, అధికారులు, మున్సిపల్ కార్మికులతో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



## ఓటర్లు బీఎల్‌వోలకు సహకరించాలి: ఆర్‌డీవో మురళీకృష్ణ

గురజాల, జూన్ 20 ప్రభాతవార్త : ఓటర్లు సకాలంలో తమ ఓటు ధృవీకరణ ఫారాలు సమర్పించి బీఎల్‌వోలకు సమకరించాలని ఆర్డీవో మురళీకృష్ణ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ మొదలైందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలన్నారు. గురజాల నియోజకవర్గంలో 36.82 శాతం సర్వే పూర్తయిందన్నారు. మొత్తం 2.75 లక్షల ఓటర్లలో 1,01,278 మందికి ఫారాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఓటర్లు సర్ సర్వేకు సహకరించాలన్నారు.

## కారంపూడి మండలంలో స్వచ్ఛభారత్

కారంపూడి, జూన్ 20 ప్రభాతవార్త: ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధంపై పలు గ్రామ పంచాయతీల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి కె.మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండాలన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలను, ప్రతిఒక్కరూ తమ ఇంటి దగ్గర, ఒక్కసారి వాడిపడేసే ప్లాస్టిక్ సంచులను వాడకూడదని, వాటికి బదులుగా గుడ్డ సంచులు, పేపర్ కవర్లు వాడాలని సూచించారు. అదేవిధంగా చేతులను ఎలా శుభ్రపరచుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు విద్యార్థులచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో స్థానిక హెచ్ఎం రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు బాలాజీనాయక్, మలేరియా సూపర్‌వైజర్ లాలునాయక్, పంచాయతీ కార్యర్శులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు కారంపూడి మోడల్ స్కూల్ విద్యార్థి

కారంపూడి, జూన్ 20 ప్రభాతవార్త: సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ పోటీలకు కారంపూడి మోడల్ స్కూల్ విద్యార్థి కలివెల మణిదేవ్ ఎంపికయినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుహాసిని తెలిపారు. 2023-24 సంవత్సరానికిగాను అప్లయి చేసిన విద్యార్థులకు గత సంవత్సరం ఆన్‌లైన్ పద్ధతిలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 111 మంది పాల్గొనగా 11 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి మణిదేవ్ ఎంపికవడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గైడ్ టీచరైన ఎ.ప్రసన్నలక్ష్మి, ప్రిన్సిపల్, ఎంఈఓ రవికుమార్ అభినందనలు తెలిపారు.

## అంతర్జాతీయ యోగాను జయప్రదం చేయండి

కారంపూడి, జూన్ 20 ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం నిత్య యోగ సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవ ర్యాలీ చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## సమస్యల వలయంలో విజయపురిసౌత్!

### కృష్ణమ్మ చెంత నీటికి చింత... కోతులు, కుక్కల బెడద

విజయపురిసౌత్, జూన్ 20 ప్రభాతవార్త: కూతవేటు దూరంలో కృష్ణమ్మ ఉన్నా గుక్కెడు నీళ్ల కోసం విజయపురిసౌత్ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క నీళ్లు లేక మరో పక్క విద్యుత్తు లేక నీటికి కటకటలాడుతున్నారు. గత మూడు రోజుల నుంచి నీళ్లు రావడంతో ఈ నెలలో రెండుసార్లు మోటారు పాడైపోయింది. ఈ నెలలోనే దాదాపుగా 15 రోజులు గ్రామంలో నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**ఇరిగేషన్ అధికారుల మొద్దు నిద్ర**

గ్రామంలో తీవ్ర నీటి కొరత ఏర్పడి గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది పూర్తిగా ఇరిగేషన్ అధికారుల మొద్దునిద్రకు పరాకాష్ట. అధికారులు అందుబాటులో ఉండరు, నీళ్లు ఉండవు. చిన్న గాలి వస్తే కరెంటు ఉండదు. ఇదీ ఇక్కడి పరిస్థితి. అధికారులు ఇక్కడ ఉండరు కాబట్టి వారికి ఈ బాధలు పట్టవు. ఇక్కడ ఉంటే నీటి బాధలు వారికి అర్థమవుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. నీళ్లు పంపింగ్ చేసే విధానంలో పలు లోపాలు ఉన్నాయి. నదిలో నుంచి ఫిల్టర్ హౌస్‌కి నీటిని పంపింగ్ చేసి తర్వాత శుద్ధిపరచి ఈ నీటిని సరఫరా చేస్తుంటారు. అయితే నదిలో నుంచి నీటిని తోడే




మోటార్లు రెండు ఒకదాని తరువాత ఒకటి మరమ్మతులకు గురయ్యాయి. అదిలా ఉంటే అసలు ఫిల్టర్ అయిన నీటిలో బ్లీచింగ్ కలపడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఫిల్టర్ అయిన నీరు నిల్వ ఉండే హౌస్‌ని ఈ మధ్యకాలంలో శుభ్రపరచడం లేదని, అందులో కోతులు పడి చనిపోయిన ఘటనలు కోకొల్లలని చర్చించుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీనికితోడు సిబ్బంది నిర్వాకంపై కూడా పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నీళ్లు, విద్యుత్తు సమస్యలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి మెయిన్‌గేట్ ఎదురుగా ఆవుదూడ పిల్ల చనిపోయింది. ఏ అధికారులు అటువైపు కన్నెత్తి చూడని వైనం. ఒకపక్క కుక్కలు పీక్కుతుంటూ దుర్వాసన వెదజల్లుతుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాగార్జునసాగర్‌కు గ్రహణం పట్టిందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. పారిశుద్ధ్య కార్మికులు లేక గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఏ వీధి చూసినా కోతులు, కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తూ ప్రజల్ని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పెడచెవిన ఎడుతున్నారు. గత నెలలో ఓ వృద్ధురాలిపై కోతి దాడి చేసి గాయపరచగా ఆమె చనిపోయింది. మరోవైపు వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

21-06pg10exHMNWJQE_21-06pg10exHMNWJQE.qxd 20/Jun/26 11:59 PM Page 1





# ఫైనల్లో భారత్ అమ్మాయిలు

**అక్లాండ్:** న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్‌ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత అమ్మాయిల అజేయ జైత్రయాత్ర కొనసాగుతోంది. సెమీ ఫైనల్లో చిలీపై 6-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఫైనల్లకి దూసుకెళ్లింది. భారత్‌తరపున నవనీత్ కౌర్, దీపిక చెరో రెండుగోల్స్... నేహా, రుతిజా పైసల్ ఒక్కో గోల్ సాధించారు. ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్-అమెరికా మ్యాచ్ విజేతతో భారత్ తలపడనుంది.

ప్రపంచ హాకీ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్న భారత విమెన్ జట్టు.. టోర్నీ ఆరంభం నుంచి అద్భుత ఆటతీరు కనబరుస్తోంది. లీగ్ స్టేజ్‌లో అమెరికా, జపాన్, ఉరుగ్వే జట్లపై విజయాలతో గ్రూప్ టాపర్‌గా సెమీస్‌కు వచ్చింది. చిలీతో జరిగిన సెమీఫైనల్లో సలీమా టెటె బ్రుందం ఆద్యంతం ఆధిక్యం ప్రదర్శించింది. మ్యాచ్ ప్రారంభమైన ఆరో నిమిషంలోనే నవనీత్ కౌర్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి బోణీ కొట్టింది.మరో ఏడు నిమిషాలకు రెండో గోల్ సాధించి భారత్ ఆధిక్యాన్ని 2-0కు చేర్చింది. ఇక దీపిక కూడా నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సాధించిపెట్టింది. 14వ నిమిషంలో ఓ గోల్, 18వ నిమిషంలోమరో గోల్ అందించింది. భారత్ అటాక్ గేమ్‌తో చిలీ రక్షణ పంక్తి కాకావికలమైంది. హాఫ్ టైమ్ విరామానికి భారత్ 4-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ భారత్ విమెన్ హాకీ టీమ్ ఆధిక్యం కొనసాగించింది. 32వ నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను నేహా గోల్‌గా మలచగా, మరో నాలుగు నిమిషాలకు రుతుజ పిసల్ ఫీల్డ్ గోల్ సాధించి తిరుగులేని ఆధిక్యాన్ని అదించింది. చివరి క్వార్టర్‌లో చిలీ గోల్స్ ప్రయత్నాలకు గోల్‌కీపర్ సవితా పునియా అడ్డుగోడలా నిలిచింది.

## పవర్ పంచ్‌కు ఆరు పతకాలు గ్యారంటీ



**గుయాంగ్ (చైనా):** వరల్డ్ బాక్సింగ్ కప్(స్టేజ్2)లో భారత బాక్సర్లు అదరగొట్టారు. మహిళల 57 కిలోల విభాగంలో ప్రాచీ సంచలనం సృష్టించింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత షి యూ కు షాకిచ్చింది. పిడిగుద్దులతో విరుచుకుపడ్డ ప్రాచీ 4-1తో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. మెడల్‌ను ఖాయం చేసుకుంది. 51 కిలోల విభాగంలో మీనాక్షి తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ (2025) కజకిస్థాన్ బాక్సర్ అలువ బల్కిబెకోవాపై 5-0తో స్పష్టమైన విజయం సాధించింది. పురుషుల విభాగం 70 కిలోల ఈవెంట్‌లో దీపక్ సంయమనంతో కూడిన ప్రదర్శనతో అజర్‌బైజాన్‌కు చెందిన నబీ ఇస్గందరోవ్‌ను 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించాడు.అలాగే నిఖిల్ (55 కిలోల విభాగం) కూడా అజర్‌బైజాన్‌కు చెందిన అమిన్ మమ్మద్‌జాదాపై 5-0తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ ఫలితాలతో అంతర్జాతీయ వేదికపై భారత బాక్సర్లు తమ బలమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఆరు పతకాలను ఖాయం చేసుకున్నారు.

**చెలరేగిన ఓపెనర్లు యశస్వీ, రోహిత్.. 5 వికెట్లు తీసిన ప్రసిద్ధ్ కృష్ణ**

# ఆఫ్ఘాన్‌పై వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్




**చెన్నై:** క్రికెట్ కూన ఆఫ్ఘానిస్తాన్‌తో మెన్ ఇన్ బ్లూ ఆడేసుకుంది. మూడో వన్డేలోనూ ఏకపక్ష విజయం అందుకుంది. ఏకంగా 9 వికెట్ల తేడాతో నెగ్గి మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.మొదట ప్రసిద్ధ్‌కృష్ణ(5/23) బౌలింగ్‌లో చెలరేగడంతో ఆఫ్ఘానిస్తాన్‌ను 44.2 ఓవర్లలో 218పరుగులకు ఆలౌటైంది. 219 పరుగుల లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ 28.4 ఓవర్లలో కేవలం రోహిత్ శర్మ(69 బంతుల్లో 79) వికెట్ మాత్రమే కోల్పోయి అందుకుంది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(86 బంతుల్లో 110 నాటౌట్, 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కాడు.

**తొలి ఓవర్‌లోనే 23 రన్స్**

219 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా తొలి ఓవర్లోనే 23 రన్స్ సాధించింది. అఫ్గాన్ పేసర్ అజ్మతుల్లా ఓమర్జాయ్ భారీగా పరుగులు ఇచ్చాడు. వైడ్లు, నోబాల్స్‌తో పాటు యశస్వీ జైశ్వాల్ మూడు ఫోర్లు బాదాడు.దీంతో టీమిండియా పెనాల్టీ రూపంలో లభించిన 5పరుగులతో కలిపి తొలి ఓవర్‌లో మొత్తం 23 రన్స్ చేసింది. అక్కడి నుండి ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్.. అఫ్గాన్ బౌలర్లపై బౌండరీల వర్షం కురిపించారు. వీరి ధాటికి భారత్ స్కోరు 6.4 ఓవర్లలో 50, 13.4 ఓవర్లలో 100, 21.1ఓవర్లలోనే 150 మార్కు దాటింది. ఈ క్రమంలో చెరో అర్ధసెంచరీ సాధించి సెంచరీలు చేసే ఊపులో కనిపించారు. ఈ దశలో రోహిత్‌ను నబీ అవుట్ చేసి 170 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (20నాటౌట్)తోకలిసి యశస్వీ మిగతా పనిని కంప్లీట్ చేసి మరో 21.2 ఓవర్లుండగానే భారత్‌కు విజయాన్ని సాధించిపెట్టాడు. ఈ క్రమంలో 38బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన యశస్వీ... 83 బంతుల్లో 13ఫోర్లు,2 సిక్స్‌లతో వన్డేల్లో రెండో సెంచరీని పూర్తి చేశాడు.

**నిప్పులు చెరిగిన ప్రసిద్ధ్ కృష్ణ**

అంతకుముందు టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘానిస్తాన్ ఇన్నింగ్స్‌ను ఆరంభంలోనే ప్రసిద్ధ్ కృష్ణ పదునైన బంతులతో దెబ్బతీశాడు. మొదట గుర్బాజ్(5)ను, ఆ తర్వాఆత జర్డాన్(11), రహత్ షా(5) రసూలీ(1)లను అవుట్ చేశాడు.దీంతో ఆఫ్ఘాన్ 36రన్స్‌కే 4వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఓమర్‌జాయ్(50)తో కలిసి హస్మతుల్లా షాహిది(131 బంతుల్లో 102) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కంటూ వికెట్ల పతనానికి ఫుల్‌స్టాప్ పెట్టడమే గాక అయిదో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని అందించి ఆదుకున్నాడు. ఓమర్ జాయ్‌ను ప్రిన్స్ యాదవ్ అవుట్ చేయగా, శుభ్‌మన్ గిల్ రెండు రనౌట్లు చేయడంతో ఆఫ్గాన్ 218 పరుగులకే కుప్పకూలింది. వాషింగ్టన్ సుందర్ వేసిన 44వ ఓవర్లో బౌండరీతో తొలి శతకం అందుకున్న షాహిదిని ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లు.. గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే తలో వికెట్ పడగొట్టారు.



## బ్రెజిల్ గెలుపు బోణీ - నాకౌట్‌లో అమెరికా

**ఫిలడెల్ఫియా :** ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్ ఫిఫా ప్రపంచ కప్ 2026లో గెలుపు బోణీ చేసింది. స్టార్ ప్లేయర్ నెయ్‌మర్ గైర్హాజరీలోనూ దూకుడుగా ఆడింది. రెండో మ్యాచ్‌లో 3-0 తేడాతో హైతీని చిత్తు చేసింది. మాథ్యూస్ కున్హా 23వ నిమిషంలో తొలి గోల్ సాధించి బ్రెజిల్‌కు ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత 36వ నిమిషంలో రెండో గోల్ చేశాడు. హైతీ నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. అప్పుడప్పుడు గోల్ పోస్ట్ వైపు బంతి వెళ్లినా.. గోల్‌ను సాధించలేకపోయింది. వినిసియస్ జూనియర్ (45+3వ నిమిషం) మూడో గోల్‌తో మరింత ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొరాకోతో తొలి మ్యాచ్‌ను డ్రా చేసిన బ్రెజిల్ ఈ మ్యాచ్‌లో గెలుపుతో నాకౌట్ అవకాశాలను మెరుగుపర్చుకుంది.ఈ ఓటమితో హైతీ ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించింది. కాగా సొంత అభిమానుల మధ్య అతిథ్య అమెరికా చెలరేగిపోతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి నాకౌట్‌కు చేరుకుంది. అమెరికా 2-0 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. కామెరూన్ బర్గెస్ (11వ నిమిషం), అలెక్స్ ఫ్రీమన్ (43వ నిమిషం) గోల్స్ చేసి అమెరికాను గెలిపించారు.



# తెలంగాణ టీ20 లీగ్ ధమాకా

**హైదరాబాద్, జూన్ 20(వార్త క్రీడా ప్రతినిధి):** తెలంగాణ టీ20 లీగ్‌కు నేడు తెరలేవనుంది. 20 రోజుల పాటు ఈ టోర్నీ ఆలరించనుంది. ఐపీఎల్ తరహాలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ లీగ్ తొలి సీజన్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి.హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్, రంగారెడ్డి రైజర్స్, మెదక్ ఫాల్కాన్స్,వరంగల్ వారియర్స్, పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్, కరీంనగర్ డైమండ్స్, నల్గొండ నైట్స్ జట్లు టీజీ20 లీగ్‌కు సిద్ధమయ్యాయి. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతాయి.

పాలమూరు స్ట్రయికర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ జట్ల మధ్య మ్యాచ్‌లో టీజీ లీగ్ ఆరంభం కానుంది. మ్యాచ్ రాత్రి 7.15ల నుండి జరుగుతుంది. తొలి రోజు ఒక మ్యాచ్ నిర్వహిస్తారు. రెండో రోజు నుంచి ప్రతి రోజు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. మధ్యాహ్నం 2.15 గంటలకు మొదటి మ్యాచ్, రాత్రి 7.15 గంటలకు రెండో మ్యాచ్ జరగనుంది. ఒక్కో జట్టు ప్రతి జట్టుతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. పాయింట్ల పట్టికలో టాప్ ఫోర్‌లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్‌కు చేరుతాయి. ఫైనల్ జూలై 10న జరగనుంది. ఆటగాళ్ల వేలంలో స్టార్ ప్లేయర్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్‌లకు భారీ ధర పలికారు. అంతర్జాతీయ ప్లేయర్లతో పాటు జాతీయ జట్టులోకి దూసుకొచ్చేందుకు తహతహలాడుతున్న యంగ్ ఎమర్జింగ్ ప్లేయర్లు ఈ టోర్నీలో ఆలరించనున్నారు. యువ క్రికెటర్లు తమ ప్రతిభను చాటేందుకు ఇది చక్కని వేదిక కానుంది.

**అలరించున్న సంగీత విభావరి**

తెలంగాణ టీ20 లీగ్ ఆరంభోత్సవం కలర్‌ఫుల్‌గా నిలిచేలా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సాయంత్రం అయిదున్నర గంటల నుంచి సంగీత విభావరి ఆరంభం కానుంది.సినీ సంగీత దర్శకుడు తమన్ హోరెత్తించనున్నాడు. కల్చరల్ ఈవెంట్స్ అలరించనున్నాయి. అలాగే ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నటుడు విజయ్ దేవరకొండ నటించిన అఫీషియల్ గీతం ఇప్పటికే హోరెత్తుతోంది. స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్‌లో మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం అవుతాయి.

## దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్‌కు నిరాశ



**దోహా:** గాయంతో చాన్నాళ్ల తర్వాత మళ్లీ జావెలిన్ పట్టిన భారత స్టార్ నీరజ్ చోప్రా... దోహా డైమండ్ లీగ్‌లో నిరాశపరిచాడు. జావెలిన్‌ను అత్యుత్తమంగా 85.69 మీటర్ల దూరం విసిరిన నీరజ్ చోప్రా నాలుగో స్థానంతో సరిపెట్టాడు. ఫౌల్‌తో ఆరంభించిన నీరజ్ చోప్రా.. రెండో ప్రయత్నంలో 82.77 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత వరుసగా 85.69మీటర్లు, 83.45మీటర్లు నమోదు చేశాడు. అయిదో ప్రయత్నంలో ఫౌల్ చేసి నిరాశగా ముగించాడు. 9 నెలల విరామం తర్వాత బరిలోకి దిగిన నీరజ్ పతకాన్ని త్రుటిలో కోల్పోయాడు. శ్రీలంక సంచలనం రుమేశ్ పతిరగె(88.68మీటర్లు) పసిడి పతకం సాధించాడు. గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (86.38మీటర్లు), అమెరికాకు చెందిన కర్టిస్ థాంప్సన్ (85.99మీటర్లు) రజత, కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. కామన్‌వెల్త్ క్రీడలకు నీరజ్ అర్హత సాధించాడు.





*Applicable T&C available at your nearest dealership. Ex-showroom price ₹13 99 900 for Grand Vitara Aspirion Edition, exclusively available in the Zeta (O) and Alpha (O) variants. Creative visualisation. Images used are for illustration purposes only. Features and accessories shown may not be part of the standard fitment. Black glass shade on the vehicle is due to lighting effect. Offers may vary and are subject to availability of stock. Maruti Suzuki India Limited reserves the right to discontinue an offer without further notice. Finance options available at the sole discretion of financier.


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14